

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume: 54, Issue: 5
OCTOBER - 2023 Price Rs. 20/-
తిరుమల తిరుపతి దేవస్థానములు
సప్తగిరి
ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక
అక్టోబరు 2023
వెల రూ. 20/-
పుటలు-56
శ్రీవేంకటాచలాధీశం, శ్రియోఽధ్యాసితవక్షసమ్।
శ్రితచేతనమందారం, శ్రీనివాస మహం భజే॥
తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
2023, అక్టోబరు 15 నుండి 23 వరకు

తిరుమల తిరుపతి దేవస్థానములు



# తిరుచానూరు
# శ్రీ పద్మావతీ అమ్మవారి
# బ్రహ్మోత్సవం
## 2023 నవంబరు 10 నుండి 18 వరకు

**10-11-2023 శుక్రవారం**
పగలు: బంగారు తిరుచ్చి ఉత్సవం,ధ్వజారోహణం.
రాత్రి: చిన్నశేషవాహనం

**11-11-2023 శనివారం**
పగలు: పెద్దశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**12-11-2023 ఆదివారం**
పగలు: ముత్యపుపందిరివాహనం
రాత్రి: సింహవాహనం

**13-11-2023 సోమవారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: హనుమద్వాహనం

**14-11-2023 మంగళవారం**
పగలు: పల్లకీలో ఉత్సవం
రాత్రి: గజవాహనం

**15-11-2023 బుధవారం**
పగలు: సర్వభూపాలవాహనం,
స్వర్ణరథోత్సవం
రాత్రి: గరుడవాహనం

**16-11-2023 గురువారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**17-11-2023 శుక్రవారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**18-11-2023 శనివారం**
పగలు: చక్రస్నానం, పంచమీతీర్థం
రాత్రి: తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం.



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** ఏవముక్త్వా హృషీకేశం గుడా కేశః పరన్తపః।
న యోత్స్య ఇతి గోవిన్దముక్త్వా తూష్ణీం బభూవ హ॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-09వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** పరన్తపః= శత్రువుల్ని తపింపజేయునట్టి; గుడాకేశః= అర్జునుడు; హృషీకేశమ్= శ్రీకృష్ణునితో; ఏవమ్= ఈ ప్రకారంగా; ఉక్త్వా= చెప్పి; నయోత్స్యే= యుద్ధం చేయను; ఇతి= అని; గోవిన్దమ్= (ఆ) కృష్ణపరమాత్మతో; ఉక్త్వా= పలికి; తూష్ణీం బభూవహ= ఊరకుండెను.

**భావం:** ఈ విధంగా అర్జునుడు శ్రీకృష్ణునితో 'నేను యుద్ధం చేయన'ని చెప్పి ఊరకున్నాడు.



## వేంకటనగమే కైవల్యపదం

అదివో అల్లదివో హరివాసము
పదివేలుశేషుల పడగలమయము

అదె వేంకటాచల మఖిలవున్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిలమునులకు-
నదె చూడుఁ డదె
మొక్కుఁ డానందమయము

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతలనిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారుశిఖరాల బహుబ్రహ్మమయము

కైవల్యపదము వేంకటనగ మదివో
శ్రీవేంకటపతికి సిరులై నది
భావింప సకలసంపదరూప మదివో
పావనములకెల్లఁ బావసమయము

(సం.1 - కీర్తన 23)

అన్నమయ్య ఈ సంకీర్తనలో 'అదివో! అల్లదివో!' అంటూ తిరుమల కొండను అందరికీ చూపిస్తున్నాడు. హరివాసం సాక్షాత్తు శ్రీమహావిష్ణువు కొలువు దీరిన కొండ. అది అన్నమయ్యకు పదివేలశేషుల పడగల మయంగా భాసించింది. ఎక్కడ చూచినా, ఏ పక్క నుండి చూచినా తిరుమల కొండ ఆనందాన్ని చేకూర్చే కొండ. ఇక శేషాచలం- ఆకాశంలోని దేవతలకు నివాసమైతే, మానవులకు ముంగిట్లో ఉన్న మూలధనం. ఈ కొండ మీద శిఖరాలు కేవలం రాళ్లతో ఏర్పడ్డవి కానేకావు. సాక్షాత్తు అవి దేవతామూర్తులు. ఈ కొండని ఎక్కడమే మోక్షం. శ్రీవైకుంఠనాథుని సమస్తసంపదలూ ఈ కొండేనని అన్నమయ్య గళమెత్తి గానం చేశాడు.

# శుభాకాంక్షలు



నవరాత్రి బ్రహ్మోత్సవాలలో
తిరుమల శ్రీవారు వివిధవాహనాలపై,
దేవీనవరాత్రులలో దుర్గామాత
పూటకొక అలంకారంతో దర్శనమిస్తూ
భక్తులచే విశేషపూజలందుకుంటూ ఉంటారు.
ఈ దేవతలిద్దరూ అందరికీ క్షేమ, స్థైర్య, ధైర్య,
విజయ, అభయ, ఆయురారోగ్య ఐశ్వర్యాలను,
సకలశుభాలను, సుఖసంతోషాలను
ప్రసాదించాలని ప్రార్థిస్తూ...
రచయిత(త్రు)లకు, పాఠకదేవుళ్లకు, ఏజెంట్లకు,
చందాదారులకు, భక్తులకు, శ్రీవారి బ్రహ్మోత్సవ,



## దసరా శుభాకాంక్షలు

- ప్రధాన సంపాదకుడు




# వేగంగా.. సులభంగా...

శ్రీవారిభక్తులు తమ లగేజీ, మొబైల్‌ఫోన్లను డిపాజిట్ చేసి తిరిగి తీసుకోవడం ఇప్పుడు సులభం.

- ఇందుకుగాను తి.తి.దే. కొత్తగా బాలాజీ బ్యాగేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (బీబీఎంఎస్)ను అమలు చేస్తోంది.
- ఈ విధానంలో భక్తుల లగేజీ, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తి.తి.దే. కేంద్రాల్లో డిపాజిట్ చేస్తే తిరుమలలో ఎక్కువ సేపు వేచి చూడకుండా తిరిగి పొందవచ్చు.
- భక్తులు లగేజీకౌంటర్ వద్దకు చేరుకోగానే దర్శన టిక్కెట్‌ను స్కాన్ చేస్తే వాటి వివరాలు ఎలక్ట్రానిక్ పరికరంలో నిక్షిప్తమౌతాయి.
- దర్శనటిక్కెట్‌లేని భక్తులపేరు, వివరాలు ఆధార్‌కార్డు ద్వారా నమోదు చేసుకుని బ్యాగ్‌కు ఆర్.ఎఫ్.ఐడీ ట్యాగ్‌ను అమర్చి, క్యూఆర్ కోడ్ రసీదు ఇస్తారు.
- మొబైల్‌ను భద్రంగా పౌచ్‌లో ఉంచి తిరిగి అందజేస్తారు.
- లగేజీ వాహనాలకు జీపీఎస్ అమర్చడం ద్వారా భక్తులకు వారి లగేజీ చేరే సమయం మెసేజ్ వస్తుంది.

తిరుమలలో 16 కేంద్రాల ద్వారా 44 కౌంటర్లలో ఈ ప్రక్రియ జరుగుతోంది.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 54 అక్టోబరు, 2023 సంచిక : 05




**వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥**


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఎ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.

**ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు**
సప్తగిరి మాస పత్రిక
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| **బ్రహ్మోత్సవ ప్రత్యేకం** | | |
| భక్తులనూ భాగస్వాములు చేసిన తి.తి.దే. | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 07 |
| బ్రహ్మోత్సవపతికి బ్రహ్మాండ నీరాజనం | డా॥ వేదాంతం శ్రీ విష్ణుభట్టాచార్య | 10 |
| వడ్డికాసులవాడా! వేంకటరమణా! | ఆచార్య కోసూరి దామోదరనాయుడు | 19 |
| ముక్కోటిదేవతలందరూ ఇక్కడే... | డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి | 21 |
| ఈయనకు తెలియని స్వామి రహస్యాలుండవు | డా॥ కె.రాధారమణ | 26 |
| తిరుమల అంటేనే ఆనందం | ఆచార్య శలాక రఘునాథశర్మ | 33 |
| శ్రీవేంకటేశా... దయాసాగరా | శ్రీమతి నల్లాని రాజేశ్వరి | 35 |
| ద్వాపర దీపమే... కలియుగ వేలుపు | శ్రీ దేసువేంకటసుబ్బారావు | 39 |
| ఒక పిలుపులో పిలిచితే పలుకుతావట... | ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు | 41 |
| **ధారావాహికం** | | |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 13 |
| తిరుమల సమయాచారములు | కీ.శే.డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే.శ్రీమాన్ టి.ఎ.కృష్ణమాచార్యులు | 17 |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 18 |
| 108 దివ్యదేశాలు- 'తిరునాగైపట్టణమ్' | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 44 |
| **బాలవికాసం** | | |
| సత్యమే జయిస్తుంది (నీతికథ) | శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు | 45 |
| ఆ నీళ్లే కదా అని అనుకోకూడదు (చిత్రకథ) | కథ: డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 48 |
| బాలవినోదం | | 50 |
| గోచికంటె దరిద్రం లేదు (వేమనశతకం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 52 |
| చెరపకురా చెడేవు! (భాస్కరశతకం) | డా॥ వద్దేపల్లి శ్రీనివాసరావు | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |
| **వనితాలోకం** | | |
| ఆటల నోము | డా॥ సుబ్బలక్ష్మి మర్ల | 37 |
| **అందరికోసం** | | |
| సర్వం శక్తిమయం జగత్ | బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు | 15 |
| పిడికెడు ముద్దలో... కొండంత అనుబంధం! | డా॥ కప్పగంతు రామకృష్ణ | 23 |
| తల్లీ! నిన్ను దలంచి... | శ్రీమతి రమా శాండిల్య | 31 |
| స్వామి అనుకుంటే ఎంతసేపు... | శ్రీ ఎం.సత్యనారాయణ | 40 |
| ఎవరెన్ని చెప్పినా ఇదే ఉత్తమం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 47 |


ముఖచిత్రం : చక్కని తండ్రి
వెనుకచిత్రం : చక్కని తల్లి



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

# జగత్కల్యాణోత్సవాలు

సమస్తభువనాల్లో 'సప్తగిరి' క్షేత్రం ఎంతో విశిష్టమైందే గాక సమస్తదేవతలకు ఆలవాలం. శ్రీవైకుంఠం లోని క్షీరసముద్రంలో శేషశాయిగా విరాజిల్లే పరమపురుషుడైన శ్రీమహావిష్ణువు ఈ పుణ్యక్షేత్రంలో దర్శనమిస్తూ అందరికీ అడిగిన వరాలను వరదానం చేస్తున్నాడు. అందుకనే ఈ దివ్యస్థలంపైన వెలసిన స్వామి కోరిన వరాలరాయడని కీర్తింపబడుతున్నాడు. ఈ స్వామికి భక్తలోకంలో ఏడుకొండలవాడు, వేంకటేశ్వరుడు, తిరుమలేశుడు, తిరుమలప్ప, శ్రీనివాసుడు, ఆనందనిలయుడు, అడుగడుగుదండాలవాడు అని ఎన్నో పేర్లు ఉన్నాయి.

బ్రహ్మాండాలన్నింటిలో తిరుమల క్షేత్రానికి సమమైన దివ్యస్థలం లేదట! అలాగే ఆ కొండలలో నెలకొన్న కోనేటిరాయడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారికి సాటిరాగల దేవుడు అటు గడచిన కాలంలోను ఇటు రాబోయే కాలంలోను లేడు, ఉండబోడు. ఎన్నో వందలాది దివ్యతీర్థాలతోను, ఎన్నో కొండలతోను కూడి ఉన్న ఈ ఏడుకొండలక్షేత్రంలో ఎప్పుడూ యాత్రికులతో సందడిగా ఉంటుంది. ఈ క్షేత్రంలో ప్రతిరోజూ పండుగే. ప్రతిపూటా పరమాన్నాలే, పాయసాలే.

సుప్రభాతం, సహస్రనామార్చన, నిత్యకల్యాణోత్సవం, డోలోత్సవం, సహస్రదీపాలంకరణసేవ, ఏకాంతసేవవంటి నిత్యోత్సవాలతోను, అష్టదళపాదపద్మారాధన, సహస్రకలశాభిషేకం, శుక్రవారాభిషేకంవంటి వారోత్సవాలతోను, పుష్పయాగం, పవిత్రోత్సవం, తెప్పోత్సవాలువంటి సంవత్సరోత్సవాలతోను శ్రీదేవి, భూదేవి ఇరువురు దేవేరులతో కూడి ఉన్న శ్రీనివాసుని వైభోగం మాటల్లో వర్ణించడానికి సాధ్యం కానేకాదు. అయితే వీటన్నిటిలో ఏడాదికి ఒకసారి జరిగే పదినాళ్ల బ్రహ్మోత్సవాలు అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.

శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రతి ఏడాది ఆశ్వయుజ శుద్ధపాడ్యమినుండి శుద్ధదశమివరకు పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. అధికమాసం వస్తే భాద్రపదమాసంలో ఒక బ్రహ్మోత్సవం, ఆశ్వయుజ మాసంలో మరొక బ్రహ్మోత్సవం చేస్తారు. భాద్రపదమాసంలో జరిగే బ్రహ్మోత్సవాన్ని వార్షిక బ్రహ్మోత్సవం అనీ, ఆశ్వయుజమాసంలో జరిగే ఉత్సవాన్ని నవరాత్రి బ్రహ్మోత్సవమని అంటారు.

'న మే *భక్తః ప్రణశ్యతి!'* అని శ్రీకృష్ణభగవానుని అభయప్రదానం! శ్రీనివాసుణ్ణి అర్థించిన భక్తులకు సకల మనోరథాలు సఫలమౌతాయి. భక్తులు మనసుతోనే అర్థిస్తారు. క్షణకాలం భౌతికనేత్రాలతో, చిరకాలం, మనోనేత్రంతో స్వామిని దర్శిస్తారు. సర్వవ్యాపకుడైన స్వామివారు మనోరథాలు గుర్తించి, వాళ్లను అనుగ్రహించి, ఆనందపరవశుల్ని చేస్తూ– ఆనందనిలయుడనే పేరు సార్థకం చేసుకుంటున్నాడు. 'ఆనందమే బ్రహ్మం' అని ఉపనిషత్తు. కనుక ఈ బ్రహ్మోత్సవాలు పరమాత్మ సంబంధమైన ఆనందోత్సవాలు. ఆ పరమాత్ముడే శ్రీనివాసుడు! స్వామిని భక్తులు అడిగే విషయాలు, ఆ స్వామి అనుగ్రహించే విధానం, స్వీకరించే మొక్కుబళ్ళు ఇవన్నీ... స్వామికీ, భక్తునికీ మాత్రమే తెలుస్తాయి. కానీ, అడిగినవారికి లేదనకుండా ఇస్తున్నాడన్నమాట మాత్రం సత్యం. సత్యం, పునఃసత్యం! స్వామిలో జనాకర్షణ, భక్తుల్లో ఆనందాకర్షణ నెలకొన్నాయి. కనుకనే కోరినవారికి కొంగు బంగారమని, క్షణసందర్శనభాగ్యంతో క్షణభంగురమైన జీవితమే తరింపజేసే కలియుగప్రత్యక్షమని ప్రతీతి!

ఈ శోభకృత్‌సంవత్సర శరత్కాలబ్రహ్మోత్సవాలు స్వామికి, భక్తులకూ యావద్విశ్వానికీ ఉత్సవాలే! ఈ ఉత్సవాలు సర్వదేవతలకూ ఆనందోత్సవాలు! భక్తులు క్రమశిక్షణతో, సద్భక్తితో, సంప్రదాయపరిరక్షణతో ప్రవర్తిస్తూ, ఈ మహోత్సవాలను విజయవంతం చేయడంలో ఎవరికి వారు తమపాత్ర సమర్థవంతంగా నిర్వహిస్తారని, నిర్వహించాలని ఆకాంక్ష!



# భక్తులనూ భాగస్వాములు చేసిన
# తిరుమల తిరుపతి దేవస్థానములు

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478

ఆలయం, ఆలయసంరక్షణ, ఆలయపాలనం అనేవి పరస్పరానుబంధం గల త్రివేణీసంగమం లాంటిది.

సనాతన ధర్మానికి ఆలయాలు ఆటపట్టు మాత్రమే కాదు ఆయువుపట్టు కూడా. ఆలయవైశిష్ట్యం అవగతం చేసుకున్న చక్రవర్తులు, రాజాధిరాజులు, మహారాజులు, జమీందారులు, సంపన్నులు ఆలయాల పట్ల అభినివేశం పెంచుకుని రకరకాలైన సేవలు చేశారు. ఈ సేవాకార్యక్రమాలలో సామాన్యులు కూడా 'ఉడుతాభక్తి' అనే రకంగా తమవంతు సహకారం అందించిన వారే.

ఆలయపాలనం 'కత్తిమీది సాము'. కొన్ని సందర్భాలలో జారుడుబండ. సహస్రనేత్రాలతో అనుక్షణం పరిశీలిస్తూ, క్లిష్టసమయాలలో తగు నిర్ణయాలు చేస్తూ, అవి అమల్లోకి వచ్చేలా భక్తాదులందరికీ సంప్రీతికరంగా ఆలయాలను నిర్వహించడం సమర రంగవిన్యాసం లాంటిదే. వీటిలో ప్రధానమైంది, భక్తజనుల కోరికలను తీర్చడం, నెరవేర్చడం!



తిరుమలకు విచ్చేసే భక్తులలో అత్యధికులు మూల విరాట్ దర్శనానికే ప్రాధాన్యమిస్తారు. ఉత్సవవరులకు జరిపే అనేక ఉత్సవాలు నయనానందకరమైనా వారి దృష్టి అంతా శ్రీవారి వైపే మొగ్గు చూపుతుంది. ఇది తిరుగులేని సత్యం. అలసిసొలసిన దేహానికి ఉద్యానవనాల మీద వీచే గాలి ఎంత హాయినిస్తుందో అలాగే తిరుమలలోని భక్తులు కారణాంతరాల వల్ల పడ్డ శ్రమ అంతా 'సర్వావయవసౌందర్య సుశోభితాకారుడు' అయిన శ్రీవేంకటేశ్వరస్వామిని లిప్తకాలంలో చూడగానే ఉపశమిస్తుంది. ఈ దృష్ట్యా తి.తి.దే. వివిధ ఆర్జితసేవల్ని సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఈ సేవల రూపేణా భక్తాదుల మనోభీష్టాలు నెరవేరడంతో పాటు స్వామివారి దర్శనం జత కావడంతో ఎనలేని సంతోషం.

ఆర్జితసేవల నిర్వహణ ఎంతో బాగున్నా కానీ ఆలయ ప్రయోజనాలు అనేకమనడాన్ని తి.తి.దే మొదటినుండి గుర్తిస్తూ ప్రణాళికలు సిద్ధం చేసింది. వాటిలో 'ట్రస్టులు' అనేవి ఒకటి.

ఒక నిర్దిష్ట ప్రయోజనం సాధించడం కోసం భక్తాదుల సహాయంతో నిర్ణీత సొమ్మును వసూలు చేసి అనుకున్న నిర్దిష్ట ప్రయోజనాలు సాధించడమే 'ట్రస్టు' స్వరూపం. తి.తి.దే. రకరకాలైన ట్రస్టులలో 'శ్రీవాణి' ట్రస్టు విలక్షణం, వివేకవంతం, విశిష్టం.

సనాతన హిందూధర్మప్రచారంలో, పురాతన దేవాలయాల పునరుద్ధరణ, నూతనఆలయాలు, భజనమందిరాల నిర్మాణానికి తోడ్పాటు నందించాలన్న ప్రధానలక్ష్యంతో 28-08-2018న 'శ్రీవాణి ట్రస్టు' ఏర్పాటైంది.

ఆలయనిర్మాణం అనే సంకల్పం పూర్వజన్మసుకృతం ఉంటేనే తప్ప సాధ్యం కాదు. ఆలయప్రతిష్ఠ అంతకంటే మహత్తరమైన కార్యం. దేవాలయనిర్మాణం కోసం, చేసే ఏ పనైనా అనంతమైన పుణ్యఫలాల నిస్తుంది. విగ్రహం తయారు చేయించి అందించడం, విగ్రహప్రతిష్ఠ, యాగం మొదలైన వాటి ఫలం మాటల్లో చెప్పనలనవి కాదు. ఇసుకను రాశిగా పోసి అది ఆలయం అన్నా.... అది సమస్తసంపదలనూ, కీర్తినీ అను గ్రహిస్తుంది అని చెబుతుంది అపరాజితపృచ్ఛ ఆగమం. దేవాలయనిర్మాణం, విగ్రహప్రతిస్థాపన, పూజాదర్శనాది కార్య క్రమాలు సమస్తపాపాల నుండి మానవుల్ని విముక్తుల్ని చేస్తాయి. వాళ్లకు చతుర్విధపురుషార్థాలు సిద్ధిస్తాయి, కీర్తి, జయం కలుగుతాయని చెబుతోంది. ప్రాసాదమంజరి.

శ్రౌత సంబంధమైన వాజపేయాది యజ్ఞాలు ఆచరిస్తే ఎంత ఫలితం వస్తుందో... ఈ భూమి పై ఉన్న సకల పుణ్య తీర్థాలలో స్నానమాచరిస్తే ఎంత ఫలితం వస్తుందో.., శాస్త్రోక్త మైన అన్ని దానాలనూ చేస్తే ఎంత ఫలితం వస్తుందో... దానికి సమానమైన ఫలితం ఒక్క దేవాలయనిర్మాణం వల్ల కలుగుతుంది అని చెబుతోంది పురుషోత్తమసంహిత. దేవాలయనిర్మాతకు, ప్రతిష్ఠాకర్తకు ఐశ్వర్యం, విజయం, పుణ్యం, ఆయుష్షు, ఆరోగ్యం, సర్వశత్రుక్షయం, సర్వోపద్రవ నాశనం. ఆహారసమృద్ధి కలిగి చివరకు అతడు మోక్షప్రాప్తి పొంది భగవంతుని సాయుజ్యం పొందుతాడని చెబుతోంది కపర్దీ సంహిత.

ఆలయాలు కేవలం పూజలకు, మొక్కుబళ్లకే కాదు. ఎన్నో శుభకార్యాలు నిర్వహించడానికీ సమాజాన్ని ఐక మత్యంతో, ఉత్తమభావాలతో నడిపించడానికీ కేంద్రాలు. అక్కడి శిల్ప, చిత్రకళాసంపద జాతివారసత్వసంపద. దాన్ని రక్షించడం, నూతన ఆలయాల్ని నిర్మించడమూ మన బాధ్యతే! ఈ బాధ్యత నిర్వహించడంతో భావితరాలకు మన జాతి యొక్క ఔన్నత్యాన్ని, జ్ఞానవిజ్ఞాన సంపదలను, ఉత్తమకళావైభవాన్ని అందించిన వాళ్లమౌతాం. అక్కడ జరిగే ఉత్సవాలలో అందరూ సమానంగా పాల్గొనడం వల్ల వర్ణ, వర్గ, వైషమ్యాలు దూరమై అందరమూ భగవత్సేవలో సమానులనే పవిత్రభావన ఏర్పడి, సమసమాజ నిర్మాణం కూడా చేసిన వాళ్లమౌతాం.

తమిళంలో 'కోవిల్ ఇల్లా ఊరిల్ కుడి ఇరుక్క వేండాం' అని సామెత. కోవెల లేని ఊరిలో నివాసం చేయవద్దు అని ఆ సామెతకు అర్థం. అధికారి ఉన్న కార్యాలయంలో అన్నీ సక్రమంగా ఉంటాయి. అలాగే భగవంతుని ఆవాసమైన గుడి



ఉంటే ప్రజలభావనలలో 'ఆస్తిక్యం' పునాదిగా రూపుదిద్దుకుంటుంది. పిల్లల కైతేనేం, పెద్దల కైతేనేం, అక్షరాస్యుల కైతేనేం, నిరక్షరాస్యుల కైతేనేం కొండంత బలాన్ని కలిగించేది ఆలయమే.

ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకునే తి.తి.దే. 'శ్రీవాణి' ట్రస్టు పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా లభించిన ధనంతో 176 పురాతన ఆలయాల పునరుద్ధరణ జరిగింది. వెనుకబడ్డప్రాంతాల్లో మొత్తం 2,273 ఆలయాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. వీటిలో 1,953 ఆలయాలను ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ, 320 ఆలయాలను సమరసత సేవ ఫౌండేషన్‌వారు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధమై ఆ దిశలో ముందుకు సాగుతోంది తి.తి.దే.

ఈ ట్రస్టుద్వారా శ్రీవారిదర్శనం చేసుకున్నవారు తామూ రథంలాగుతూ తమ బలంవల్ల కూడా రథం లాగబడుతోందనే అల్పసంతోషాన్ని అనుభవించగలుగుతారు. అనేక ఆలయాల



నిర్మాణానికి పరోక్షసాహాయ్యం అందించిన వారవుతారు. సింధువును చేరి బిందువు సింధువౌతుంది. ధ్యేయాన్ని బట్టి ప్రతిపనీ దివ్యమౌతుంది. ఆలయ నిర్మాణం వెనుక మన జాతీయసంపదను భద్రపరచుకోవడం ఉన్నదని ప్రతి పౌరుడూ గుర్తించాలి.

**ఆలయాలు క్షేమంగా ఉంటే..**
**జాతి జీవన ఆలయం కూడా క్షేమంగా ఉంటుంది.**

## ఆగష్టు నెల క్విజ్-13 సమాధానాలు

01) జ్ఞానఫలం
02) ఆకాశరాజు
03) గరుడపురాణం
04) చంద్రుడు
05) ఆదిపర్వం
06) నైమిశారణ్యం
07) కశ్యపమహర్షి
08) ఐరవకౌరవ్యుడు
09) జంద్యాలపూర్ణిమ
10) గాయత్రిమంత్రం
11) పదహారురకాలసేవలు
12) శ్రవణం
13) బభ్రువాహనుడు
14) చిత్తవృత్తినిరోధం
15) కద్రువ
16) భరతుడు
17) బకాసురుడు
18) బ్రహ్మగుప్త 2
19) శ్రీధరుడు
20) లల్లా

**సరైన సమాధానాలు వ్రాసినవారు-**

01) కె.జోషిత, చోడవరం.
02) పోతు శరణ్య, జగిత్యాల.
03) గీతాంశు, హైదరాబాదు.
04) పి.లికిత్ కృష్ణ, తిరుపతి.
05) బలివాడ హితేంద్ర, రెడ్డిపేట, శ్రీకాకుళం జిల్లా.

## 51వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు



# బ్రహ్మోత్సవపతికి బ్రహ్మాండ నీరాజనం

– డా|| వేదాంతం శ్రీ విష్ణుభట్టాచార్య

స్వామివారు ఆనందస్వరూపుడు. అందుకే ఆయన విమానానికి ఆనందనిలయవిమానమని పేరు. ఆయనకు ప్రతినిత్యం వైఖానస ఆగమశాస్త్రప్రకారంగా అర్చనాదులు జరుగుతున్నాయి. పూర్వం బ్రహ్మ ఆయనకు ఉత్సవం జరిపించాడని, అందుకే దానికి బ్రహ్మోత్సవమని పేరేర్పడినదని అంటారు. అందుకే ఆ ఉత్సవం పురాణోక్తంగానే కాక వైఖానస ఆగమశాస్త్ర ప్రకారంగా ప్రతిసంవత్సరం కన్యామాసంలో రవి ప్రవేశించిన తరువాత వచ్చే శ్రవణనక్షత్రానికి అవభృధమని నిర్ణయించి దానికి పూర్వం తొమ్మిదిరోజులు బ్రహ్మోత్సవం చేయటం పరిపాటి అయింది. అయితే ప్రతి రెండు సంవత్సరాలకు ఒక అధికమాసం వచ్చినందువల్ల అధిక బ్రహ్మోత్సవం మాత్రం ఆశ్వయుజమాసంలో శ్రవణనక్షత్రాన్ని ప్రధానంగా పెట్టుకుని జరుపుతారు. ఇందుకు కారణంగా ఒక్కటి మాత్రం మనం గుర్తించవచ్చు. ప్రాంతీయ భేదాలనుబట్టి సౌరమానమని, చాంద్రమానమని రెండురకాలు. మనకు చాంద్రమానం, తమిళులకు సౌరమానం. ఈరెండింటి ప్రభావంవల్ల తిరుమల స్వామివారి ఉత్సవాలు కూడా కొన్ని చాంద్రమానంగానూ కొన్ని సౌరమానంగానూ జరుగుతాయి. ఆ ప్రభావంవల్ల బ్రహ్మోత్సవం కూడా అధికమాసం వచ్చినపుడు ఆ సమయం వృథాకాకుండా బ్రహ్మోత్సవానికే వెచ్చించి అధిక బ్రహ్మోత్సవమని చేయటం సంప్రదాయం. అసలు బ్రహ్మోత్సవ అంతరార్థమేమిటో పరిశీలిద్దాం.

బ్రహ్మోత్సవంలో ప్రధానంగా అంకురార్పణ, ధ్వజారోహణహోమం, స్నపనవాహనసేవలు ఆస్థానం అవభృథం అనే అంశాలు ఎనిమిది ఉన్నాయి. ఇవి వైదికకాలంనాటి యజ్ఞానికి ప్రతీకలు. దేశసంప్రదాయాలు మారుతున్న దృష్ట్యా యజ్ఞాలు ఆచరించటం కష్టతరం. వాటికి ప్రతినిధులుగా ఆలయాలు ఆవిర్భవించాయి. అందుకే "యజ్ఞోవైవిష్ణుః విష్ణుర్యజ్ఞః" అనే ప్రమాణాలతో ఆయనను యజ్ఞపురుషుడిగా భావించి యజ్ఞంతో యజ్ఞపురుషుణ్ణి ఎట్లా సేవిస్తారో అదేవిధంగా ఆలయంలో విష్ణువును యజ్ఞానికి ప్రతిరూపాలైన కర్మల ద్వారా సేవిస్తారు.



## యజ్ఞం - ఆలయం

వైదికకాలంలో ప్రతినిత్యం పంచమహాయజ్ఞాలు ఆచరించేవారు. ఈనాడు అదే సంప్రదాయంతో ఆలయంలో పంచబేర అర్చన జరుగుతుంది. గార్హపత్యాగ్ని నుండి మిగిలిన అగ్నులకు అగ్నిని పంపితే ధృవమూర్తి నుండి కౌతుకాది బింబాలకు శక్తి పంపబడుతుంది. విశేషకాలంలో విశేషయాగాలకు బదులు విశేషపూజలు సంవత్సరానికి ఒకసారి జరిపే సోమయాగానికి బదులు కాలోత్సవమని జరపడం పరిపాటి అయింది. అంటే వైదికక్రియలతో సమానమైంది ఆలయక్రియలన్నమాట.

## ఉత్సవం - వైశిష్ట్యం

ఉత్సవం విశేషపూజలన్నింటికంటే ఒక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇందులో బ్రహ్మ, ఇంద్ర, అగ్ని, యమ, నిర్‌ఋతి, వరుణ, వాయువ్య, కుబేర, ఈశాన ఆలయాది దేవతలు సపరివార సాంగంగ ఆహ్వానింపబడతారు. ఇంతేకాక వీరికి ప్రతినిత్యం ఉత్సవం పూర్తయ్యేవరకు వీరికి పుష్పం, తోయం బలి ఉదకం సమర్పిస్తారు. స్వర్గలోకదేవతలనందరినీ కూడా ఉత్సవసమయానికి ఆహ్వానించడానికి గరుడుని స్తోత్ర గద్యపద్యవాద్యాలతో ఆకాశంలోకి పంపుతారు. వీరినందరినీ ఆహ్వానించి వారి సమక్షంలో ఉత్సవం బ్రహ్మాండంగా జరుపుతారు. అధికమాసంలో వచ్చే రెండవ బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణ, అవరోహణలుండవు గనుక ఇక్కడ వాటిని ప్రస్తావించడం లేదు.

## హోమం

ఆహ్వానింపబడ్డ దేవతల తృప్తి కొరకు హోమం ఆచరించబడుతుంది. నేతిని సంస్కరించి ప్రతిదేవత నామంతో మూడుకాలాలలో హోమం చేసి చివరకు హోమశక్తిని కుంభం ద్వారా మూలబింబంలోకి చొప్పిస్తారు. అగ్నికి అశుచి అంటదు. అగ్ని అన్నివేళలా పవిత్రమైంది. దేవతలు కూడా ఎల్లపుడూ పవిత్రులే. అందుకే హోమక్రియ ఒక విశిష్టతను సంతరించుకుంది.

## వాహనసేవలు

స్వామివారిని వృద్ధులు, స్త్రీలు, దివ్యాంగులు దర్శించడానికి వీలుగా వివిధరకాల వాహనాలలో ఊరేగించవచ్చు. తొమ్మిదిరోజులుగానీ, ఏడురోజులుగానీ, ఐదురోజులుగానీ, మూడురోజులుగానీ ఒక దినముగానీ ఈ విధంగా జరుపవచ్చు.







## 2023, నవంబరునెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 10-18 | తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవం |
| 12 | నరకచతుర్దశీ, దీపావళి అమావాస్య |
| 13 | కేదారగౌరీవ్రతం |
| 14 | తిరుచానూరు, శ్రీపద్మావతీ అమ్మవారి గజవాహనోత్సవం, బాలలదినోత్సవం |
| 17 | నాగులచవితి |
| 18 | పంచమీతీర్థం |
| 19 | తిరుమల శ్రీవారిపుష్పయాగం, తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి పుష్పయాగం |
| 24 | కైశికద్వాదశి, శ్రీచక్రతీర్థముక్కోటి |
| 26 | కార్తిక పూర్ణిమ |

ఛత్రచామరాలు మొదలైన రాజోపచారాలతో వివిధ రకాలవాయిద్యాలతో దేవుణ్ణి ఊరేగించటం పరిపాటి.

### ఆస్థానం

వాహనసేవ అయిన వెంటనే ప్రాతఃకాలంలో సాయం సమయంలో స్వామివారికి శ్రమను తగ్గించడానికి ఆస్థానం జరుగుతుంది. ఉపచారాలు జరిపి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి విశేష నివేదనాదులు జరిపి దేవదేవునికి తృప్తి కలిగిస్తారు.

### అవభృథం

యజ్ఞాంతంలో యజమానుని మంత్రజలాలతో అభిషేకించటం ముఖ్యాంశం. అదేవిధంగా స్వామివారికి ఉత్సవం చివరిదినాన అవభృథస్నానం జరిపించి సుదర్శనచక్రాన్ని తటాకంలో నిమజ్జనచేస్తారు. ఆ సమయంలో భక్తులు స్నానం చేస్తే విశేషపుణ్యం లభిస్తుంది. ఇది పూర్తిగా యజ్ఞ ప్రక్రియకు ప్రతి రూపమే.

ఈ క్రియలన్నీ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, జగజ్జేగీయమానుడు అయిన శ్రీభూసహిత మలయప్పస్వామికి విశేషఅలంకారాలతో పెద్దశేషవాహనం నుండి తిరుచ్చి ఉత్సవం వరకు ప్రతిసంవత్సరం నిర్ణయింపబడ్డవిధంగా వాహనసేవలు జరుగుతాయి.

ఉత్సవక్రియలన్నీ దాదాపుగా యజ్ఞక్రియలతో పోలి ఉంటాయి. యజ్ఞపురుషుడైన విష్ణువును యజ్ఞక్రియలతో అర్చించటం విశేషమేగదా! అందుకే అన్ని ఉత్సవాలలోనూ బ్రహ్మోత్సవాన్ని ఒక వినూత్న ప్రక్రియగా అభివర్ణించవచ్చు.

## తిరుమల కాలినడకదారి, ఘాట్ మార్గాల్లో జాగ్రత్తలు



- ఘాట్‌రోడ్డులో సాయంత్రం 6 గం॥ తర్వాత ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు.
- రెండు నడకమార్గాలలో మధ్యాహ్నం రెండుగంటల వరకు మాత్రమే చిన్నపిల్లలను అనుమతిస్తున్నారు.
- పెద్దలను కూడా రాత్రి పదిగంటలవరకు మాత్రమే అలిపిరి కాలినడకమార్గంలో అనుమతిస్తారు.
- అలిపిరి నడకమార్గంలోని ఏడోమైలు వద్ద పోలీసుశాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు ట్యాగ్‌లు వేస్తారు. ట్యాగ్‌లు వేయడంవల్ల పిల్లలు తప్పిపోయినా సులభంగా కని పెట్టేందుకు వీలవుతుంది. ట్యాగ్‌పై చిన్నారి పేరు, తల్లి దండ్రుల వివరాలు, ఫోన్ నంబరు, పోలీస్ టోల్ ఫ్రీ నంబరు నమోదు చేసి ఉంటాయి.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



గత సంచిక తరువాయి...

శ్రీహరి వేంకటాచలంలో శ్రీదేవితో క్రీడాద్రి పరిసరాలలో విహరిస్తున్న కాలంలో కొందరు తాపసదంపతులు దూరప్రాంతంనుండి ఆ ప్రదేశానికి వచ్చారు. అక్కడి ప్రకృతికి పరవశించారు. వృక్షాలను అల్లుకున్న తీగలు ఆకాశాన్నంటే ఎత్తైన చెట్లు, ఆ ప్రదేశంలో లభిస్తున్న కందమూలఫలాదుల సమృద్ధిని చూచి తాపసులు నివ్వెరపోయారు.

ఆహా! ఈ పర్వతమెంత రమణీయమో కదా! ఈ ప్రదేశం చూచాక మరెక్కడికో పోవడమెందుకని తర్కించుకున్నారు. ఇక్కడే వాసం చేద్దామని ఏకమనస్కులై నిశ్చయించుకున్నారు. అందుకు తగ్గట్టు పర్ణశాలాది నిర్మాణాలు కూడా చకచకా పూర్తి చేసుకున్నారు. రోజులు గడిచిపోతుంటే ఇలాంటి ప్రదేశంలో తమకు ఆశ్రయమిచ్చిన పవిత్రభూమిలో సర్వలోకసంక్షేమార్థం ఒకయాగం చేస్తే బాగుంటుంది కదా అని నిర్ణయించుకున్నారు. అందుకు తగ్గట్టు సన్నాహాలు కూడా మొదలయ్యాయి.

ఈ తతంగమంతా చూస్తున్న శ్రీహరి సాగరతనయతో "లక్ష్మీదేవి! ఈ గిరులలో మనం ఎన్నోమార్లు విహరించాం. ఇక్కడి ప్రకృతి రామణీయకత్వానికి పరవశించాం కూడా. కానీ జనసంచారంలేనిచోట తాపసమునులెవ్వరో యాగం చేయడానికి సంసిద్ధులైనట్లు తెలుస్తోంది. ఇక్కడి తతంగమంతా మనం చూద్దామా! అంతేకాదు మనం సహజవేషంతో కాకుండా అన్య వేషంతో అక్కడికి వెళదాం. నేను విటవేషధారిని అవుతాను. నీవుకూడా అలాంటి ఆకారంతో నన్ను అనుగమించు. మనమిద్దరం యాగభూమినంతా చుట్టి వద్దాం. మరొక్కవిషయం యాగం చివర బ్రాహ్మణులు అగ్నికుండంలో 'వప'ను అర్పించేవేళ నేనే స్వస్వరూపంతో ఆ 'వప'ను ఆరగిస్తాను. నీవు ఆ దృశ్యాన్ని చూద్దువుగానిక అన్నాడు.

హరి ఆదేశించినట్లే శ్రీసతి విశ్వమోహినీదేవి ఆకారస్వరూపిణి అయ్యింది. అలాగే హరి అందరినీ ఆకర్షించేట్టు విటవేషధారి అయ్యాడు. శ్రీదేవి హరిని అనుగమిస్తూ ఉంటే, వారిద్దరూ విలాసంగా సంచరిస్తుంటే యాగభూమిలోని తాపసులు తదేకంగా ఆ దంపతుల్ని చూచారు.

ఎవరు వీరు? ఈ యాగభూమిలో వీరి సంచారం ఏమిటి? కనిపించే సుందరుడు వసంతమాధవుడా? నలుడా? జయంతుడా! దేవేంద్రుడా! చంద్రుడా! లేదా ఈశ్వరుడా! అయినా వీరు నిర్జనమైన భయంకర కీకారణ్యప్రాంతానికి ఎందుకు వచ్చారు? వీరు బ్రాహ్మణులా! మెడలో యజ్ఞోపవీతం ఉంది. కాదు క్షత్రియుల్లా ఉన్నారు. మగవాని చెంత దివ్యాయుధం ఉంది. వీరి ఆకారం మాత్రం విటవేషం కావడం చిత్రమని తాపసులు తమలో తాము అనుకున్నారు. ఇవేమి పట్టించుకోకుండా విటదంపతులు తాపసుల గుంపులో ఒకరుగా చేరిపోతూ వారి మధ్య ఒకచోట కూర్చొని విలాసంగా తాంబూలసేవనం మొదలెట్టారు. ఆ దంపతులు నోటబెట్టుకొని సేవిస్తున్న కస్తూరీభరితతాంబూల సుగంధానికి తాపసులు చకితులయ్యారు. అయినా కాసేపటికి తమాయించుకుని ఆ దంపతులను చూసి "మహారాజా! మీ ఊరేది? మీపేరేమిటి? మీ తల్లిదండ్రులెవరు? ఈ నిర్జనప్రదేశానికి ఎందుకు వచ్చారు. మీరు తిరిగే చోటు కాదే? చూడండి. ఇక్కడ తాపసులం ఒక యాగం చేస్తున్నాం. అయినా మీరు రావడం, మిమ్మల్ని చూడడం మా అదృష్టం. మీరు మాతోనే ఉండండి. అయితే ఒక చిన్న విన్నపం. మా యాగాన్ని ధ్వంసం చేయడానికి ఎందరో ఉండవచ్చు. మీరు మాకు సహాయకులుగా ఉంటూ యాగనిర్వహణలో అడ్డువచ్చే దానవుల నుండి యాగాన్ని, మమ్మల్ని రక్షించండి. తాపసులకు రాజులే కదా సదా రక్షకులు! అయినా మేము సర్వలోకసంక్షేమాన్ని

ఉద్దేశించి చేస్తున్న ఈ యాగానికి మీరే నిర్వాహకులు కండి” అన్నారు వినయంగా.

వారి మాటలన్నీ విన్న చక్రి నవ్వుతూ “తాపసులారా! ఒక చిన్నమాట నేను బ్రాహ్మణుణ్ణి, రాజుని, వైశ్యుడను కాను. అసలు నాకు జాతి అంటూ ఒకటి లేదు. మీరడిగారు కదా తల్లిదండ్రులెవరని? నాకు తల్లిదండ్రులు లేరు. నాకు ఒక చోటంటూ నివాసమూ లేదు. అన్ని స్థలాలలోను ఉంటాను. అన్ని రూపాల లోను నేనుంటాను. ఒక పేరంటూ లేని నాకు వయోగతమైన బ్రహ్మచర్యాది ఆశ్రమాలూ లేవు” అని చెబుతుంటే మునులు తలలు పట్టుకున్నారు.

“అయ్యా! మీరు చెప్పిందేది అర్థం కావడం లేదు. అయినా మీతో పాటూ కూర్చున్న ఆ తల్లి ఎవరు?” అని ప్రశ్న వేశారు.

ఓహో! అలాగా, నా పక్కన కూర్చున్న ఆవిడ గురించి వాకబు చేస్తున్నారు. ఇందాక నేను నాకెవరు లేదన్నాను. నేను ఒంటరిగా కనబడితే ఈమె అడవినుండి వయ్యారంగా నడిచి వస్తూ మోహినిలా నన్ను పట్టుకుంది. పోనీలే అని ఆవిడతో తిరుగుతుంటే మీ యాగశాల కనబడింది. నిష్ఠాగరిష్టులైన మీ వాలకాన్ని దగ్గరుండి చూడాలని వచ్చాం. అంతే! అయినా



చిత్రసౌజన్యం: శ్రీ ఎస్.వి.రమణ

తెలియక అడుగుతున్నాం. ఏమి అనుకోకండి. మీలో కొందరు ఒక చోట కూర్చొని శ్రావ్యంగా పాడుతున్నారే. ఆ పాట ఏంటి? ఆ సంగీతం ఏమిటి? ఎప్పుడూ ఇలాంటి సంగీతం మేం వినలేదు. అయినా కొందరు దేవతల్ని ఎలుగెత్తి పిలుస్తున్నా రెందుకు? ఈ ప్రదేశమంతా అగ్నికుండలాలు ఎందుకు? ఇక్కడ కొయ్య పాత్రలే కనిపిస్తున్నాయెందుకు? యూపస్తంభానికి కట్టిన ప్రాణులెందుకు? అంతా చిత్రంగా ఉందే!” అని శరపరంపరగా ప్రశ్నలు వేశాడు.

ఈలోగా అగ్నికుండం దగ్గరి వ్యక్తులు నూతనంగా వచ్చిన దంపతులతో మాటలు పెంచుకుంటున్న తాపసులను చూచి– “రండి రండి సమయం మించిపోతూ ఉంది. ‘వప’ హోమం చేయాలి. ఆ ఆహుతి అయ్యాక దంపతుల దగ్గరికి వచ్చి అన్ని శాంతంగా చెబుదురుగాని అని ఆదేశించారు.

తాపసులు వెనువెంటనే అగ్నికుండంకేసి కదిలారు. వేదోక్తమంత్రాలతో ‘వప’ను అర్పిస్తూ ఉంటే శ్రీహరి శంక చక్రాదులతో సాక్షాత్కరించి తాపసులు అర్పించే ‘వప’ను స్వీకరించాడు. ఈ దృశ్యాన్ని చూచిన మునులు నివ్వెరపోయారు. కదలనిబొమ్మల్లాగా నిశ్చేష్టులయ్యారు.

స్వామి శ్రీవత్సలాంఛనంతో, దివ్యరథాభరణాలతో వేయి కోట్ల సూర్యకాంతులతో పరిమళించే అధరబింబాలతో కరుణా కటాక్షాలు ప్రసరిస్తూ “తాపసులారా! మీరు సర్వలోకసంక్షేమం కోసం మొదలుపెట్టిన యాగసంకల్పానికి నేను సంతోషించాను.” అంటూ రమాదేవితో అంతర్ధానుడయ్యాడు. తాపసులు నిశ్చేష్టు లయ్యారు.

“మనం ధన్యులం. పుణ్యవంతులం. యాగాలెందరో చెయ్యవచ్చు కానీ యాగఫలదాత స్వస్వరూపంతో ప్రత్యక్షమై ‘వప’ను స్వీకరించడం ఎక్కడా వినలేదు. అంతేకాదు. శ్రీలక్ష్మీ మహావిష్ణుమూర్తులను కనులారా! చూడగలిగాం. అంతేకాదు. ఆ దేవతలతో స్వయంగా మాటలాడగలిగాం. మన జన్మలు సార్థకమయ్యాయి. ఎవరికీ లభించని స్వామి సాక్షాత్కారం మనకు లభించింది. అయినా ‘వప’ హోమంతో యాగం ఆగిపోకూడదు. చివర అవభృథస్నానంతోనే యాగానికి పరిసమాప్తి” అంటూ ఆ కార్యక్రమాన్ని కూడా సలక్షణంగా పూర్తి చేశారు, అని సూతుడు శౌనకాదులకు చెప్పగా ఆ తర్వాతి వృత్తాంతాన్ని నివేదించండని మునులు కోరారు. *(ఇంకా ఉంది)*

# సర్వం శక్తిమయం జగత్

- బ్రహ్మశ్రీ
డా॥ మైలవరపు
శ్రీనివాసరావు




అక్టోబరు, 23న విజయదశమి సందర్భంగా..

అఖిలానికి 'అయ్య' అయిన శంకరుని గురించి అలవోకగా శ్లోకాన్ని చెప్ప బోతూ ఆదిశంకరులవారు అలా గల గలా నవ్వేశారు. దానికి కారణం ఎక్కడెక్కడ అయ్య గురించి ఆలోచించినా అక్కడక్కడ అమ్మ మాత్రమే కనిపించడం! అందుకే ఆయన అమ్మ గురించి చెప్పదల చిన సౌందర్యలహరి ప్రారంభ శ్లోకంలో -

**'శివశ్శక్త్యా యుక్తో యది
భవతి శక్తః ప్రభవితుం।
నచే దేవం దేవో న ఖలు!
కుశలస్పన్దితుమపి॥'**

అనేశారు. (అమ్మతో కూడి ఉంటేనే అయ్య దేన్నైనా చేయ సమర్థు డౌతాడు. ఆమె లేకుంటే అసలాయన దేన్నీ చేయలేడు అని అర్థం).

పోనీ ఆదిశంకరులవారు అలా రాశారు అనుకున్నా, 'నేను నేనే' అని అయ్య ఏమైనా అన్నాడేమోనని వెతికివెతికి చూస్తే ఆయనంతట ఆయన అననే అనేశాడు. "అంతా నిన్ను పెళ్లాడాకే సుమా! లేకపోతే నా మహిమేముంది? అని. సరే బ్రహ్మగారేమైనా తన భార్య లేకుండా శక్తిమంతుడా అని ఆలోచిస్తే, ఆయన తన నాలుగుముఖాలనుండీ నిరంతరం వేద గానాన్ని చేస్తూండడాన్ని బట్టి ఆయనంటూ ఒకరున్నా రని లోకానికి తెలుస్తోంది కానీ, అసలు బ్రహ్మ ఉనికికి కూడా కారణం ఆయనకున్న శక్తి (భార్య అయిన సరస్వతి) అనే అర్థమౌతోంది. ఇక శ్రీహరి మాట చెప్పేదేముంది? విష్ణుశక్తి మొత్తం లక్ష్మిదే కదా! ఆ శక్తిలేని పక్షంలో విష్ణుదర్శనానికి ఎవరొస్తారు? నిత్యకల్యాణమెక్కడ? పచ్చతోరణమెక్కడ?

కాబట్టి ఏ బ్రహ్మకి శక్తి సరస్వతి ఔతోందో, ఏ విష్ణువుకి శక్తి లక్ష్మిగా కనిపిస్తోందో, ఏ శంకరునికి శక్తి పార్వతి మాత్రమే అని ఋజువయిందో ఆ కారణంగా 'శక్తి' అంటే పురుషునికి సహకరించే భార్య అనీ, శక్తి పూజ (అమ్మవారిపూజ) చేయడం అంటే దంపతుల అన్యోన్యతకోసం చేయబడే పూజఅనీ, ఈ త్రిశక్తుల పూజ ఆశ్వయుజమాసంలో నెలరోజుల పొడుగునా జరుగుతోందనీ గ్రహించాలి. అయితే ఈ త్రిశక్తుల్లో కూడా ఎవరు అత్యంతముఖ్యం? అని ఆలోచించారు ఋషులు. నెలమొదట్లో పదిరోజులు పార్వతీ దేవికి ఉత్సవాలు జరుగుతాయి. మూలానక్షత్రం రోజున సరస్వతీపూజ జరుగుతుంది. తర్వాత దీపావళి అమావాస్యనాడు లక్ష్మీపూజ.

## పౌరుషంలో శక్తి

శక్తి అంటే అమ్మవారు అనుకున్నాం కదా. అమ్మ భండుడనే రాక్షసుణ్ణి వధించడానికి గజసైన్యం, అశ్వసైన్యం, రథబలం, పదాతిబలంతో బయల్దేరడమే కాకుండా తనకు సహాయకునిగా వచ్చిన వినాయకునితోపాటు, విఘ్నయంత్రాన్ని కూడా తీసుకెళ్లింది. ఇతర దేవతాయుధాలన్నింటినీ తనే ఒక్కొక్క చేతిలోనూ (మొత్తం ఇరవైచేతులు) ఉంచుకుని యుద్ధానికి తల పడింది. ఆమెరాక, ఆమె యుద్ధప్రణాళిక చూసి అందరూ కూడా దుర్గ (ఆమెను సమీపించలేం సుమా! గంతుం దుర్గమా) అన్నారు. గమనించవలసిన విషయం ఏమిటంటే అమ్మ తానింత పౌరుషంతో (పురుషలక్షణంతో) ఉన్నా కూడా తన భర్తని తక్కువ చేయకుండా భర్త అయిన కామేశ్వరుని పేరిట ఉన్న అస్త్రాన్ని ప్రయోగించి భండాసురుని రాజధానిని నాశనంచేసింది. తన విజయంలో ఆయన్ని కూడా భాగస్వామిగా ప్రకటించి లోకంలో స్త్రీలందరికీ మార్గదర్శకురాలయింది.

## ఆలోచనలో శక్తి

**ఏ రాక్షసుణ్ణి ఎలా వధించాలో అలా ఆలోచన చేయ గలిగిన తల్లి ఆమె. ఒక్క బొట్టు రక్తం తన నుండి నేలపడినా తనలాంటి లక్షణాలున్న దుర్మార్గులు వేలసంఖ్యలో పుట్టాలనే వరాన్ని పొందిన రక్తబీజుణ్ణి వధించడానికి తన నాలుకని పృథివితో సమానంగా పెంచి దానిమీద వాణ్ణి వధించింది.**

సుందోపసుందుల్ని వధించేందుకు- మీలో ఎవరు బలిష్ఠులు? అని ప్రశ్నించి పరస్పరం చంపుకునేలా పథకం రచించింది. అలాగే హయగ్రీవుడనే రాక్షసుడు కోరినవరానికి అనుగుణంగా శ్రీహరికి హయముఖం వచ్చేందుకై శ్రీహరి శిరస్సును ఖండింపజేసింది పరమసాహసంతో, ఇలా సాహసో పేత విధానంతో రాక్షసవధని చేపట్టి మళ్లీ ఆ రాక్షసజాతితోనే శక్తిపూజలు చేయించుకున్న నేర్పరి అమ్మ.

## చక్రాల్లో శక్తి

ప్రతి వ్యక్తికీ ఉండే సప్తచక్రాల్లోనూ, సప్తరూపాల్లోనూ అమ్మ ఉంటుంది. లోకమంతా ఆమెని నాలుగు చేతులున్న రూపంతో ఊహిస్తుంది కానీ, ఆమె ప్రతివ్యక్తి శరీరంలోని భాగంలోనూ ఉంటుంది. విశుద్ధి చక్రంలో ఎర్రనిరంగులో, డాకినీ నామంతో; అనాహతచక్రంలో శ్యామవర్ణంతో, రాకినీ నామధేయంతో; మణిపూరకచక్రంలో రక్తం రంగులో, లాకినీ అనే పేరుతో; స్వాధిష్ఠానచక్రంలో పచ్చనిరంగులో కాకినీదేవి పేరుతో; మూలాధారచక్రంలో రెండు రంగుల జమిలివర్ణంతో, సాకినీ నామంతో; ఆజ్ఞాచక్రంలో తెల్లనివర్ణంతో, హాకినీ రూపంతో ఉంటూ సహస్రారంలో అన్ని రంగులకలయికతో యాకినీ నామంతో శక్తిగా ఆమె విరాజిల్లుతోంది.

విశుద్ధిచక్రంలో చర్మంలో, అనాహతంలో రక్తంలో, మణిపూరంలో మాంసంలో, స్వాధిష్ఠానంలో మేధస్సులో, మూలాధారంలో ఎముకల్లో, ఆజ్ఞాచక్రంలో మజ్జలో, సహ స్రారంలో శుక్లంలో... ఇలా శరీరంలోని సప్తధాతువుల్లోనూ ఉండి మనని నడిపిస్తోంది అమ్మ.

లోకంలో ప్రజలకు 1000 విధాల కష్టాలుంటాయని గ్రహించి, ఏ కష్టానికి ఏ నామం పఠిస్తే కష్ట నివారకమో చెప్తూ, అలాంటి వెయ్యికష్టాలకీ వెయ్యినామాలని కూర్పించి, ఆ నామాలకు శక్తి పెరిగేందుకై వాటన్నిటినీ ఒకేచోట 'లలితా సహస్రనామాలు' అంటూ చేర్చి కర్త మననం చేసుకుంటూ ఉండవలసిందని చెప్తోంది అమ్మ.

### వైకుంఠపాళి
### :: 93 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వి | జ | 2 య | ద | 3 శ | మి | | 4 శే | షి |
| జ | | యా | | మీ | | | షా | |
| 5 య | యా | తి | | 6 వృ | ష | 7 భా | ద్రి | |
| వా | | | | క్ష | | ర | | 8 మ |
| 9 డ | 10 మ | రు | 11 క | ము | | తి | | హి |
| | హి | | ర్కి | | 12 ప్ర | | | షా |
| 13 గ్రీ | ష్మ | ము | | 14 రం | భ | డు | | సు |
| | తి | | 15 సే | | | | 16 చా | రు |
| | | 17 న | వ | రా | త్రు | లు | | డు |


పరమాత్మ నివసించే వైకుంఠం రెండు భాగాలు -1)కార్యవైకుంఠం 2)కారణవైకుంఠం



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

ఉపదేశ రత్నమాలలో– ఆళ్వార్‌గళ్ వాళి, ఉండోవైకాశి, ఇన్నో తిరువాడిప్పూరమ్ ఆళ్వార్‌కళ్ తాజ్గళ్, ఎమ్బెరుమానార్, తెళ్ళియదా నమ్బిళ్ళై, నమ్‌పెరుమాళ్, అన్నపుకళ్, ఞానమను ట్టానమ్, తిరుక్కుఱున్దాణ్డకము ప్రత్యేక దివ్యప్రబంధమే అయినా, పరకాలుడు సంసారమందు ఆర్తిచేత తిరునెడున్దాణ్డకం తోడ మొదటఏకకాలంలో అనుగ్రహించినందువల్ల ప్రత్యేకంగా అనుసంధానం లేదు. కాబట్టి సమాప్తి సమయంలో దీనికి సమాపనమంగళం లేదు. కాబట్టి అనుసంధానం చేసేటప్పుడు ఒక పాశురమునకే ద్విరావృత్తి(అనగా) పిణ్డియార్ అనే పాశురా నికే అర్థగౌరవాన్నిబట్టి రెండుసార్లు అనుసంధానం. తిరుప్పళ్ళి యొళుచ్చి ప్రబంధం వక్తృ(కవి) భేదముండుటచేత ప్రత్యేక ప్రబంధమైన తిరుప్పావై తోడ ప్రబోధన (మేలుకొలుపు) పర మగుట ఏకార్థప్రతిపాదికమైనందున ప్రత్యేకానుసంధానం లేకపోవుటచేత కోవెలలలో ప్రత్యేకంగా సమాప్తి మంగళం లేనందువల్ల ఒక పాశురాన్నే రెండుసార్లు అనుసంధించాలి.

ఇట్టి పౌర్వాపర్యానికి హేతువు 'అంజుకుడిక్కొరు సంతతియాయ్' (భగవంతున కేమి అవద్యం వాటిల్లునో యని భయపడి స్వామికి మంగళాశాసనం చేసే భాగవత కుటుంబా లకు ఏకైక పుత్రికై) అని గోదాదేవికిని ఆళ్వారులు ఉద్దేశ్యులగు టయే. తిరువాశిరియం కూడ ప్రత్యేక ప్రబంధమైనా గాథా దశకం కానందున ప్రత్యేకానుసంధానం, వేరుగా సమాప్తి స్వాచిత్కనుగుటచేత ఒక పాశురాన్నే రెండుసార్లు సేవించాలి. రామానుజనూత్తందాదిలోని 'ఇరుప్పిడమ్' అనే పాశురాన్ని ద్విరావృత్తం చేయుట దాని అర్థగౌరవాన్ని బట్టే. తిరువాయ్‌మొళి మొదలగు ఇతర ప్రబంధాలను సమాప్తి చేసేటపుడు రెండు పాశురాలను రెండుసార్లు అనుసంధించాలి. ఉపదేశరత్నమాలలో 'మణ్ణుయిర్‌కాళ్' అనెడు పాశురం మణవాళ మహామునుల శ్రీసూక్తి కానందువల్ల, ప్రబంధానికి వెలుపలిది అయినందు వల్ల, కిడాంబి అప్పుళ్ళాన్ రమ్యజాతృ మునీంద్రుల విషయమై అనుగ్రహించినదవడం చేత ప్రబంధంతో చేర్చి సమాప్తి చేసే టపుడు ఒకేసారి అనుసంధించాలని సంప్రదాయం.

తిరుమల బ్రహ్మోత్సవాలలో వీథులందు అనుసంధిం చిన మూడువేలకు, నూత్తందాదికిని 'ఇయల్‌శాత్తు' (పలువురు వ్రాసిన ప్రత్యేక ప్రబంధం, సమాపనమంగళం) భగవద్రా మానుజాచార్యుల సన్నిధిలో అనుసంధేయం. తిరువాయ్‌మొళి మొదలగు వానిని అనుసంధించేటపుడు ఒక పాశురాన్ని మాత్రమే రెండుసార్లు అనుసంధించి తిరుప్పల్లాండులో రెండు పాశురాలను చేర్చి ద్విరావృత్తపాఠానికి హేతువు భాగవతవిషయక మంగళా శాసనం భగవద్విషయక మంగళాశాసనానికి ఎల్లయగుటయే.

***'వెన్ఱు మాలై యిట్టాన్ తిరుమంటపము' అను శబ్దము నకు అర్థము'***

వెన్ఱు= (శిశుపాలుని) జయించి, మాలై యిట్టాన్= (రుక్మిణీదేవి భుజములపై) మాలను వేసినవాడు అని– అర్థము కావున ఆ శబ్దము శ్రీకృష్ణదివ్యనామము. కావున 'వెన్ఱుమాలై యిట్ట పెరుమాళ్' (జయించి మాలిక ధరింపజేసిన పెద్దవాడు) అను మాటకు బదులుగా శ్రీకృష్ణశర్మ అనియు, రామానుజదాసు డనియు వ్యవహారము దక్షిణదేశంలో ప్రసిద్ధం. *(ఇంకా ఉంది)*

# సందేహాలు సమాధానాలు



నిర్వహణ–
బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

**ప్ర) 'బ్రహ్మ కడిగిన పాదం' అనే దానికి వివరణ ఇవ్వండి. బ్రహ్మ విష్ణుపాదాన్ని కడిగిన సందర్భం ఏమిటి? ?**

**జ)** గంగాదేవి దేవతామూర్తిగా హిమవంతుని పెద్ద కుమార్తె. ఆమెను బ్రహ్మదేవుడు దత్తపుత్రికగా స్వీకరించి, బ్రహ్మ (సత్య) లోకంలో శివుని కిచ్చి వివాహం చేశాడు. శివుని వెంట వెళుతున్న గంగను చూసి, బ్రహ్మదేవుడు పుత్రికావాత్సల్యంతో దుఃఖించాడు. అతడిని ఓదార్చిన గంగ జలరూపంలో బ్రహ్మకమండలంలో ఉంటానని చెప్పి, వనితారూపంతో శివుని వెంట వెళ్లింది.

కొంతకాలానికి శ్రీమన్నారాయణుడు వామనునిగా అవతరించాడు. బలినుండి మూడడుగుల నేలను దానమడిగి, ముల్లోకాలను ఆక్రమించుతూ ఒక పాదంతో సత్యలోకాన్ని ఆక్రమించాడు. అప్పుడు బ్రహ్మదేవుడు ఆ శ్రీహరి పాదాన్ని చూసి భక్తిపారవశ్యంతో, తన కమండలాంతర్గత గంగాజలంతో కడిగాడు.

పరమపావన విష్ణుపాదాన్ని చేరిన గంగ, అక్కడే సుస్థిరంగా ఉండిపోయింది. అలా విష్ణుపాదాన ఒదిగిన గంగనే భగీరథుడు తపస్సుతో రప్పించాడు.

ఆ విధంగా గంగ 'విష్ణుపాదోద్భవ' అయ్యింది. 'బ్రహ్మ కడిగిన పాదము' అనే వాక్యం వెనుకనున్న పురాణకథ ఇది.

ఈ కథను స్మరింపజేస్తూ, వామనావతార వృత్తాంతాన్ని తెలియజేస్తూ –

"చెలఁగి వసుధ గొలిచిన నీ పాదము
బలితల మోపిన పాదము"

అనే చరణాల మాటలతో స్పష్టపరచాడు అన్నమయ్య. పల్లవిలోని మొదటి వాక్యం– "బ్రహ్మ కడిగిన పాదము" తొలి చరణంలోని పైరెండు వాక్యాలు కలిపి త్రివిక్రముని త్రిపాదాలనీ తెలియజేస్తున్నాయి. అంతేగాక శ్రీవేంకటేశ్వరునికి తొలిసారిగా ఉత్సవాలు జరిపి పూజించిన వాడు బ్రహ్మదేవుడే.

**ప్ర) తిరుమలలో నెలవైన దేవుడు శ్రీనివాసుడుగా పురాణప్రశస్తి. ఆయనకు వేంకటేశ్వర నామం ఎప్పుడు ఏర్పడింది? ప్రచారంలో ఉన్న ఈ రెండు నామాలను వదలి 'గోవింద'స్మరణ జరపడానికి మూలమేమిటి?**

**జ)** 'శ్రీనివాస', 'గోవిందనామాలు విష్ణువునకు సహజనామాలు. 'వేంకటేశ' నామం క్షేత్రదైవంగా వచ్చిన నామం. లక్ష్మీదేవి(శ్రీ) ఎల్లప్పుడు నారాయణుని ఆశ్రయించుకుని ఉండడంచేత ఆయనను 'శ్రీనివాస' అన్నారు. 'గో' అంటే వేదవాక్యాలు, 'భూమి' అని రెండర్థాలు. 'గోవిందుడు' అంటే 'వేదములచే నుతింపబడే పరతత్త్వం', 'వేదాల ద్వారా తెలియబడే పరబ్రహ్మ' అని అర్థంతో పాటు 'భూమిని గ్రహించి, ప్రళయజలాల నుండి ఉద్ధరించిన ఆదివరాహస్వామి' అని కూడా అర్థం ఉంది. ఇంక కృష్ణుడు గోపాలకుడు కనుక 'గోవిందుడు'– ఇలా మూడు అర్థాలలోనూ నారాయణుడు తెలియబడుతున్నాడు.

కృతయుగంలోనే భూదేవి ప్రార్థన మేరకు, బ్రహ్మాదుల కోరికమేరకు నారాయణుడు పృథ్విపై తన విభూతులతో విహరించదలచుకున్నాడు. ఆయన విహారం కోసం ఆదిశేషుడే పర్వతంగా వెలిశాడు. అందుకే అది శేషాద్రి. ఆదివరాహస్వామి (భూమిని ఉద్ధరించిన గోవిందుడు) రూపంలో అక్కడ మొదటిసారిగా విహరించాడు శ్రీహరి. ఆయన విహారంచేత ఆ పర్వతం పరమపావనమై దర్శించిన వారి పాపాలను నశింపజేసే శక్తిమంత క్షేత్రమయ్యింది. 'వేం' అంటే 'పాపాలను', 'కట' అంటే సంహరించునది' అని అర్థం.

"వేంకట– పాపసంహారకం". ఆ పర్వతంపై వెలసి భక్తులను పావనులను చేసే స్వామి కనుక శ్రీ వేంకటేశ్వరుడు. మరొక అర్థంలో "వేం" అమృతబీజం, ''కట'' ఐశ్వర్యవాచకం. అమృతం (ఆనందం), ఐశ్వర్యం అందించే విష్ణుపరత్వం శ్రీ వేంకటాచలం.

కలియుగారంభంలో మరొక రూపంలో స్వామి ఈ పర్వతానికి వచ్చి శ్రీలక్ష్మి అవతారమైన పద్మావతిని వివాహమాడి, తన ఆదిరూపమైన వరాహస్వామి అనుమతితో ఇక్కడ వెలశాడని పురాణకథ.



# వడ్డీకాసులవాడా! వేంకటరమణా!!

- ఆచార్య కోసూరి దామోదరనాయుడు, 94416 45601

కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రాన్ని చేరుకోవడానికి సుదూరప్రాంతాలనుండి విచ్చేసే భక్తులు కాలినడకన కొండ ఎక్కేవేళ భక్తిశ్రద్ధలతో ఏడుకొండలవాడా! వేంకటరమణా! ఆపద్రక్షకా! వడ్డికాసులవాడా! గోవిందా! గోవిందా! అంటూ ఎలుగెత్తి పలుకుతూ అధిరోహించడం అందరికి తెలిసిన అంశం.

ఈ సంబోధనలలో గోవింద, వడ్డికాసులవాడా అనే రెండుసంబోధనలు కేవలం తిరుమలస్వామికి మాత్రం అన్వర్థకం. ఒక యాదవుడు ఇంట పాలివ్వక అడవిలో ఒక పుట్టపై నిలుచుకుని పాలు స్రవిస్తుంటే అణచుకోలేని కోపంతో గొడ్డలితో గోవును కొట్టడానికి సిద్ధపడ్డ వేళ పుట్టలోని వెన్నుడు అమాంతం పుట్టనుండి బయటికి వచ్చి గొడ్డలివేటు ఆవుపై పడకుండా చేశాడు. గోవుకు ఆనందం కలిగించినవాడు కనుక స్వామి గోవిందనామధేయుడయ్యాడు. గోవింద శబ్దానికి కవులు, పండితులు తమతమ శాస్త్రప్రమాణాలతో విశేషార్థాలు చెప్పినా అసలు కథ 'గోరక్షణ' మాత్రమే కనుకనే దారిలో, ఆలయంలో 'గోవింద గోవింద' అని పలుకబడడం. ఇలాగే వడ్డికాసులవాడా! అనడానికి కారణాలున్నాయి.

వడ్డి అన్నది వృద్ధిశబ్దభవం. అసలును వృద్ధిచేసేదని సామాన్యార్థం. అప్పిచ్చినవానికి అప్పుపుచ్చుకును వానివల్ల నెలకు నూటికింతయని హెచ్చుగా వచ్చేధనం 'వడ్డి' అవుతుంది.

వడ్డీ ఏ యుగంనుండి ఉందని నిక్కచ్చిగా చెప్పడానికి ఆధారాలు లేవు. కానీ ధర్మం రెండుపాదాలతో నడిచే యుగంలో 'వడ్డీ' సంప్రదాయం స్థిరరూపంలో వచ్చిందని పెద్దలంటారు. ఇందుకు ఉదాహరణగా 'వేంకటాచల మాహాత్మ్యం'లో స్వామి తన వివాహఖర్చుల నిమిత్తం కుబేరుని దగ్గర అప్పు తీసు కున్నట్లు, కుబేరుడు వడ్డీపత్రం అడిగినట్లు, స్వామి అలాగేనని శివ, బ్రహ్మ, స్వామిపుష్కరిణీతీరంలోని రావిచెట్టు సాక్షులుగా డబ్బు తీసుకున్నట్లు ఉల్లేఖనాలున్నాయి. ఈ ఘట్టాన్ని తరిగొండ వేంగమాంబ పంచమాశ్వాసంలో 150-157 పద్యగద్యాదులలో రమణీయంగా వర్ణించింది.

ఆరవ ఆశ్వాసంలో శ్రీనివాసుడు లక్ష్మీదేవితో ***'ఆనాడు ధనదు చేతఁ దీసిన ఋణముఁ దీర్చెడి యుపాయమేమి'*** అని అడిగాడట. అప్పుడా లక్ష్మి ***'ఋణము చేయునప్పుడు నను నడిగితివే?'*** అని ఎదురుప్రశ్న వేసింది. "నన్నడిగితే నేను ఇవ్వనా: పెళ్లి సందర్భంలో అయినా అప్పుచేశానని చెప్పక ఇప్పుడు చెప్పావేమిటని ఎదురు ప్రశ్నవేసింది. "సమయం మించి పోలేదు." నేను ఇస్తాను వడ్డీ ఎందుకు? కుబేరునికి ఇచ్చేయ రాదా" అంది. స్వామి "అలా కుదరదు నా ఒడంబడికలో సంవత్సరం వడ్డీ ఒకసారి ఇవ్వవచ్చు. అంతేగాక నేను కలియుగాంతం వరకు శేషాద్రిపై ఉంటానని వాగ్దానం చేశాను. తీరికగా అప్పు తీర్చవచ్చు" అన్నాడు. "అప్పుచేసింది నేను, నేనే తీర్చాలి. ఈ ఉపాయాన్ని నేనే చెబుతాను."

కలియుగం రానుంది. ఈ యుగంలో ప్రజలు రోగాలతో, తాపత్రయాదులతో కుమిలిపోతారు. ఇక దిక్కులేక

'ఆపద్రక్షకా! అనాథ బాంధవా' అంటూ అంగలారుస్తారు. నేను వారి ఆపదలను తీరుస్తాను. నేను ఆ సమయంలో ఊరకుండడం న్యాయంకాదు. వారు డబ్బుతో కొండకు వచ్చేలా చేస్తాను. అంతేకాదు పుణ్యాత్ములైన వారిచ్చిన డబ్బులో కొంత తీసుకుని అప్పు చెల్లిస్తాను. పాపుల డబ్బంతా వారికోసం ఈ భూలోకంలో రకరకాలుగా ఖర్చుపెడతాను" అన్నాడు. అప్పుడు "నేను మానవులకు డబ్బు ఎందుకివ్వాలని" లక్ష్మి ప్రశ్నించగా "స్వామి– "కలియుగమానవులు దానధర్మాలు చేయరు. పరోపకారానికి వెనకడుగు వేస్తారు. అంతేకాదు డబ్బుకారణంగా ఆడంబరాలకు పోతారు. 'ధనం మూలమిదం జగత్' అని మిడిసిపడతారు. అంతేకాదు దిక్కులేక నన్ను శరణు జొచ్చినవేళ 'స్వప్నావేశంలో' ప్రత్యక్షమై వారి కలిమికి తగ్గట్లుగా ముడుపు లెత్తిస్తాను. ఆ మొత్తానికి వడ్డీ పెంచుతాను. 'అపరాధకానుకగా' రెట్టింపు చేస్తాను. వారిచేత సంతర్పణాది కార్యోద్దేశ్యాల్ని పెంచుతాను.



వారు అన్నదానాలు చేయించగా ఆ పుణ్యఫలితాన్ని ప్రసాదిస్తాను. వారిది స్వల్పదానమే అయినా అధికవరాలను అనుగ్రహిస్తాను. ఈ యుక్తిలేకపోతే కలిపురుషుని బాధలు మానవులకు తప్పవు. వారికి రౌరవాది నరకాలు తప్పవు. అని స్పష్టం చేశాడు. ఈ యుక్తి కారణంగా మానవులు సకాలంలో స్వామికి ద్రవ్యం ఇవ్వలేక అవసరమైన వేళ ఆ డబ్బును వాడుకున్నా 'అపరాధ' కానుకల రూపేణ కొంత డబ్బు చేర్చి నా హుండీలో వేస్తారని స్వామి అన్నాడు. కనుకనే క్షేత్రాదులలో ఏ దానమైనా అధికఫల దాయకం. ఇక రెండో అంశం 'హుండీ'. శ్రీవైష్ణవులు హుండీ ఆకారాన్ని దేవతగా భావిస్తారు. సాక్షాత్తు లక్ష్మీదేవియే ధనాన్ని ఆకర్షించి స్వామికి ఏ కొరతాలేకుండా చేస్తోందని వాళ్ల విశ్వాసం.

కన్నడ వర్గీయులు కూడా 'కాశీరామేశ్వరదింద కాణికె బరువదు చెంద' అన్నారు. స్వామికోసం ప్రతి ఇంటా హుండీ ఉంచి అందులో డబ్బులు వేయడం ఈనాటికీ నిలిచివున్న సంప్రదాయం. తి.తి.దే. శాసనాల ప్రకారం స్వామికి జరగాల్సిన కైంకర్యాలకోసం పాలు, పెరుగు, ప్రసాదాల నిమిత్తం దగ్గరి గ్రామాలలోని వారికి డబ్బు వడ్డీకిచ్చి, ద్రవ్యాలు సేకరించి నైవేద్యాదులు బాగా జరిగేలా చేసేవారని తెలుస్తోంది. పేరూరుకు సంబంధించిన శాసనాలు ఇందుకు నిదర్శనాలు.

పుణ్యక్షేత్రాలకు వేలాదిగా వచ్చే జనులకు ఆహారం ఎలా అన్నది ప్రశ్న. సత్రాలు చాలవు. మఠాదులు చాలవు కనుక పాలకులు ప్రసాదాలరూపేణ భక్తులకు ఆహారప్రసాదాలు అందజేస్తున్నారు. పాతకాలంలో 'తిరుప్పావడ' జరిగేవేళ చుట్టుపక్కల గ్రామాలలో 'టముకు' వేశేవారు. కొండకు వెళితే అన్నానికి కొదవుండదని యాత్రికులు తండోపతండాలుగా వచ్చేవారు.

మనుషులమధ్య జరిగే వడ్డీ వ్యవహారాలలో ఎగగొట్టే వారుంటారు. కానీ దైవానికని చేర్చిపెట్టిన ధనాన్ని వాడుకోవడానికి మనసా జంకుతారు. ఒకవేళ వాడుకున్నా అరిష్టం కలిగితే అల్లాడిపోతారు. 'వడ్డి' వలన వృద్ధి కూడా. ఆస్తికం పెరిగేది కనుక.

పాపప్రక్షాళనానికి కృతజ్ఞతకు 'వడ్డి' చెల్లించడం మానసికంగా ఆరోగ్యలక్షణమే.



# ముక్కోటి దేవతలు అందరూ ఇక్కడే!

- డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి

భూమ్మీద ఎన్ని తీర్థాలున్నాయో అవన్నీ శ్రీవేంకటాద్రి పైన ఉన్నాయి. భగవంతుడైన శ్రీమహావిష్ణువు వైకుంఠాన్ని వదలి శ్రీవేంకటాచలంపై అర్చావతారరూపంలో ఉండటానికై భూలోకానికి వేంచేశాడు. ఇందుకు కారణమేమనగా శ్రీ వేంకటాచలక్షేత్రం ప్రాణుల సంచితపాపకర్మలను పూర్తిగా దహించివేసి పుణ్యాన్ని కలిగించటంద్వారా పవిత్రతను ఆపాదిస్తుంది. ఆ పవిత్రమైన, శ్రేష్ఠమైన పర్వతంపై నెలకొని ఉన్న శంఖచక్రధారి, ప్రకాశమానుడు, పీతాంబరధారి, కౌస్తుభ మణిచే అలంకరించబడిన వక్షఃస్థలం కలవాడు, భక్తులకు అభయప్రదుడు, దేవాదిదేవుడు, విశాలాక్షుడు, వేదవేద్యుడు, ఆదిపురుషుడు అయిన శ్రీనివాసుని సేవించటానికి సర్వదేశాల ప్రజలు తమ కుటుంబాలతో ప్రతి సంవత్సరం వస్తారు. ఇంకా దేవతలు, ఋషులు, సిద్ధులు, సనకాదియోగులు కూడా ఆయనను సేవించడానికి వస్తారు.

విద్యల్లో వేదవిద్యవలే, మంత్రాల్లో ఓంకారంవలే, ప్రియవస్తువుల్లో ప్రాణంవలే, ధేనువుల్లో కామధేనువువలే, పుణ్యక్షేత్రాల్లో శ్రీ వేంకటాచలం మిక్కిలి శ్రేష్ఠమైంది. సర్పాల్లో ఆదిశేషునివలే, పక్షుల్లో గరుత్మంతునివలే, దేవతల్లో విష్ణువువలే, పుణ్యక్షేత్రాల్లో శ్రీవేంకటాచలం చాలా గొప్పది. వృక్షాల్లో కల్పవృక్షంవలే, మేలుకోరేవారిలో భార్యవలే, నదుల్లో గంగవలే, తేజస్సు కలవారిలో సూర్యునివలే, పుణ్యక్షేత్రాలలో శ్రీ వేంకటాచలం మహత్తరమైంది. ఇంకను ఆయుధాల్లో వజ్రాయుధం, లోహాల్లో బంగారం, విష్ణుభక్తుల్లో రుద్రుడు, రత్నాల్లో కౌస్తుభం ఎలాగో ఆవిధంగానే పుణ్యక్షేత్రాల్లో శ్రీ వేంకటాచలం అగ్రగణ్యమైంది. లోకాల్లో దీనితో సమానమైంది మరొకటి లేదు. ఇది విష్ణువుకు మిక్కిలి ప్రీతికరమైంది.

మార్గశిరమాసంతో సమానమైన మాసం, కృతయుగంతో సమానమైన యుగం, వేదంతో సమానమైన శాస్త్రం, గంగతో సమానమైన తీర్థం లోకంలో లేవు. అలాగే జలదానంతో సమానమైన దానం, భార్యా సుఖంతో సమానమైన సుఖం, వ్యవసాయంతో సమమైన ధనసాధనం, జీవితంతో సమమైన లాభం వేరు లేవు. ఉపవాసాన్ని మించిన తపస్సులేదు. దానం చేయటం కంటే గొప్ప పుణ్యకార్యం మరొకటి లేదు. దయతో సమానమైన ధర్మం లేదు. కంటితో సమానమైన వెలుగు లేదు. అన్నం కంటే తృప్తినిచ్చేది లేదు. వ్యవసాయాన్ని మించిన వ్యాపారం లేదు. ధర్మంతో సమానమైన మిత్రుడు లేదు. సత్యంతో సమానమైన కీర్తిలేదు. అలాగే భగవంతుడి నివాసస్థానమైన శ్రీ వేంకటాచలంతో సమానమైన పుణ్యక్షేత్రం లోకంలో మరొకటి లేదు. దీనిని కీర్తిస్తే సకల పాపాలు హరించబడతాయి. దీనికి నమస్కరిస్తే లోకంలోని సకల సౌఖ్యాలను ప్రసాదిస్తుంది. ఈ పుణ్యక్షేత్రయాత్రదేవతలకు కూడా పూజనీయమైంది. అంతటి మహత్తరమైంది శ్రీ వేంకటాచలం.

స్వామిపుష్కరిణి సకలతీర్థాల్లో ముఖ్యతీర్థం. దీనికి పశ్చిమదిక్కున భూవరాహస్వామి తన భార్య భూదేవిని ఒడిలో కూర్చోబెట్టుకుని అతిసుందరమూర్తిగా లోకంలోని జనులకు మహోపకారం చేస్తూ ప్రకాశిస్తున్నాడు. స్వామిపుష్కరిణికి దక్షిణ దిక్కున శ్రీనివాసుడు లక్ష్మీదేవిని ఆలింగనం చేసుకుని వరప్రదుడై విరాజిల్లుతున్నాడు.

## సర్వదేవతల నిత్యనివాసం

మహాపాప సమూహాలను నశింపజేసే, లోకాలను పవిత్రంచేసే శ్రీవేంకటాచలంపై లక్షకోటిసహస్రాల సరస్సులు, సెలయేళ్లు, నదులు, మహాపవిత్రాలైన సముద్రాలు, వనాలు, ఆశ్రమాలు, పుణ్యజాతాలైన వేదారణ్యాలు మొదలైనవి ఉన్నాయి. అక్కడ వసిష్ఠాది మహర్షులు, సిద్ధ-చారణ-కిన్నరులు, శ్రీభూదేవులతో కూడిన మధుసూదనుడు, సావిత్రి- సరస్వతులతో కూడిన బ్రహ్మదేవుడు, పార్వతీదేవితో కూడిన దేవదేవుడు, త్ర్యంబకుడు-త్రిపురాంతకుడు అయిన పరమశివుడు, వినాయకుడు, కుమారస్వామి, ఇంద్రాది దేవతలు, ఆదిత్యాదిగ్రహాలు, అష్టవసువులు, పితృదేవతలు, దిక్పాలకులు, ఇతర దేవతాగణాలు రాత్రింబవళ్లు నివసిస్తున్నారు.

## శ్రీవేంకటాచలాన్ని అధిరోహించే విధానం

పుణ్యవర్ధకమైన శ్రీ వేంకటాచలాన్ని అధిరోహించేటప్పుడు భక్తులు పరమపవిత్రమైన ఆ పర్వతాన్ని ఈ విధంగా ప్రార్థించాలి- "ఓ బంగారు పర్వతమా! మహాపుణ్యమూర్తీ! సర్వదేవతలచే సేవించబడుతున్న ఓ పర్వతమా! బ్రహ్మాదిదేవతలు నిన్ను శ్రద్ధతో సేవిస్తున్నారు. అటువంటి నిన్ను నేను నా పాదాలు మోపి అధిరోహిస్తున్నాను. ఓ పర్వతశ్రేష్ఠమా! ఈ పాపకార్యాన్ని చేస్తున్న నా పాపాన్ని దయతో క్షమించు. నీ శిఖరంపై నివసిస్తున్న మాధవుణ్ణి నాకు దర్శింపజేయి" అని ప్రార్థించి, భక్తులు నెమ్మదినెమ్మదిగా అడుగులిడుతూ శ్రీవేంకటాద్రిని అధిరోహించాలి. ఆపైన సర్వపాపాలను నశింపజేసే, మహాపుణ్యప్రదమైన శ్రీవేంకటాద్రిపై ఉన్న స్వామిపుష్కరిణితీర్థంలో నియమపూర్వకంగా స్నానంచేసి ఆవగింజంతైనా, జమ్మి ఆకంతైనా పిండాలను పితృదేవతలకు సమర్పించాలి. ఈ విధంగా ఆచరిస్తే స్వర్గంలో ఉన్న పితరులు మోక్షాన్ని పొందుతారు. నరకంలోని పితరులు స్వర్గాన్ని పొందుతారు.

## ఒక్కసారి దర్శిస్తే చాలు

మానవుడు శ్రీవేంకటేశ్వరదేవుని ఒక్కసారి దర్శించినంతమాత్రాన్నే మోక్షసామ్రాజ్యాన్ని పొందుతాడు. కృతయుగంలో పదిసంవత్సరాలు, త్రేతాయుగంలో ఒక సంవత్సరం, ద్వాపరయుగంలో ఐదునెలలు, కలియుగంలో ఒకరోజులో సంపాదించే పుణ్యానికి కోటిరెట్లు పుణ్యం ఒక్క నిమిషంలో శ్రీనివాసుని దర్శనభాగ్యంవల్ల మానవులకు నిస్సందేహంగా లభిస్తుంది. శ్రీ వేంకటేశ్వరునిలో సకలతీర్థాలు, సర్వదేవతలు, మునులు, పితృదేవతలు నివసిస్తున్నారు. ప్రతిరోజు ఒకసారికాని, రెండుమూడుసార్లుకాని, లేదా ఎల్లప్పుడు కాని మహానుభావుడు, ముక్తిప్రదాయకుడు ఐన శ్రీనివాసుణ్ణి ఎవరు స్మరిస్తారో లేదా కీర్తిస్తారో వారు పాపపంజరంనుండి ముక్తులౌతారు. పరదైవం, శ్రీమన్నారాయణుడు, శంఖరాజుచే పూజితుడు, సచ్చిదానంద విగ్రహరూపుడు అయిన శ్రీమన్నారాయణుణ్ణి ఎవరు స్మరిస్తారో వారు వేంకటేశ్వరునే చేరుతారు. ఆయనను స్మరించినంత మాత్రం చేతనే యమలోకబాధలు తొలగిపోతాయి.

మహాదేవుడైన శ్రీనివాసుణ్ణి ఒకసారైనా పూజించే వారికి దానాలతో, వ్రతాలతో, తపస్సులతో, యజ్ఞాలతో పని ఏముంది? పరదైవమైన శ్రీ వేంకటేశుని గూర్చి క్షణకాలమైనా చింతించని నరుడు అజ్ఞాని. అతనికి ఎల్లప్పుడు హానిజరుగుతుంది. పురుషోత్తముడైన శ్రీనివాసుణ్ణి ఒక్కసారి దర్శించేవారికి కాశి, గయ, ప్రయాగలతో పనిఏముంది? భూలోకంలో దుర్లభమైన మానవ జన్మను పొంది ఎవరైతే పరదైవమైన శ్రీవేంకటేశుని దర్శిస్తారో, పూజిస్తారో వారి జన్మసార్థకం. వాళ్లు కృతార్థులు, ధన్యులు. ఇతరులు కారు. శ్రీవేంకటేశుని దర్శించినా, పూజించినా శివుడు, బ్రహ్మ, ఇంద్రాది దేవతల అనుగ్రహం అవసరం లేదు. మహాదేవుడైన శ్రీవేంకటేశునియందు భక్తిగల నరులకు నమస్కరించి, వారిని స్మరించి, పూజించేవారికి దుఃఖాలుండవు. వారు నరకాన్ని పొందరు.

వేయి బ్రహ్మహత్యలు, చేసిన పాపాలు శ్రీనివాసుని దర్శనభాగ్యంవల్ల పూర్తిగా నశిస్తాయి. ఎల్లప్పుడు భోగాన్ని కోరేవారు, స్వర్గలోకభోగాన్ని, స్వర్గలోకాధికారాన్ని వాంఛించే వారు శ్రీనివాసునికి భక్తితో ఒక్కసారి నమస్కరించాలి. కోటి జన్మలలో చేసిన పాపాలన్నీ శ్రీనివాసుని దర్శనమాత్రం చేతనే నశిస్తాయి.

ఒకరి స్నేహంవల్లకాని, కుతూహలం వల్లకాని లోభం వల్లకాని, భయంవల్లకాని శ్రీవేంకటేశుని స్మరించేవారు ఇహపరలోకాల్లో దుఃఖాన్ని పొందరు. శ్రీవేంకటాచలపతిని కీర్తిస్తూ, పూజించే నరులు తప్పక విష్ణుసాయుజ్యాన్ని పొందుతారు. ఇందుకు సందేహం లేదు. బాగా ప్రజ్వలిస్తున్న అగ్నికట్టెలను క్షణంలో భస్మం చేసినట్లు వేంకటేశ్వరుని దర్శనంవల్ల నరుల పాపాలన్నీ నశిస్తాయి.



# పిడికెడు ముద్దలో.. కొండంత అనుబంధం!

- డా॥ కప్పగంతు రామకృష్ణ, 90320 44115

భగవంతుడికన్నా జన్మనిచ్చిన తల్లిదండ్రులకు అధికప్రాధాన్యతనిచ్చి, వారినే త్రిమూర్తిస్వరూపంగా అర్చించే సమున్నతసంస్కృతికి హిందూధర్మం పెద్దపీట వేస్తుంది. కన్నవారిని కాదన్నవారిని పరమేశ్వరుడు కూడా ఇష్టపడడు. అందుకే పితృదేవతలను అర్చించి, వారికి ఉత్తమగతులు కలిగేలా మనిషిని ధర్మదీక్షాబద్ధుడిని చేసేందుకు కొన్ని నియమాలను మనశాస్త్రాలు విధించాయి.

చాంద్రమానంప్రకారం పూర్ణిమరోజున చంద్రుడు పూర్వభాద్ర లేదా ఉత్తరాభాద్రనక్షత్రాలసమీపంలో సంచరిస్తే, ఆ మాసాన్ని భాద్రపదమాసంగా వ్యవహరిస్తారు. ఈమాసంలో బహుళపక్షాన్ని (పూర్ణిమ తర్వాత వచ్చే పాడ్యమినుంచి అమావాస్యవరకు పదిహేను రోజులకాలం) పితృపక్షం అంటారు. ఈ కాలం పితృదేవతలకు అత్యంత ప్రీతికరమైంది. ఈ రోజుల్లో అన్ని వర్ణాలవారూ గతించిన తమ పితృదేవతలను తలుచుకుంటూ శ్రాద్ధవిధులను తప్పక నిర్వహించాలి. పితృపక్షం పుణ్యకార్యాలు చేయటానికి మంచిది కాదు.

మహాలయపక్షం పితృదేవతలకు సంబంధించిన శ్రాద్ధకర్మలు చేసేందుకు అత్యుత్తమమైంది. శ్రాద్ధం అనే పదంపట్ల లోకవ్యవహారంలో ఒక విపరీత భావన ఉంది. ఇది సరైంది కాదు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు గతించిన తర్వాత కూడా వారిని స్మరిస్తూ, వారికి అనంతపుణ్యలోకాలు ప్రాప్తించటానికి చేసే క్రతువు ఇది. వ్యాకరణపరిభాషప్రకారం శ్రాద్ధకర్మ అంటే శ్రద్ధతో చేసే కర్మ (పని) అని అర్థం. అంటే అత్యంత శ్రద్ధాభక్తులతో ఎవరి తల్లిదండ్రులకు వారు చేసే క్రియ ఇది. ఇక్కడ క్రియ లేదా ఆచారం కన్నా శ్రద్ధ, విశ్వాసం ముఖ్యం.

మహాలయపక్షానికి సంబంధించిన ఒక ఇతిహాసం ఉంది. అదేమింటే...

**పిండప్రదానం కృతజ్ఞతా క్రతువు. మనకు రూపురేఖలను ఇవ్వడమే కాక, ప్రేమను పంచినా, అపురూపంగా పెంచినా పెద్దలు, మన కష్టసుఖాల్లో స్పందించిన ఆత్మీయులు. ఈ లోకాన్ని విడిచి వెళ్లినా మనల్ని విడిచి వెళ్లలేదని, వారు భౌతికంగా దూరమైనా మన అనుభూతుల్లో సదా సజీవులేనని చాటేదే పిండప్రదానం. వారు మనకిచ్చినవాటికి ప్రతిగా మనం చాటుకునే కృతజ్ఞతకూ సంకేతమే పిండప్రదానం.**

**మనం పెట్టే పిడికెడు ముద్దల్లో కొండంత అనుబంధం దాగి ఉంటుంది. విడిచే తర్పణంలో వారికోసం మన హృదయాల్లో పదిలంగా ఉన్న ఆర్ద్రత మిళితం అవుతుంది.**



భారతయుద్ధంలో వీరమరణం పొందిన కర్ణుడు స్వర్గలోకానికి వెళ్తాడు. మార్గంలో అతనికి ఆకలిదప్పులు వేస్తాయి. ఏ పండు తిందామని చేతిలోకి తీసుకున్నా వెంటనే అది బంగారంగా మారిపోతుంది. చివరకు నీరు తాగుదామన్నా అది కూడా బంగారంగా మారిపోతుంది. అతనికి ఆకలి, దప్పిక తీరకపోగా మరింత తీవ్రమౌతాయి. ఇంతలో ఆకాశవాణి "కర్ణా! నీవు మహాదాతవు. చేతికి ఎముకలేని దాతవని లోకప్రసిద్ధి పొందావు. అయితే నీ దానాలన్నీ బంగారం, వెండి, ఇతర వస్తువుల రూపంలో చేశావు. నీ చేత్తో ఎవరికీ పట్టెడన్నం పెట్టలేదు. అందుకే నీకీ దుస్థితి కలిగింది" అని పలుకుతుంది. వెంటనే కర్ణుడు తన తండ్రి సూర్యదేవుని వద్దకు వెళ్లి, అనేక విధాలుగా ఆయన్ను వేడుకుంటాడు. కరుణించిన సూర్యుడు, కర్ణునికి సశీరంగా వెళ్లి, అందరికీ అన్న సంతర్పణలు చేసి తిరిగివచ్చే అపురూపమైన అవకాశం ఇచ్చారు. కర్ణుడు ఆనందంతో తన రాజ్యానికి వెళ్లి, ప్రజలందరికీ షడ్రసోపేతమైన భోజనం పెడతాడు. ప్రజలతో పాటు పితృదేవతలకు కూడా పిండప్రదానాలు చేస్తాడు. దాంతో అతనికి ఆకలిదప్పులు తీరిపోతాయి. తిరిగి అతడు స్వర్గానికి చేరుకుంటాడు. ఈవిధంగా కర్ణుడు భాద్రపదబహుళపాడ్యమినుంచి అమావాస్యవరకు తన పితృదేవతలను అర్చించి, స్వర్గాన్ని పొందిన కారణంగా ఈ కాలాన్ని పితృపక్షంగా, మహాలయపక్షంగా వ్యవహరించటం ఆచారంలోకి వచ్చింది.

ఏటా నిర్వహించే ఆబ్దీకం(తద్దినం) కన్నా ఈ పక్షం అతిముఖ్యమైంది. మహాలయపక్షమంతా చేయలేని వారు కనీసం ఒకరోజు అయినా అన్నశ్రాద్ధం చేయాలి. అలా కుదరని వారు హిరణ్యదానం చేయాలి. అదీ కుదరని వారు, ఏమీ చేయలేని అశక్తులు చివరకు గతించిన తమ తల్లిదండ్రులను తలచుకుని కనీసం కన్నీరైనా కార్చాలని ధర్మశాస్త్రం చెబుతోంది.

మహాలయపక్షమంతా పితృకర్మలుచేయలేని వారు మహాలయఅమావాస్య (భాద్రపదంలో వచ్చే అమావాస్య) రోజున పితృకర్మ నిర్వహించినా పితృదేవతల అనుగ్రహం కలుగుతుంది. బ్రాహ్మణుని ఇంటికి పిలిచి, ఆయనకు బియ్యం, పప్పు, ఉప్పు, కూరలు వగైరా దానం చేయాలి. తాంబూలం, దక్షిణ ఇచ్చి ఆయన ఆశీర్వాదం తీసుకోవాలి. పితృదేవతలకు ఈ పదిహేను రోజుల్లో తర్పణలు విడిచిపెట్టాలి. ఇందుకు వర్ణవిభేదాలు, నిషేధాలు ఏమీ లేవు. అన్ని వర్ణాలవారూ గతించిన తమ తల్లి దండ్రులకు ఉత్తమ గతులు కలగాలని కోరుతూ ఈ క్రియ చేయవచ్చు. మనం తినటానికి ఏ పదార్థాన్ని ఎంచుకున్నామో అదే పదార్థాన్ని పితృదేవతల పేరు మీదుగా దానం చేయవచ్చు. పెద్దల పేరు మీద అన్నసంతర్పణ చేయవచ్చు.

పితృదేవతలకు శ్రాద్ధకర్మ నిర్వహించని వారికి పితృదేవతల శాపం తగులుతుందని శాస్త్రం చెబుతోంది. పితృదేవతల ఆగ్రహానికి గురైతే సంతానం కలగకపోవటం, అయుక్షీణం వంటి అమంగళాలు కలుగుతాయి. కాబట్టి, పితృదేవతల ప్రీతిగా ఈ మహాలయపక్షంలో శ్రాద్ధవిధులను అన్ని వర్ణాల వారు తప్పకుండా నిర్వహించి తీరాలి.

ఈ క్రియలన్నిటిలో పరమార్థం ఒక్కటే. మనకు జన్మనిచ్చి, పెంచి, పోషించి, సమాజంలో మనకంటూ ఓ స్థానాన్నిచ్చిన తల్లిదండ్రులను వారు ఉన్నా, లేకపోయినా విస్మరించ కూడదనే ధర్మాన్ని ఈ ఆచారం మనకు బోధిస్తోంది.

దేవో యది పితా జాతః శుభ కర్మానుసారతః।
తస్యాన్న మమృతం భూత్వాదేవ త్వే ప్యనుగచ్ఛతి॥

గతించిన ఓ వ్యక్తి తాను ఇక్కడున్నప్పుడు చేసిన మంచి పనుల కారణంగా దేవలోకానికి వెళ్లినట్లయితే వాళ్లవాళ్లు పెట్టే పిండాలు అతనికి అమృతం (దేవతల ఆహారం కదా!) రూపంలో అందుతాయి.

అందుకే ఈ మహాలయపక్షాలలో మా వాళ్లెవరైనా మమ్మల్ని తలుచుకుని పిండప్రదానాన్ని చేస్తూ మాకో ముద్దని పెట్టరా? అని పై పితృలోకం నుండి ఎదురుచూస్తూ గడుపుతారు. కాబట్టే ఆ లోకాన్ని పితృలోకమనీ, ఎదురు చూస్తే వాళ్లను పితృదేవతలనీ అంటారు. ఈ పదిహేనురోజుల కాలంలో గనుక మనం వాళ్లను తలుచుకుంటూ పిండప్రదానాన్ని చేస్తే– ఇబ్బందుల్ని తొలగించి మనం ముందుకెళ్లేలా మన క్షేమానికి తోడ్పడుతారు వాళ్లు. అందుకే తప్పక పిండప్రదానం చేద్దాం! పితృదేవతల ఆశీస్సులని పొందుదాం!


వాహనాలపై విహరించే స్వామిని వీక్షించిన వారికి పునర్జన్మ ఉండదు

# తిరునాగైపట్టణమ్

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

శ్రీవైష్ణవసంప్రదాయంలో మొట్టమొదటి కైంకర్యశ్రీగా ప్రసిద్ధిచెందినవాడు ఆదిశేషుడు. అతనికి నాగరాజు అని కూడా పేరు. నాగరాజు పేరుతో ప్రసిద్ధిచెందిన దివ్యక్షేత్రం నాగపట్నం.

తిరువారూర్ క్షేత్రం నుండి 24 కిలోమీటర్లదూరంలో తూర్పుదిక్కున ఈ దివ్యక్షేత్రం ఉంది. మూడుప్రాకారాలతో, అద్భుతమైన ప్రకృతి రామణీయకతతో, ఏడుఅంతస్తుల రాజ గోపురంతో ఈ క్షేత్రం విరాజిల్లుతోంది. ఇక్కడి మూలమూర్తి శ్రీదేవిభూదేవిసమేత నీలమేఘప్పెరుమాళ్. తూర్పుముఖంగా నిలుచున్న భంగిమలో వేంచేసి ఉంటాడు. ఉత్సవమూర్తి సౌందర్యరాజ పెరుమాళ్, అమ్మవారు సౌందర్యవల్లి తాయార్. ఈ ఆలయతీర్థం సారపుష్కరిణి. మామిడి చెట్టు స్థలవృక్షం. ఇక్కడ విశేషం ఏమిటంటే ఆదిశేషుడు భగవంతుడికి కైంకర్యం చేసే విధంగా నిలుచున్న భంగిమలో నీలమేఘప్పెరుమాళ్‌గా, కూర్చున్న భంగిమలో గోవిందరాజస్వామిగా, శయనభంగిమలో రంగనాథ స్వామిగా ప్రత్యేకసన్నిధిలో వేంచేసి అనుగ్రహిస్తున్నాడు. అలాగే మనం ఎక్కడా చూడనటువంటి ఎనిమిది భుజాలతో అష్టభుజ నరసింహమూర్తి మనకు ఇక్కడ కనిపిస్తాడు. ఒక చేయి ప్రహ్లాదుని శిరస్సును తాకుతున్నట్లు, మరోచేయి అభయహస్తంతో, మిగిలిన చేతులు హిరణ్యకశిపుని సంహరించేటట్లు ఉంటుంది.

## స్థలపురాణం

ధ్రువుడు నారదుని ఉపదేశంతో భగవంతుణ్ణి గూర్చి తపస్సు చేయాలనుకుంటాడు. దేవదేవుడు దాన్ని స్వీకరించి



లోకులను ఉజ్జీవింపచేయడానికి సంకల్పించుకుని, రాజభోగాలనీ తృణీకరించిన ధ్రువుని ప్రార్థనమేరకు ఈ క్షేత్రంలో వెలిశాడు.

ఈ క్షేత్రంలోని సౌందర్యరాజస్వామికి నమస్కరించే వాళ్లకు సమస్తదోషాలు తొలగుతాయి. పార్వతీదేవి భగవంతుణ్ణి గురించి తపస్సు చేసి, తాను పోగొట్టుకున్న సౌందర్యాన్ని తిరిగి పొందినట్లు ఈ స్థలమాహాత్మ్యం తెలియజేస్తోంది. అలాగే చోళనాడును పరిపాలిస్తున్న శాలిశుకుడు అనే రాజుకు ఈ సౌందర్యరాజస్వామిని ప్రతినిత్యం సేవించుకునే అలవాటు. తన పరిపాలనలో ఎలాంటి లోటు ఉండకూడదనుకుని ఒక సొరంగమార్గాన్ని తవ్వించుకుని, దాని ద్వారా ప్రతిరోజు ఈ స్వామిని సేవించుకునేవాడు. ఒకసారి ఆ సొరంగమార్గంలో ప్రకృతికి భిన్నంగా మూడుస్తనాలతో ఉన్న ఒక అందమైన అమ్మాయిని చూచాడు. నాగకులజాతికి చెందిన ఆ అమ్మాయిని రాజు ఎప్పుడైతే చూచాడో, ఆమె మూడవ స్తనం మాయమైంది. కారణం ఈ స్వామి మహిమ.

తరువాత వారిరువురు సౌందర్యరాజస్వామి ఎదురుగా వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత ఆలయానికి ఎన్నో కైంకర్యాలు చేశారు.

శరీరంలో ఎలాంటి అవయవదోషాలున్నా ఈ స్వామి అనుగ్రహంతో అవి తొలగుతాయని ప్రతీతి. తిరుమంగైయాళ్వారు పదిపాశురాలతో ఈస్వామిని కీర్తించి ఉన్నాడు. ఇక్కడ పాంచరాత్రాగమోక్తంగా స్వామి పూజ లందుకుంటున్నాడు. చోళులు, పల్లవులు, మరాఠాలు ఈ దేవాలయానికి అనేక కైంకర్యాలు చేశారు. ముత్తుస్వామిదీక్షితులు అద్భుతంగా ఈ స్వామిని కీర్తించాడు. ఇలాంటి ప్రసిద్ధక్షేత్రాన్ని, ఇక్కడి భగవంతుణ్ణి ఎవరైతే దర్శించుకుంటారో వాళ్లకు అవయవ కొరతలన్నీ తీరుతాయి. కనుక ప్రతి ఒక్కరు ఈ దివ్యక్షేత్రాన్ని దర్శించుకుని కొరతలు తీరి సుఖమయమైన జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్ష!



# ఈయనకు తెలియని స్వామి రహస్యాలుండవు

–డా॥కె. రాధారమణ

తిరుమల శ్రీనివాసుడికి ప్రియసఖుడు గరుడుడు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఐదవరోజు రాత్రి జరిగే గరుడసేవ విశిష్టమైంది. అనాదిగా ఈసేవకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. గరుడవాహనం అధిరోహించే స్వామిమూర్తి మలయప్పకు మూలవిరాట్టుకున్న మకరకంఠి, సహస్రనామహారం, లక్ష్మీహారం, పచ్చమొదలైనవాటిని అలంకరిస్తారు. మూలవిరాట్టే ఈ వాహనాన్ని ఆవహించి భక్తులను అనుగ్రహిస్తారని ఐతిహ్యం.

గరుడసేవ ఊరేగింపు సమయంలో స్వామి ఆలయాన్ని వీడి తిరువీథులలో సంచరిస్తారని భక్తుల నమ్మకం. అందుకే అశేష సంఖ్యలో భక్తులు గరుడసేవకు హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. అంతేకాక గరుత్మంతుడు నిత్యసూరి, స్వామికి దాసుడు, సఖుడు, వాహనం, పతాకచిహ్నం, గరుత్మంతునికి తెలియని స్వామి రహస్యాలుండవు. గరుడుని 'పెరియతిరువడి' అనడం వైష్ణవసంప్రదాయం.

**ఈ నెల 19న శ్రీవారి గరుడసేవ**

గరుడసేవలో స్వామిని దర్శిస్తే కోర్కెలు తీరుతాయని, ముల్లోకాలదేవతలు కూడా గరుడసేవలో స్వామివారిని దర్శించడానికి వస్తారని భక్తుల నమ్మకం. తొమ్మిది రోజులు జరిగే బ్రహ్మోత్సవాల్లో ఇది పరాకాష్ఠ. గతంలో వేలల్లో ఉండే భక్తుల సంఖ్య ఇప్పుడు లక్షలకు పెరిగింది.

రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి గరుడసేవ రోజున స్వామికి పట్టువస్త్రాలను సమర్పించేవారు. మర్రిచెన్నారెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో ఈ సంప్ర దాయానికి శ్రీకారం చుట్టారు. అప్పటినుంచి నిరంతరాయంగా కొనసాగుతోంది.

కాలక్రమంలో గరుడసేవ రోజున అధిక రద్దీ, భద్రతాపరమైన కారణంగా 2004లో డా॥ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దాన్ని సవరించి బ్రహ్మోత్సవాల మొదటిరోజున అంటే ధ్వజారోహణం తర్వాత ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించడాన్ని కొనసాగిస్తున్నారు. ఇదే ప్రక్రియ నేటికీ కొనసాగుతోంది.

చెన్నైనుండి గరుడోత్సవంనాడే నూతన గొడుగులను సమర్పించే విధానం అనాదిగా వస్తోంది. భక్తిశ్రద్ధలతో ఈ గొడుగులను తయారుచేసి చెన్నైనుంచి ఐదు రోజులపాటు పాదయాత్రతో తిరుమలకు చేరుకుంటారు. ఆలయం ప్రదక్షిణగా తి.తి.దే. అధికారులకు గొడుగులను అప్పగిస్తారు. వీటిలో రెండు స్వర్ణకాంతులు, మరో ఏడు శ్వేత కాంతులతో ఉంటాయి. (ముఖచిత్ర కథనం)

తిరుమల తిరుపతి దేవస్థానములు



కలియుగ ప్రత్యక్షదైవమైన
శ్రీవేంకటేశ్వరుడు అందరినీ
రక్షించాలనే సదుద్దేశ్యంతో
బ్రహ్మోత్సవ సందర్భంగా భక్తులకు
శ్రీవారి మంగళాశాసనాన్ని
కానుకగా అందిస్తున్నాం!

ఎవరైతే దీన్ని పఠిస్తారో
వారికి కలతలూ,
దుఃఖాలూ తొలగుతాయి.

# శ్రీవేంకటేశ్వరస్వామివారి మంగళాశాసనం

01) శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేఽర్థినామ్ ।
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

02) లక్ష్మీ సవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే ।
చక్షుషే సర్వలోకానాం వేంకటేశాయ మంగళమ్ ॥

03) శ్రీ వేంకటాద్రి శృంగాగ్రమంగళాభరణాంఘ్రయే ।
మంగళానాం నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

04) సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్ ।
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్ ॥

05) నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే ।
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్ ॥

06) స్వతస్సర్వవిదే సర్వశక్తయే సర్వశేషిణే ।
సులభాయ సుశీలాయ వేంకటేశాయ మంగళమ్ ॥

07) పరస్మై బ్రహ్మణే పూర్ణకామాయ పరమాత్మనే ।
ప్రయుంజే పరతత్త్వాయ వేంకటేశాయ మంగళమ్ ॥

08) ఆకాలతత్త్వమశ్రాంతమాత్మనామనుపశ్యతామ్ ।
అతృప్త్యమృతరూపాయ వేంకటేశాయ మంగళమ్ ॥

09) ప్రాయః స్వచరణౌ పుంసాం శరణ్యత్వేన పాణినా ।
కృపయాదిశతే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్ ॥

10) దయాఽమృతతరంగిణ్యాస్తరంగై రివ శీతలైః ।
అపాంగైస్సించతే విశ్వం వేంకటేశాయ మంగళమ్ ॥

11) స్రగ్భూషాంబర హేతీనాం సుషమాఽఽవహ మూర్తయే।
సర్వార్తి శమనాయాస్తు వేంకటేశాయ మంగళమ్ ॥

12) శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీ తటే ।
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్ ॥

13) శ్రీమత్సుందర జామాతృముని మానసవాసినే ।
సర్వలోకనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

14) మంగళాశాసన పరైర్మదాచార్య పురోగమైః ।
సర్వైశ్చ పూర్వైరాచార్యైః సత్కృతాయాస్తు మంగళమ్ ॥

\- మంగళాశాసనం సంపూర్ణం -



తిరుమల తిరుపతి దేవస్థానములు

# తి.తి.దే. నూతన పాలకమండలి

2023, ఆగష్టు నెలలో
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే
నియమితమైన
తి.తి.దేవస్థానముల
నూతన పాలకమండలి



శ్రీ భూమన కరుణాకర రెడ్డి,
శాసనసభ సభ్యులు & అధ్యక్షులు



శ్రీ పొన్నాడ వేంకట సతీష్‌కుమార్,
శాసనసభ సభ్యులు & సభ్యులు



శ్రీ ఉదయభాను సామినేని,
శాసనసభ సభ్యులు & సభ్యులు



శ్రీ ఎం.తిప్పేస్వామి,
శాసనసభ సభ్యులు & సభ్యులు



శ్రీ సిద్ధవటం యానాదయ్య,
సభ్యులు



శ్రీ చందే అశ్వత్థనాయక్,
సభ్యులు



శ్రీ మేక శేషుబాబు,
సభ్యులు



శ్రీ ఆర్. వెంకట సుబ్బారెడ్డి,
సభ్యులు



శ్రీ ఎల్లారెడ్డిగారి సీతారామి రెడ్డి,
సభ్యులు



శ్రీ గాదిరాజు వేంకట సుబ్బరాజు,
సభ్యులు



శ్రీ పి.శరత్చంద్రారెడ్డి,
సభ్యులు



శ్రీ రామిరెడ్డి సాముల,
సభ్యులు



శ్రీ బాలసుబ్రమణియన్ పళనిస్వామి,
సభ్యులు

తిరుమల తిరుపతి దేవస్థానములు

# తి.తి.దే. నూతన పాలకమండలి



శ్రీ ఎస్.ఆర్.విశ్వనాథరెడ్డి,
సభ్యులు



శ్రీమతి గడ్డం సీతారెడ్డి,
సభ్యులు



శ్రీ కృష్ణమూర్తి వైద్యనాథన్,
సభ్యులు



శ్రీ సిద్ధా వేంకటసుధీర్‌కుమార్,
సభ్యులు



శ్రీ సుదర్శన్ వేణు,
సభ్యులు



శ్రీ నెరుసు నాగసత్యం,
సభ్యులు



శ్రీ ఆర్.వి. దేశ్‌పాండే,
సభ్యులు



శ్రీ అమోల్ కాలే,
సభ్యులు



డా॥ ఎస్.శంకర్,
సభ్యులు



శ్రీ మిలింద్ కేశవ్ నార్వేకర్,
సభ్యులు



డా॥ కేతన్ దేశాయ్,
సభ్యులు



శ్రీ బోరా సౌరభ్,
సభ్యులు



శ్రీ ఆర్.కరికాలవళవన్, ఐ.ఏ.ఎస్.,
ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి,
రెవెన్యూ (ఎండోమెంట్స్) విభాగం,
ఎక్స్-అఫిషియో సభ్యులు



శ్రీ సత్యనారాయణ, ఐ.ఏ.ఎస్.,
కమీషనర్, ఎండోమెంట్ విభాగం (ఆం.ప్ర.),
ఎక్స్-అఫిషియో సభ్యులు



శ్రీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి,
తుడా ఛైర్మన్, తిరుపతి,
ఎక్స్-అఫిషియో సభ్యులు



శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దే.,
ఎక్స్-అఫిషియో సభ్యులు





2023, ఆగష్టు 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు జరిగిన తిరుమల శ్రీవారి పవిత్రోత్సవ దృశ్యాలు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., దంపతులు పాల్గొన్నారు.



తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి ఇటీవల తిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లో సామాన్యభక్తుడి తరహాలో వెళ్లి సర్వదర్శనం వసతులు పరిశీలించిన చిత్రం.



తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకర రెడ్డి స్థానిక ఆలయాల్ని సందర్శించిన చిత్రం. ఈ కార్యక్రమంలో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్. పాల్గొన్నారు.




శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ-శిల్పకళాశాల, తి.తి.దే.లో 2023, సెప్టెంబరు 04 నుండి 06వ తేదీ వరకు జరిగిన మూడురోజుల వర్క్‌షాప్ దృశ్యం. ఇందులో తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకర రెడ్డి, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి (హెచ్.&ఈ) శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్. తదితరులు పాల్గొన్నారు.




తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి (హెచ్ & ఈ) శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్. ఇటీవల **కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం** రథయాత్రను ప్రారంభించిన దృశ్యం

ఈ నెల 20వ తేదీ సరస్వతీపూజ సందర్భంగా...

మన దేవాలయాలు

# తల్లీ! నిన్ను దలంచి..

- శ్రీమతి రమా శాండిల్య,
96187 66600

భారతదేశంలో సనాతన హిందూధర్మవ్యాప్తికి శ్రీశ్రీశ్రీ ఆది శంకరులు చేసిన కృషిలో భాగమైన నాలుగుపీఠాలలో ఒకటి, శృంగేరిపీఠం.

ఆ వాదాలు, ఈ వాదాలు అని, ఎటుపోవాలో తెలీక తికమకపడుతున్న కాలఘట్టంలో అవతరించినవారు శంకరులు. ఆయన జీవించింది స్వల్పకాలమే అయినా ఆ స్వల్పకాలంలో హైందవమత పునరుజ్జీవనానికి అనల్పమైన సేవచేసిన మహాత్ముడాయన. వేదవేదాంగాలకు నిత్యనూతనమైన వాఖ్యానాలు వెలయించి, ఎదురైన పండితులను తన వాదపటిమతో మెప్పించి, నిరీశ్వరవాదానికి నిలువనీడలేకుండా చేసి, అద్వైత సిద్ధాంతానికి హిమాలయ ప్రాముఖ్యత కల్పించిన మాన్యులు శ్రీశంకరభగవత్పాదులు.

తను ప్రవచించిన సిద్ధాంతాలు తాళపత్రగ్రంథాల వరకే పరిమితమై పోకుండా సామాన్యప్రజానీకంలో కూడా ప్రచారం జరగడానికి ఆసేతుహిమాచలం పాదయాత్ర చేసి, దేశం నాలుగుచెరగులా జ్ఞానసుధాజ్యోతులు వెలిగించారు. అలా ఆది శంకరులు వెలయించిన విజ్ఞానమందిరాలలో ఒకటి- శృంగేరి శారదాపీఠం.

శృంగగిరి అనే పర్వతప్రాంతంలో ఋష్యశృంగమహర్షి కుటీరం ఉండేదట. ఆయన తపస్సు చేసుకున్న ఆ స్థలమే ఋష్యశృంగగిరి, ఆ తర్వాత శృంగగిరిగా రూపాంతరం చెంది చివరికి శృంగేరి అయిందని చెబుతారు.

ఈ శృంగేరి, కర్ణాటకరాష్ట్రంలోని, చిక్‌మంగుళూరు జిల్లాలో ఉంది. తుంగానది ఒడ్డున, శృంగగిరిపర్వత పరిసరాలలో ఉంది. ప్రకృతి అత్యంతసుందరంగా ఉంటుందిక్కడ.

**శృంగేరిలో మనం దర్శించుకునే స్థలాలు.** 1)శృంగేరి శారదామాత దేవాలయం 2)విద్యాశంకరదేవాలయం 3)ఆది శంకరుల దేవాలయం 4)నరసింహవనం 5)తుంగానది

శృంగేరి శారదామాతమూర్తిని దర్శించాలంటే ఎన్నో జన్మల పుణ్యం చేసుకోవాలి. ఈ దేవాలయపరిసరాలలో మనం తిరిగేటప్పుడు అతిపవిత్రభావనలే కలుగుతాయి ఎవరికైనా. మనను ఉద్ధరించడానికి భువినుండి దివికి దిగి వచ్చిన సరస్వతీ దేవి ఇక్కడ విగ్రహమూర్తిగా మనకు దర్శనమిచ్చి పాలిస్తున్నదేమో అనిపిస్తుంది. శృంగేరీశారదాపీఠంలో వెలుగొందే శారదాంబవిగ్రహాన్ని ఆదిశంకరులే స్వయంగా కాశ్మీరునుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠించారని అంటారు.

శృంగేరి ఆలయం నిర్మాణశైలి, హోయసల ఆలయ నిర్మాణాన్ని పోలి అత్యంత సుందరంగా దర్శనమిస్తుంది.

## తుంగానది

ముఖ్యంగా ఈ నది పరిసరాలు సూర్యోదయ సమయంలో చూచి తీరాల్సిందే! ప్రకృతికి ఆలవాలంగా, ఆ నదీపరిసరాలు కనిపిస్తాయి. తుంగానదిలో మీనాలను చూడటానికి పెద్దవారు కూడా పిల్లలుగా మారి మరమరాలను వాటికి పెట్టి, ఆనందించే దృశ్యాలు అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంటాయి. ఇక్కడి దేవాలయాలలో అభిషేకజలాలు ఈ తుంగానదీ జలాలతో జరుపుతారు.

తుంగానదిపైన నిర్మించిన ఒక వంతెనకు 'విద్యాశంకర సేతువు' అనే పేరుతో విద్యాతీర్థస్వామివారి ఆధ్వర్యంలో నిర్మించారని చెబుతారు. ఇక్కడి పరిసరాలలో విద్యాశంకరుల దేవాలయం, ఆలయంలో మూర్తి లింగరూపంలో ఉంటుంది. ఇరువైపులా అమ్మవారు, గణపతి కొలువై ఉంటారు.

ఇక్కడ తప్పక దర్శించాల్సిన ముఖ్యవిశేషం మరొకటుంది. ఈ దేవాలయ మంటపస్తంభాలపై పన్నెండు రాశులు చెక్కి ఉంటాయి. ఆలయనిర్మాణంలో కిటికీల నిర్మాణశైలి అద్భుతం. ఆయా మాసాల ప్రకారం, ఆయా రాశులున్న

స్తంభాలపై, కిటికీల నుండి సూర్య కిరణాలు పడుతూ, రాశుల గమనాన్ని మనకు తెలియజేస్తూ ఉంటాయి. ఇంకొక విశేషం కూడా మనకు కనిపిస్తుంది. మండపంలోని గోళాకారపురాళ్లు, సింహం నోటి నుండి జారుతున్నట్లు అనిపిస్తాయి. కానీ, ఆ సింహపు నోటి అంచులలో ఈ రాళ్లు ఎలాంటి ఆధారమూ లేకుండా నిలిచి ఉంటాయి. ఆ ప్రాంగణంలో ఇంకా అనేక చిన్న చిన్నదేవాలయాలు కూడా ఉన్నాయి.



## నృసింహవనం

తుంగానదికి ఆవలి ఒడ్డున నృసింహవనం ఉంది. శృంగేరి పీఠాధిపతులే ఈ నృసింహవనం లోని పీఠాన్ని కూడా అర్చిస్తారని చెబుతారు. ఈ వనంలో– ముఖ్యంగా పూర్వ పీఠాధిపతుల విదేహమూర్తుల స్మారకచిహ్నాలుంటాయి. ఈ స్మారకచిహ్నాలతో పాటు, మొదటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ఆదిశంకరులవారు, పిదప పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యాశంకర తీర్థులవారు, ముప్పైఆరవ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వామివారి విగ్రహాలను కూడా దర్శించుకోవచ్చు.

ఈ పీఠానికి 120 పైనే శాఖలు ఉన్నాయి. ముఖ్యంగా శృంగేరి, హైదరాబాదు, విజయవాడ, గుంటూరు, రేపల్లెలలోని ప్రధానశాఖలను గురించి తెలుగురాష్ట్రాలవారికి ఎక్కువగా తెలుసు. పీఠంలో జరిగే కార్యక్రమాల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో శృంగేరిపీఠంవారి కేలండర్ ద్వారా మనం తెలుసుకోవచ్చు.

## గురుపరంపర

ఇప్పటివరకూ మొత్తం ముప్పైఏడుమంది పీఠాధిపతులున్నారు. వారిలో మొదటివారు ఆదిశంకరులు, రెండవ వారు సురేశ్వరాచార్యులు, పదవ పీఠాధిపతి విద్యాశంకర తీర్థులు, ముప్పైనాలుగవ పీఠాధిపతి చంద్రశేఖరభారతి స్వామీజీ, ముప్పైఐదవ పీఠాధిపతి అభినవ విద్యాతీర్థస్వామిజీ, ముప్పై ఆరవ పీఠాధిపతి భారతీతీర్థ స్వామీజీ (వీరు వ్రాసిన "కీర్తన జనబాహుళ్యానికి అత్యంత శ్రద్ధతో, భక్తిపూర్వకంగా పాడుకునే కీర్తనగా ప్రసిద్ధి పొందినది.)

ఇక ఇప్పటి పీఠాధిపతులు ప్రస్తుతం ఈ పీఠం శ్రీశ్రీశ్రీ విధు శేఖర భారతీ తీర్థ స్వామీజీ వారి పర్యవేక్షణలో ఉంది.

శృంగేరి దర్శించాలనుకున్న వారు, వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందవచ్చు.

ఇక ప్రయాణానికి అన్ని కాలాలు అనుకూలమే! కర్ణాటక రాష్ట్రరవాణాశాఖవారి బస్సులు అందుబాటులో ఉన్నాయి. దేశం నలుమూలలనుంచి రైలుమార్గాలు బెంగళూరువరకూ ఉన్నాయి. విమానమార్గంద్వారా కూడా బెంగళూరు, మైసూరువరకూ ప్రయాణించి కారులో శృంగేరి చేరుకోవచ్చు.

సర్వకాల సర్వావస్థలలో శృంగేరి అమ్మవారి దర్శనం అద్భుతమే! అమ్మవారిదర్శనంతో పాటు గురువులను కూడా దర్శించుకుని, వారు చేసే చంద్రమౌళీశ్వరుడి అభిషేకతీర్థాన్ని స్వీకరించి రావచ్చు. మన ఆలోచనలకీ, మనోస్థితికీ అవినాభావ సంబంధం ఉంది. సుందరదృశ్యాలనో, తియ్యని అనుభవాలనో తలచుకున్నట్లయితే మనసుకు శాంతి, సంతోషం కల్గుతాయి. అందుకే– ప్రసన్నవదనంతో దయార్ద్రమైన కడగంటిచూపుతో, చిన్ముద్రతో జ్ఞానస్వరూపుడైన దక్షిణామూర్తిలా – అమృతకలశం, పుస్తకం, జపమాల ధరించి, దర్శనమిచ్చే శారదాంబను దర్శించడం, స్తుతించడం, స్మరించడం, మనసుకు శాంతి, అవ్యాజ ఆనందం కల్గిస్తుంది.

సర్వేజనాస్సుఖినోభవంతు!


తిరుమలలో శ్రీస్వామివారికి జరిగే తొలిసేవ సుప్రభాతం

# తిరుమల అంటేనే ఆనందం

- ఆచార్య శలాక రఘునాథశర్మ,
98660 68542




దయాపరతంత్రులైన మహర్షులు, మహాభావుకవరేణ్యులు పరమాత్మ చైతన్యాన్ని ప్రతీకాత్మకంగా అందరికీ అందుబాటులోకి తెచ్చారు. దేవాలయభావన అందులో గణనీయమైంది. దేవాలయాలలో ప్రపంచంలోనే పరమోన్నతస్థాయినందుకున్నది తిరుమల శ్రీనివాసుని ఆనందనిలయం. దీనికి సంబంధించిన వైదికభావన రేఖామాత్రంగా- తిరుమలను ఏడుకొండల సమాహారంగా మనం చూస్తున్నాం. ఇది ప్రకృతి ప్రసాదించిన ఒక మహావిషయం. వేదమంత్రాలు అనుగ్రహించిన తత్త్వభూమిలో పండిన అమృతసస్యం యోగశాస్త్రం. అది మూలాధారం నుండి సహస్రారం దాకా సప్తభూమికలను వివరిస్తోంది. పిండాండంలో అంటే మానవాదుల దేహాలలో ఇవి వరుసగా ఇలా ఉంటాయి.

1)మూలాధారం 2)మణిపూరం 3)స్వాధిష్ఠానం 4)విశుద్ధం 5)అనాహతం 6)ఆజ్ఞ 7)సహస్రారం- అనేవి.

ఇవి బ్రహ్మాండంలో కూడా ఉంటాయి. పిండాండంలో సూక్ష్మస్వరూపంలో ఉంటే బ్రహ్మాండంలో స్థూలస్వరూపంలో ఉంటాయి. అవే వరుసగా భూమి, నీరు, నిప్పు, గాలి, నింగి, సూర్యుడు, చంద్రుడు అనేవి. పిండంలో సహస్రారకమలం అంటే మెదడు అనుకుందాం. బ్రహ్మాండంలో ఆస్థానం చంద్రుడిది. ఇక్కడా, అక్కడా అధివసించి, చిదాత్మకంగా ఆనందస్వరూపంతో ఉన్న పరమాత్మ యజమాన స్వరూపుడు. ఆ పరమాత్మయే ప్రకృతి ప్రసాదించిన ఏడుకొండల మీద ఆనందనిలయరూపమైన సహస్రారకమలాత్మక చంద్రబింబంలో లీలగా భావించే శ్రీవేంకటేశ్వరస్వామి. అనంతమైన బ్రహ్మాండంలో అందరికీ ఆనందాన్ని అందించటం కోసం సర్వకాల సర్వావస్థలలో నిలిచి ఉన్న నిత్యకల్యాణ స్వరూపుడు ఆ స్వామి.

వేదమాత పరమాత్మ స్వరూపాన్ని పరమాద్భుత పదజాలంతో వర్ణించి మానవజాతి కందించింది. ఆ మంత్ర వాక్యాల స్థూలతాత్పర్యం-

ఈ సృష్టిలో కనపడేది, వినబడేది ఏ కొంచెం ఉన్నదో దానిలోపలా, వెలుపలా అంతటా వ్యాపించి నారాయణుడే ఉన్నాడు. ఆయన అనంతుడు, అవ్యయుడు, కవి, సంసార విచ్ఛేదనం చేసేవాడు, సంసారసుఖాన్ని సమకూర్చేవాడు.

మన దేహంలో హృదయమనే తలక్రిందుగా ఉన్న తామరమొగ్గ ఉంది. అది కంఠముడికి జానెడు క్రిందగా బొడ్డుకు జానెడు పైగా ఉంది. అది జ్వాలలమాలలతో చెల్లాచెదురుగా నిండి ఉంది. అదే ఈ విశ్వానికంతటికీ గొప్పనెలవు. దాని నిండా సిరలు ఓతప్రోతంగా అల్లుకుని ఉన్నాయి. చిన్న మొగ్గలాగా వ్రేలాడుతూ ఉంది. దాని మధ్య సన్ననిరంధ్రం ఒకటి ఉంది. అందులో ఈ జగత్తంతా భద్రంగా నెలకొని ఉంది. ఆ రంధ్రంనడుమ అన్నివైపులా జ్వాలలతో, అన్నివైపులకు చూస్తూ ఒక మహాగ్ని ప్రకాశిస్తోంది. అది తన ముందున్న ఆహారాన్నంతటిని తింటూ, విభజిస్తూ, ముదిమిలేనిదై, సర్వమూ తెలిసిందై ఉంటుంది. దాని జ్వాలలు అడ్డంగా పై వైపుగా వ్యాపించి ఉన్నాయి. అదే ఈ దేహాన్నంతటినీ కాలి అడుగు భాగంనుండి తలపై భాగం వరకు వెచ్చదనం కలిగిస్తూ ఉంటుంది. ఆ అగ్నిమధ్య అతిసూక్ష్మాకారంలో పై వైపుకు వ్యాపిస్తూ ఒక జ్వాల వ్యాపించి ఉంది. నల్లని మొయిలు నడుమ తళతళలాడిపోతూ ఉండే మెఱుపుతీగలాగా అది ఉంటుంది. వరిముల్లు అంత సన్నని స్వరూపంతో అణువువలె పచ్చని వన్నెతో వెలిగిపోతూ ఉంటుంది. ఆ అగ్నిజ్వాలనడుమ పరమాత్మ ప్రకాశిస్తూ నిలకడగా ఉంటుంది. ఆ తత్త్వాన్నే బ్రహ్మ అనీ, శివుడనీ, హరి అనీ, అక్షరమనీ, పరమమనీ అంటారు. లేదా ఆ అన్నితత్త్వాల సముదాయమే అది.

ఇంత విస్పష్టంగా పరమాత్మస్వరూపాన్ని అభివర్ణించిన మహాకావ్యాలు చాలా అరుదు. సర్వజీవ హృదయాంతరాళాలలో ఉన్న పరమాత్మతత్త్వాన్ని తెలుసుకోవటానికీ, అనుభవంలోకి తెచ్చుకోవటానికీ అంతరంగంలో చెదరకుండా నిలుపుకోవటానికీ ఈ వర్ణన ఎంతగానో సహకరిస్తుంది.

కాగా ప్రస్తుతానికి వస్తే తిరుమల ఏడుకొండలలో ఏడు ప్రాకారాలతో నిండిన గర్భగుడిలో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామియే ఆ వహ్నిశిఖ. పై తొడుగులన్నింటినీ ప్రాకారాలను దాటి వెళ్లినట్లుగా తొలగించుకుని చూడటానికి ఎన్నో ప్రయత్నాలన్నీ యోగసాధనాల వంటివి. చివరకు ఒక్కక్షణం తళుక్కున మెరసినట్లు లభించే శ్రీవారిదర్శనం ఆ హృదయంలోని అగ్నిజ్వాల కలిగించిన అనుభూతి వంటిది. అది క్షణమాత్రమే కావచ్చు, కానీ అది కలిగించే ఆనందం అక్షరాలకు అందనిది. మనస్సును వివశం చేసివేసేటంతటిది. అందుకే మళ్లీ ఈ సన్నివేశంలో "యతో వాచో నివర్తన్తే అప్రాప్యమనసా సహ ఆనందం బ్రహ్మణో విద్వాన్ నబిభేతి కుతశ్చన" అన్న మంత్రం మదిలో మెదలుతుంది. "అక్కడ మాటలు మరలి పోతాయి. మనసు వెనుదిరుగుతుంది. అట్టి బ్రహ్మానందాన్ని ఎరిగినవాడు ఎక్కడా భయపడడు" అని ఈ మంత్రాలకు అర్థం. అక్కడ భయపడడు అంటే పరమాత్మ తాదాత్మ్యం పొందుతాడని భావన.




ఎందుకంటే సూర్యుడికీ, వాయువుకీ, అగ్నీంద్రులకీ, మృత్యుదేవతలకూ కూడ భయం ఉంటుందని వేదం చెబుతోంది.

వాయువు ఆ పరమాత్మవల్ల కలిగిన భయంతో వీస్తోంది. సూర్యుడు ఉదయిస్తున్నాడు, అగ్ని మండుతున్నాడు, ఇంద్రుడు పాలిస్తున్నాడు, మృత్యువు జీవుల వెంటబడి ప్రాణాలు తీస్తోంది. కనుక పరమాత్మ దర్శనం కలిగిన అనంతరం ఎక్కడా భయపడడు అనే మాటకు పరమాత్మ తాదాత్మ్యం పొందుతాడనే అర్థాన్నే గ్రహించాలి. అలాగే శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం పొందిన భక్తులు పొందే ఆనంద సాంద్రస్థితి– తెలుసుకుని నిజంగా పొందగలిగితే– పరమాత్మానందమే అవుతుంది. అందుకే ఆ ఆలయ మందిరాన్ని ఆనందనిలయం" అంటారు. వచ్చేపోయే ఆనందమైతే అది కేవలం లౌకికం. వివేకవంతుడు దానిని అపేక్షించడు. ఎందుకంటే ఎలాగూపోయేదే కదా! దానికోసం వెంపరలాడటం, పాట్లుపడటం, పోయినప్పుడు ఏడుస్తూ కూచోవటం ఏమి వివేకం! ఇది అలాకాదు. ఇది వచ్చేదే కానీ పోయేదికాదు. నిత్యకల్యాణమై నిలిచి ఉండేదే కానీ దానికి ఆగమాపాయాలు ఉండవు. ఈ మహాతత్త్వానికి అవిచలితమైన ప్రతీక తిరుమలలోని శ్రీవారి ఆలయం. పరమార్థభావనకు నిలువెల్లా ఆలయం చేసుకున్న ఆ పవిత్రభూతలంమీద ఆలయనిర్మాణం చేసింది నిమిత్తమాత్రంగా కొందరు వ్యక్తులు మాత్రమే కావచ్చు. కానీ అది పరమాత్మ ప్రబోధనల వల్లనే సంభవించిందని మనం గట్టిగా విశ్వసించాలి. ఎందుకంటే ఇంత కార్యకారణ పరంపర చక్కగా అతకటంలో కేవలం పరిమితమైన శక్తిగల మానవ మేధయే కారణం అనగలమా? అనలేం!



# శ్రీవేంకటేశా.. దయాసాగరా!

- శ్రీమతి నల్లాని రాజేశ్వరి,
99086 02443

శ్రీవైష్ణవసంప్రదాయంలో ఎందరెందరో మహానుభావులు ఆచార్యులుగా గౌర వింపబడుతున్నారు. అయితే వారిలో 'దేశిక'నామం వేంకటనాథులకే దక్కింది.

దేశికులవారు 1268వ సంవత్సరం సౌమ్యనామసంవత్సరం, విజయ దశమి 'శ్రవణ' నక్షత్రంలో తోతాద్యంబ, అనంతసూరి దంపతులకు శ్రీని వాసానుగ్రహంతో దేశికులవారు జన్మించారు. తిరుమల శ్రీనివాసుని 'ఘంటావతారంగా', వీరిని వైష్ణవలోకం భక్తితో స్మరిస్తోంది. అన్ని దేవా లయాలలోను గర్భగుడిలో 'ఘంట' తప్పక ఉంటుంది. వీరి స్వస్థలం కాంచీ పురానికి దగ్గర్లోని 'తూప్పుల్'. దేశికులవారి గోత్రం విశ్వామిత్రగోత్రం. వీరిది పండితవంశం.

దేశికులవారు ఏకసంథాగ్రాహులు. ఒకసారి కంచిలో వైత్థాన మంటపంలో వాత్స్య వరదాచార్యులవారు రామానుజసిద్ధాంతం బోధిస్తున్నవేళ ఆత్రేయ రామానుజులవారు ఐదేళ్ళ వేంకటనాథుని వెంటబెట్టుకుని వెళ్లారట.




ఆ పసిబాలుని దివ్యతేజస్సు చూచి ప్రసంగికులు ప్రసంగం సాగించలేక మౌనం వహించారట. ఆ సమయంలో ఐదేళ్ల బాలుడు 'శాస్త్రయోనిత్వాత్' బ్రహ్మసూత్రాన్ని విశదీకరిస్తున్నారని గుర్తుచేయగా సభలోని వారు దిగ్భ్రాంతులయ్యారట. ఆ సమయంలో వత్స్యవరదాచార్యులవారు -

"నాయనా! పరమతవాదుల... వైరిసిద్ధాంతా లను పరాస్తం చేసి వేదాంతశాస్త్రసిద్ధాంతాన్ని రూఢంగా స్థాపించి, వేదవిదులచే సన్మానం పొంది సమస్త శుభపరంపరలను పొందెదవుగాక." అని ఆశీర్వదించారట. దేశికులవారికి నడాదూర్ అమ్మాళ్, ఆత్రేయ రామానుజాచార్యులు విద్యా గురువులు. శాస్త్రాలలో దేశికులవారికి 'న్యాయశాస్త్రం' చాలా ఇష్టం.

దేశికులవారి వ్యక్తిత్వం మహోన్నతమైంది. వారు లౌకికజీవితంలో వైరాగ్యప్రవృత్తితో కాలం గడిపేవారు. ఉంఛవృత్తితో సాధారణజీవితం గడిపే వారు. దేశికులవారి పాండిత్యానికి, జీవనవిధానా నికి ఆశ్చర్యపడిన కొందరు భిక్షదానం చేసే బియ్యంలో బంగారువడ్లు కలిపారు. వేంకటనాథుల

వారి ధర్మపత్ని వట్టి అమాయకురాలు. బియ్యంలో కలిసిపోయిన 'మెరిసేవి' ఏమిటని భర్తను అడిగిందట. దేశికులవారు చూచి ఇవి 'పురుగులు' అని దర్భపుల్లతో వేరుచేసి బయటపడేశారట.

దేశికులవారి సహాధ్యాయి విద్యారణ్యులవారు. తన స్నేహితుడు దుర్భర దారిద్ర్యజీవితం గడుపుతున్నాడని రాజాస్థానంలో సన్మానం, పదవి ఇప్పిస్తాను రమ్మని చెప్పారట. రాజ పరివారాన్ని కూడా పంపారట. దేశికులవారు లేఖను చదివి –

"నా తండ్రి కూడబెట్టిన ధనంలేదు. నేను స్వయంశక్తితో ఆర్జించిందీ లేదు. మా తాతగారు బ్రహ్మ అశ్వమేధయాగం చేసి హస్తిగిరి (ఏరెగె, కొండ, కంచి)లో కూర్చిన అవ్యయనిధి (వరదరాజస్వామి) ఉండగా వేరే ధనరాసులు నాకేల అన్నారట.

ఒకసారి తిరుప్పుక్కుళిలో భయంకరమైన మహమ్మారి చెలరేగింది. జననష్టం విపరీతంగా జరిగింది. ఊరుఊర్లే నిర్మానుష్యం అయ్యే ప్రమాదమైంది. ఆ సందర్భంలో దేశికులవారు 'జయసుదర్శన జయజయ శ్రీసుదర్శన' అని మొదలయ్యే అష్టకం రచించారు. ఈ అష్టకం ప్రభావం వల్ల మహమ్మారి తగ్గుముఖం పట్టి ప్రజలు స్వస్థులయ్యారు.



ఒకసారి అసూయాపరులైన పండితులు ఒక పాములవాడిని దేశికులవారి దగ్గరికి పంపి "విషసర్పాలను వశపరచుకోగలరా" అని సవాలు విసిరాడు. దేశికులు మౌనంగా ఒక రక్ష రేకు గీశారు. పాములు ఆ గీతదాటి రాలేకపోయాయి. అయినా ఒక సర్పం బుసకొడుతూ దేశికులవారివైపు రాగా దేశికులు గరుడమంత్రాన్ని ఆవాహనచేయగా ఒకపక్షి (గరుడుడు) వచ్చి విషసర్పాన్ని నోట కరచుకొని వెళ్లిపోయింది. ఇలాంటి కథనాలు దేశికుల జీవితంలో చాల ఉన్నాయి.

దేశికులు ఎన్నోదివ్యదేశాలను దర్శించినవారు. అయినా వారి జీవితంలో కాంచీపురం, శ్రీరంగం, తిరువహీంద్రపురం ప్రధానమైనవి. కాంచీపురం మతపరసాహిత్య తత్త్వశాస్త్ర వాదాలకు కేంద్రమైతే తిరువహీంద్రపురం దేశికులకు ప్రశాంతతను, ధ్యానమగ్నతను ప్రసాదించినక్షేత్రం.

దేశికులవారి రచనలు సుమారు 120. దేశికులవారు సంస్కృతం, తమిళం, మణిప్రవాళం, ప్రాకృతభాషలలో వివిధ రచనలు చేశారు. వాటిని ఆరురకాలుగా పరిశోధకులు వింగడించారు. 1)శ్రీవైష్ణవమతసంప్రదాయ నియమావళి గ్రంథాలు, 2)ఆధ్యాత్మిక గ్రంథాలు, 3)శ్రీవైష్ణవమతశాస్త్రాలు, 4)ఆచార కాండ గురించి గ్రంథాలు, 5)భక్తిప్రబోధాత్మకగ్రంథాలు, 6)సాహిత్యపర మహాకావ్యాలు.

వేదాంతదేశికులవారి దయాశతకం భగవచ్చింత నాశీలమైన మధురకావ్యం. తమ తిరుమలయాత్రలో దేశికులు ఉల్లేఖించిన నూటఎనిమిదిశ్లోకాలకావ్యం భక్తుల పూజలందుకుంది.

ఈ స్తోత్రం శ్రీవేంకటేశ్వరుని ఆంతరిక గుణమైన 'దయ'ను సంబోధిస్తుంది. భగవంతుని అపారదయ వేంకటాద్రిలో వ్యక్తమైనంతగా మరెక్కడా వ్యక్తం కాదని ఆ క్షేత్రం, తండోపతండాలుగా కొండనెక్కి వచ్చి శరణువేడి కోరికలీడేర్చుకునే అసంఖ్యాక భక్తజనావళి, వేలసంవత్సరాల నుండి ఋజువు చేస్తూనే ఉన్నాయి. ఆపన్నుల ఆక్రోశాన్ని తీర్చాలని ఉప్పొంగే దయాగుణంతో విరాజిల్లుతాడు తిరుమల శ్రీవేంకటేశ్వరుడని దేశికులవారి భావన.

వేదాంతదేశికులుగా ప్రసిద్ధి వహించిన శ్రీవేంకటనాథులు భగవద్రమానుజాచార్యుల తరువాత బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపబడ్డవారు.

"రామానుజుల అవతారసమాప్తి తరువాత వారిలో కొందరు తాత్త్వికతవైపు మొగ్గుచూపితే మరికొందరు ఆచారాల వైపు మళ్లిపోయారు అయినా దేశికులవారు శ్రీవైష్ణవుల ఐక్యతకు కృషిచేసినవారే. వారు "ఓ భగవాన్! ఇతరులపట్ల అసహనాన్ని రేకెత్తించే పరదోషాలను ఎత్తిచూపే గుణాన్ని మానుంచి దూరం చేయి" అనేవారు.

"మోక్షం కాంక్షించేవారు కొందరు కర్మపై ఆధారపడతారు. మోక్షార్థులు మరికొందరు జ్ఞానాన్ని కోరుకుంటారు. మోక్షగాములైన మేము హరిభక్తుల పాదరక్షలను నమ్ముకొంటాం" అన్నదే వేదాంతదేశికులవారి హృదయం.

- డా॥ సుబ్బలక్ష్మి మర్ల

# ఆటల నోము

గృహలక్ష్మి



**ఈ నెల 31న అట్లతద్దె**

ఆశ్వయుజ బహుళతదియ ఆంధ్రులకు అట్లతద్దిగా వ్యవహరింపబడుతోంది. అట్లతద్దికి ఉట్టికింది ముద్ద తినడం ఊయల లూగడం, గోరింటాకు పెట్టుకోవడం, తద్దినోములు నోచడం, ఆంధ్రులందరికి చిరపరిచితాలైన విషయాలే. అయితే ఉత్తరాదివారు ఈ అట్లతద్దినోమును ఆశ్వయుజ బహుళచవితి నాడు 'కడవాచౌత్' అనే పేరుతో చేస్తారు. ఇది వారికి కార్తికబహుళ చవితికింద లెక్క. ఎందుచేతనంటే వీరికి పౌర్ణమినుంచి నెల మొదలవుతుంది. ఈ నోముకి సంబంధించి ఉత్తరాదిన ప్రచారంలో ఉన్న కథ.

ఒక ఊరిలో ఒక షావుకారుడున్నాడు. అతనికి ఏడుగురు కొడుకులు, ఒక కూతురు. చెల్లెలు పక్కన లేనిదే అన్నలు భోజనం చేసేవారు కాదు. ఒకసారి కార్తికబహుళచవితి వచ్చింది (ఇది మనకు ఆశ్వయుజ బహుళచవితి అవుతుంది. అంతకు ముందురోజే మన అట్లతద్ది). అన్నలు చెల్లెలిని భోజనానికి రమ్మనగా ఆమె "ఈరోజు 'కడవాచౌత్' వ్రతం చేస్తున్నాను. చంద్రోదయ మయేదాక భుజించరాదు" అనగా అన్నలు చంద్రోదయం వరకూ తమ చెల్లెలు ఆకలిబాధ కోర్వలేదని తలచి ఒక అన్న దీపం వెలిగించగా ఇంకొక అన్న అద్దంలో ఆ దీపాన్ని కప్పి కపటచంద్రుణ్ణి సృష్టించి చెల్లెలికి చూపించారు. చెల్లెలు నిజంగానే చంద్రోదయమైందని తలచి చంద్రునికి అర్ఘ్యమీయడానికి రమ్మని వదినలను పిలిచింది. వారు "నీ చంద్రుడు ఉదయించాడేమో, మా చంద్రుడింకా ఉదయించలేదు పొమ్మ"నగా ఆమె ఒక్కతే చంద్రునికి అర్ఘ్యమిచ్చి భోజనానికి కూర్చోగా మొదటి ముద్దలోనే వెంట్రుక వచ్చింది. రెండో ముద్దలో రాళ్లు వచ్చాయి. మూడవముద్దనోట్లో పెట్టుకోబోతుంటే ఆమె అత్తవారింటినుంచి ఆమె భర్త జబ్బుతో ఉన్నట్లు ఆమెను వెంటనే పంపమని వార్త వచ్చింది. ఆమెను పంపేటప్పుడు తల్లి "అమ్మా దారిలో ఎదురైనవారందరకి పాదాభివందనం చెయ్యి, ఎవరైనా 'సౌభాగ్యవతీభవ' అని ఆశీర్వదిస్తే కొంగుముడి వేసుకుని వారికి కొన్ని బంగారుకాసులు ఇచ్చివెళ్లు" అని చెప్పింది. చెల్లెలు అన్నలవద్ద సెలవు తీసుకుని బయలుదేరింది. దారిలో కనబడినవారంతా "ఏడుగురన్నల చెల్లెలా నీ అన్నలంతా సుఖంగా ఉండాలి, నువ్వు వాళ్ల సుఖం చూడాలి" అని ఆశీర్వదించారే తప్ప ఎవ్వరూ సౌభాగ్యవతీభవ" అని ఆశీర్వదించలేదు.

ఆమె అత్తవారిల్లు చేరేసరికి గుమ్మంలో ఆఖరి ఆడబడుచు నిలబడి ఉంది. ఈమె ఆమెకు కూడ పాదాభివందనం చేయగా ఆమె 'సౌభాగ్యవతీభవ, పుత్రవతీభవ' అని ఆశీర్వదించింది. ఇది విన్న తక్షణం ఆమె కొంగుకి ముడివేసుకుని ఆడబడుచుకి బంగారుకాసు ఇచ్చింది. లోపలికి పోయేసరికి అత్తగారు, నేలమీద పడివున్న ఆమెభర్తని చూపింది. ఈమె భర్తచెంత కూర్చుని అతనికి సేవలు చేస్తోంది. అత్త మిగిలిపోయిన పదార్థాలు దాసిచేత పంపితే అవి తిని భర్తకు సేవచేస్తూ కాలక్షేపం చేస్తూండగా మార్గశిర బహుళచవితి వచ్చింది. అప్పుడు చవితిమాత "ఏడుగురన్నల ముద్దుల చెల్లెలా కడవ తీసుకో, కడవ తీసుకో" అని చెప్పగా ఆమెను ఎక్కడా కానక చెల్లెలు "తల్లీ నా ఈ దీనస్థితికి కారణమైన నీవే నన్నుద్ధరించాలి, నా ఐదవతనం నాకివ్వాలి" అని కోరగా చవితిమాత "నా తరువాత పౌషచవితి వస్తుంది. ఆమె నాకన్న పెద్దది, నీ గోడు ఆమెకు వినిపించు ఆమె నీకు సౌభాగ్యం ఇస్తుంది అని చెప్పింది. ఈవిధంగా పుష్య, మాఘ, ఫాల్గుణ, చైత్ర, వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ, శ్రావణ, భాద్రపదచవితులు వచ్చి అదే ప్రకారం చెప్పి వెళ్లిపోయాయి. ఆశ్వయుజచవితి కూడ వచ్చి "నీపైన

కార్తికచవితి ఆగ్రహం చెందింది. ఆమే నీ సౌభాగ్యం తీసుకు పోయింది కనుక ఆమే తిరిగి ఈయగలదు కనుక ఆమె కాళ్లు పట్టుకుని ప్రార్థించమని చెప్పి వెళ్లిపోయింది.

కార్తికబహుళచవితి వచ్చింది. ఆమె అత్యంతక్రోధంతో–

"ఏడుగురన్నల ముద్దులచెల్లీ కడవతీసుకో
పగలు చంద్రుణ్ణి ఉదయింపజేసేదానా కడవ తీసుకో
వ్రతభంగం చేసేదానా కడవతీసుకో
ఆకలికి ఆగలేనిదానా కడవతీసుకో" –

అనగా ఆమె కాళ్లమీద పడి అనేకవిధాల ప్రార్థించింది. "తల్లీ నా సౌభాగ్యం నీ చేతిలోఉంది, నీవే నన్ను సౌభాగ్యవతిని చేయాలి" అని ప్రార్థించగా మాత "ఓసీ పాపాత్మురాలా! హంతకురాలా! నా కాళ్లు పట్టుకుని ఎందుకు ప్రాకులాడతావు" అని చీదరించగా ఏడుగురన్నలచెల్లెలు "తల్లీ నావల్ల అపరాధం జరిగింది క్షమాభిక్ష వేడుతున్నాను. ఇంకెప్పుడూ ఇలాంటి తప్పిదం చేయనని" విన్నవించగా చవితిమాత ప్రసన్నురాలై కళ్ల నుండి కాటుక, గోళ్లనుంచి గోరింటాకు, బొట్టునుంచి కుంకుమ తీసుకుని చిటికెనవ్రేలితో ఆమె భర్తపై చిలకరించగా అతడు నిద్రనుంచి లేచినట్లు లేచి ఈరోజు చాలాసేపు నిద్రపోయాను అనగా "ఏమినిద్ర నాథా పన్నెండు నెలలయింది. ఇప్పటికి చవితిమాత అనుగ్రహించి నాకు సౌభాగ్యం ప్రసాదించింది" అని చెప్పగా అతడు "అయితే వెంటనే ఉద్యాపన చేసుకో" అన్నాడు. చవితికథ విని కడవపూజ చేసి ప్రసాదం తిన్నారు. దాసివచ్చి ఇది చూచిపోయి ఆమె అత్తగారికి చెప్పింది. అప్పటి నుంచి ఆ గ్రామంలో చవితిమాత పూజచేసినట్లయితే అఖండ సౌభాగ్యం చేకూరుతుందని ప్రసిద్ధి కలిగింది. షావుకారు కూతురి కిచ్చినట్లే చవితిమాత అందరికీ సౌభాగ్యమీయాలి. ఇదే కడవాచవితియొక్క పురాతన ప్రసిద్ధి.

## పూజావిధానం

ఉత్తరాదివారికి 'కడవాచౌత్' కార్తికబహుళచవితి రోజున అవుతుంది. ఇది మనకు ఆశ్వయుజబహుళచవితిరోజు అవుతుంది. ఆరోజున ప్రాతఃకాలాన లేచి స్నానాదికాలు ముగించుకుని చెక్కపీటమీద జలంతో నిండిన లోటాపెట్టాలి. వాయన మివ్వడానికి ఒక చిన్న మట్టికడవతీసుకుని అందులో గోధుమలు వేసి పైన మూతలో పంచదార, నగదు రూపాయలు పెట్టాలి. తరువాత దానికి కుంకుమబొట్లు పెట్టి బెల్లం, బియ్యంతో పూజచేయాలి. తరువాత 13సార్లు కడవని చేతితో తట్టి దానిని పీటచుట్టూ 7 సార్లు తిప్పాలి. తరువాత గణపతి విగ్రహంగానీ పిండిగణపతి (మనకు పసుపుగణపతిలాగా) గాని ఉంచి, కుంకుమ, బియ్యం, బెల్లం సమర్పించాలి. తరువాత 13 గోధుమ గింజలు చేతిలోనుంచుకుని కథ వినాలి. కథ విన్నాక కడవమీద చేయి తిప్పి అత్తగారికి పాదాభివందనం చేయాలి. తరువాత 13 గోధుమగింజలు, లోటా యథాస్థానంలో ఉంచాలి. రాత్రి దాకా ఉపవాసముండి రాత్రి అయ్యాక చంద్రుణ్ణి చూచి అర్ఘ్య మీయాలి. తరువాత ప్రసాదం తిని ఉపవాసం ముగించాలి.

కడవాచవితి పూజ చేసే స్త్రీ తన చెల్లెలికి, కూతురికి, వ్రతానికి కావలసిన సామగ్రి తప్పనిసరిగా పంపాలి. చంద్రోదయానంతరం ఉపవాసదీక్ష ముగించేటప్పుడు భర్త చేతుల మీదుగా నీళ్లుగాని, పానీయంగాని సేవించాలి, జల్లెడలోనుండి చంద్రుణ్ణి చూడాలి. ఉత్తరాదివారు ఈవ్రతాన్ని సామూహికంగా నిర్వర్తిస్తారు. ముందుగా అనుకున్న ఒకరి ఇంట్లో వ్రతం చేసుకునే స్త్రీలంతా కలుసుకుని సాయంసంధ్యాసమయంలో పూజాసామగ్రి అమర్చిన పళ్లాలలో దీపం వెలిగించి వృత్తాకారంగా కూర్చుని 'కడవాచౌత్' పాట పాడుతూ ఒకరిపళ్లాలు మరొకరి కందించుకుంటారు. పాట ముగిసేసరికి ఎవరిపళ్లెం వారిచేతిలోకి వస్తుంది. తరువాత పూజచేయించిన బ్రాహ్మణుడికి దక్షిణలు సమర్పించి ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లి చంద్రదర్శనం చేసి భర్త చేతిమీదుగా ఉపవాసదీక్ష ముగిస్తారు. ఈ పూజవల్ల సత్సంతాన సౌభాగ్యాలు ఒనగూడతాయని వీరి నమ్మకం. వ్రతం చేసేవారు పెళ్లినాటి పట్టుచీర ధరించి సర్వాభరణభూషితలై భర్తక్షేమంకోరి శ్రద్ధాభక్తులతో ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ముందురోజు చేతులకు గోరింటాకు పెట్టుకుంటారు. ఇది సౌభాగ్యచిహ్నం. పూజకు చిన్నమట్టి కడవను పెట్టి దానినే చవితిమాతగా భావించి పూజచేసి వాయన దానం చేయడంవల్ల ఈ నోముకు 'కడవాచౌత్' అనే పేరు వచ్చింది. మనం ఏ నోము చేసుకున్నా వాయనం తల్లికి ఇచ్చే ఆచారం ఉంది. వీరు వాయనం అత్తగారికి ఇస్తారు.



తైలధారవలే నిశ్చలంగా ఉండే మనోవృత్తే భక్తి

# ద్వాపర ద్వీపమే.. కలియుగ వేలుపు

- శ్రీ దేసు వేంకట సుబ్బారావు, 91600 53535



ఈ నెల 23న పాయ్‌గైఆళ్వారు వర్షతిరునక్షత్రం

ద్వాపరయుగాంతంలో, సిద్ధార్థినామసంవత్సరం, తులామాసం, శుక్లపక్షం అష్టమిరోజు పాంచజన్య అంశతో ఒకానొక సరస్సులో స్వర్ణవర్ణపద్మంనుండి అవతరించారు. అందువల్లనే వీరికి సరోయోగి అని పేరు, అదే పేరు ప్రసిద్ధి కూడా!

కాంచీపురంలో ఏకామ్రేశ్వరుడి ఆలయంతోపాటు వరదరాజపెరుమాళ్ ఆలయం ప్రసిద్ధమైంది.

ఆ పెరుమాళ్ ఆలయప్రాంగణంలో ఒక 'కోనేరు' ఉంది. ఆ కోనేరును ఆనుకొని పూదోట ఉంది. ఆ పూదోటలోని పుష్పాలు, ఫలాలు, జలబిందువులు అన్నీ శ్రీవరదరాజస్వామి కైంకర్యానికే వినియోగించేవారు. ఈ పూలతోట శ్రీపొయ్‌గై ఆళ్వారుల జన్మస్థలం. పొయ్‌గై అనగా కోనేరు అని అర్థం.

ఉదయాత్పూర్వం శ్రీ వరదరాజస్వామి పూలతోటలో నుండి ఒక పసిబాలుని కంఠధ్వని ఆ ప్రాంతవాసులను నిద్ర నుండి మేల్కొల్పింది. ఉలిక్కిపడ్డ ఊరివారంతా ఉద్యానవనం చేరారు. ఆ తోటలోని కొలనివద్దగల ఒక మొగిలిపొదచాటున స్వర్ణవర్ణపద్మంపై తేజోవిరాజితుడైన బాలుణ్ణి చూచారు. బాలునికి సంబంధించిన వారెవరైనా ఉన్నారా! అని చుట్టూ గాలించారు. ఎవరూ కనిపించలేదు. బాలుని నోట వెలువడింది ఆకలి ఆక్రందన కాదు, నిద్రాణమైన భక్తి చైతన్యానికి చేసిన శంఖానాదం. అదే వైష్ణవారాధనకు పిలుపునిచ్చిన ఆహ్వానాలాపన. ఆ బాలుని చెంత, దరిదాపున ఎవరూ లేకపోవటంతో చేసేదేమి లేక ఆ బాలునికి గోక్షీరం అందించారు అక్కడివారు. బాలుడు రోదన ఆపి కేరింతలు కొట్టాడు. ఆ బాలుని తల్లితండ్రులు కనిపించేవరకు అక్కడివారే ఆ బాలుణ్ణి చేరదీయడానికి ఉపక్రమించారు. ఆ బాలుని దివ్యతేజస్సుకు ముచ్చటపడి ఆ పిల్లవాడి ఆలనా పాలన చూడ్డానికి అక్కడివారు పోటీపడ్డారు. ఆలయప్రాంగణంలో పెరుగుతున్నందువల్ల బాలుడు క్రమేపీ బాల్యచేష్టలు మాని దైవ చింతనకు లోనయ్యాడు. దినదిన ప్రవర్ధమానుడౌతున్న ఆ బాలుడు, దైవం ఆదేశించినట్లుగా నిరంతరం ధ్యానముద్రలో ఉండేవాడు. అందుకే అక్కడివారు ఈ బాలకుడిని సరోయోగి, కాసారయోగి, పొయ్‌గైఆళ్వారు అని పిలవసాగారు.



ఆ బాలకుడికి అక్కడివారు ఒక ఆశ్రమం నిర్మించి అతని ధ్యానానికి ఆటంకం రాకుండా చూడసాగారు. అతణ్ణి శ్రీమహావిష్ణువు పంచాయుధాలలో ఒకటైన పాంచజన్య అవతారంగా భావించారు. భక్తిచైతన్య శంఖారావమే వీరసాహిత్యం. ప్రతినిత్యం ఈ పొయ్‌గైయాళ్వారు నగరసంచారం చేస్తూ, భగవంతునిపై ఆశువుగా పాశురాలను గానం చేస్తుండేవారు. వీరు పరవశంతో చేసే భగవద్గానానికి అక్కడి పరిసరాలు పరవశించి పులకించిపోయేవి.

"పాంచజన్యాన్ని పూరించి వైరులహృదయాలను ఛేదించి, ఆశ్రితులను కాపాడిన గీతాచార్యుడైన శ్రీకృష్ణుడే భూలోకంలోని వేంకటాచలంలో అఖిల ప్రాణికోటికి తన దివ్య దర్శనం ప్రసాదించడంకోసం వేంచేసి ఉన్నాడు.

వైదికులందరు నలుదిక్కులనుండి ధూప, దీప, పుష్ప, తీర్థాది పూజాద్రవ్యాలతో పురుషోత్తముణ్ణి ఆరాధించడంకోసం ఈ తిరువేంగడాన్ని ఆశ్రయిస్తున్నారు. మీరూ కదలిరండని" భక్తజనాన్ని తమపాశురాలతో ఆహ్వానించేవారు.




# స్వామి అనుకుంటే ఎంతసేపు..

– శ్రీ ఎం.సత్యనారాయణ, 99088 80082

వెదురుకుప్పంమండలం, పాతగుంటగ్రామం మాది. మా తండ్రిగారు కె.వి.ఎం.అగ్రహారం గ్రామకరణం. మాది మధ్య తరగతి కుటుంబం. కొద్దిగా పొలం ఉండేది. వర్షాలు లేక పంటలు సరిగా పండేవికావు. నేను స్కూల్ ఫైనల్‌వరకు వెదురు కుప్పం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో, యూనివర్సిటీ కోర్సు తి.తి.దే. శ్రీగోవిందరాజస్వామిఆర్ట్స్‌కళాశాలలో చదువుకున్నాను.

1971 సంllలో మా మేనమామ కూతురుతో నా వివాహం జరిగింది. 1972 సంllలో మాకు సంతానం కలిగింది. కానీ నాభార్యకు పక్షవాతం వచ్చి మాటపోయింది. రుయాఆసుపత్రిలో చేర్పించాం. నిత్యం గోవిందునికి, గోవింద నామాలకు నమస్కారం చేసేది. గోవిందుని దయవల్ల గోవిందా అని బిగ్గరగా అరిచింది. అప్పటినుండి కొద్దిగా మాటలు వచ్చాయి. 48 సంllలు పక్షవాతంతో, మూర్ఛరోగంతో బాధ పడింది. కానీ శ్రీవారి కృపవల్ల కొంత ఉపశమనం లభించింది.



1971 సంllలో శ్రీవారి గుడి ముందు నిలబడి నాకు ఉద్యోగం ఇప్పించమని ప్రార్థించాను.

మా తండ్రిగారు కొంతపొలం అమ్మి వేసినారు. బి.ఏ. ప్రైవేటుగా రాయడానికి కొంతసొమ్ము ఇచ్చారు. దానితో 1975లో బి.ఏ., 1977లో ఎం.ఏ. ప్రైవేటు విద్యార్థిగా డిగ్రీలు సంపాదించాను. మా తల్లిగారు ఆమె నగలు అమ్మి మచిలీ పట్నంలో బి.ఇ.డి. చదివించింది.

1981 సంllలో చిత్తూరుజిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి నుండి తిరుమలతిరుపతిదేవస్థానంలో అటెండర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ కాగితం వచ్చింది. 500మంది హాజరయ్యారు. అందులో నేను ఎంపికయ్యాను. అసిస్టెంట్ పోస్టుకు రంగారెడ్డి జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌నుండి 8మంది శాఖాపరమైన 12మంది ఉద్యోగులకు ఇంటర్వ్యూ జరిపి నన్ను శ్రీవారిమహిమ వల్ల ఎంపిక చేశారు.

1988 సంllలో శ్రీవారి మహిమవల్ల శ్రీగోవిందరాజ స్వామి ఉన్నతపాఠశాల, తిరుపతికి బదిలీ చేశారు. ఆ తర్వాత తిరుమలశ్రీవేంకటేశ్వర ఉన్నతపాఠశాల, తిరుపతి శ్రీవేంకటే శ్వర ఉన్నత పాఠశాల మరల శ్రీవేంకటేశ్వర ఉన్నత పాఠశాల (తిరుమల)కు బదిలీ చేశారు.

2005 సంllలో శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలకు పౌరనీతిశాస్త్ర అధ్యాపకునిగా, 2007 సంllలో శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్‌కళాశాలకు రాజనీతిశాస్త్ర ఉపన్యాసకుడిగా పదోన్నతి వచ్చింది. 2008 సంllలో శ్రీగోవిందరాజస్వామిఆర్ట్స్ కళా శాలకు రాజనీతిశాస్త్రప్రధానాచార్యునిగా శ్రీవారిమహిమ వల్ల పంపారు. 2009 సంllలో పదవీవిరమణ పొందాను. శ్రీవారి కృప వల్లన ఇంత గొప్పస్థితికి రాగలిగాను. శ్రీవారి కృప వల్ల మా శ్రీమతికి స్విమ్స్ ఆసుపత్రితో వైద్యసేవలు లభించాయి. స్వామి మహిమలు అనంతం. నమ్మినవారిని, కోరినవారిని ఎంత ఉన్నతస్థాయికైనా తీసుకెళ్లుతారు.



# ఒక పిలుపులో.. పిలిచితే పలుకుతావట!

- ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు, 78939 82500

తిరుమలకొండకు భక్తులు మొక్కులు చెల్లించుకునే సంప్రదాయం ఉంది. ఇది అనేకరకాలు. వారివారి భక్తి ప్రపత్తులను బట్టి, వారివారి ఆర్థికస్థితి గతులను బట్టి, వారివారి నమ్మకాలను బట్టి ఈ మొక్కులు, వీటిని చెల్లించుకునే విధానం ఉంటుంది. ఇంటి ఇల్లాలు గర్భం ధరిస్తే, ఆమె భర్త, లేక ఆమె మామ, లేదా ఇరువురు స్వామివారికి తలనీలాలు సమర్పిస్తామని మొక్కుకుంటారు. ఆమె గర్భవతి కాగానే కొన్ని నాణేలు (ఒకప్పుడు మూడు పావలా నాణేలు, లేదా మూడు అర్ధరూపాయి నాణేలు, లేదా మూడురూపాయి నాణేలు, లేదా మూడు రకాల నాణేలు ఒకటొకటి) తెల్లని గుడ్డను, పసుపులో తడిపి, పసుపు గుడ్డగా తయారుచేసి ఆ గుడ్డలో కట్టి, ఇంటిలో ఉండే పాలు, పెరుగుభద్రంగా ఎత్తి పెట్టుకునే ఉట్టి త్రాటికి కట్టేవారు. దీన్నే ముడుపు కట్టడం అనేవారు. మొక్కు కున్నవారు ఆనాటి నుండి గడ్డం గీసుకోరు, తలవెంట్రుకలు కత్తిరించరు. కాన్పు జరిగిన తరువాత వారికి వ్యవసాయాది ఒత్తిడులు తగ్గిన సమయంలో ఇంటి నుండి ఆ ముడుపును తీసుకుని తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకుని తలనీలాలు అర్పించి, ఆ ముడుపును స్వామివారి హుండీలో (వారివారి స్తోమతను బట్టి ధనంతో కలిపి) సమర్పించేవారు.

ఇంటిలో ఎవరికైనా ఆరోగ్యం బాగలేకపోయినా, వ్యవసాయ అనుకూలత సరిగా లేకపోయినా తమ జీవితాలకు ఆధారభూతాలైన పశువులు, బఱ్ఱెలు, గొర్రెలు, మేకలు మొదలైనవాటి అభివృద్ధికోసం కూడా ఈ ముడుపు కట్టడం ఉండేది. కొందరు వివాహాలకు సంబంధించి కూడా ముడుపు కట్టేవారు. అంటే ఇంట్లో పెండ్లి కావలసిన పిల్లలకు తగిన సంబంధం తగిన సమయంలో కుదరనపుడు ముడుపు కట్టేవారు.

ఈ ముడుపు కట్టడంలో మరొక పద్ధతి కూడా ఉండేది. గొఱ్ఱెలలో ఒక పొట్టేలు పిల్లనుగాని, బఱ్ఱెలలో ఒక దున్నపోతునుగాని, పశువులలో ఒక లేగదూడను గాని స్వామివారి కోసం వదిలి వేసేవారు. దేనినైతే స్వామివారి కోసం వదిలివేస్తారో దానిని పెంచి పెద్దచేసి అమ్మి, ఆ వచ్చిన ధనాన్ని ఆ ముడుపుతో సమర్పించేవారు. ఉదాహరణకు గొర్రెల అభివృద్ధి సరిగాలేకపోతే "గొర్రెలు బాగా అభివృద్ధి అయితే ఇదిగో ఈ గొర్రెపిల్లను స్వామికి ఇస్తామని" ముడుపు కడతారు. ముడుపు కట్టారంటే అది ఆ రోజునుండి స్వామివారిదే నన్నమాట. అట్లే బఱ్ఱెల విషయం, పశువుల విషయంకూడా. అయితే పశువుల విషయంలో మరొక విధానం కూడ ఉంది. ఒక లేగదూడను స్వామికి అర్పిస్తారు. ఈ దూడను స్వామికి "మీది తీసి వదిలేసినాం" అని అంటారు. అది కొంచెం పెద్దదైతే "దేవుని కోడె" అని, ఇంకా పెద్దదయితే "దేవుని ఎద్దు" అని అనేవారు. ఆ పశువును ఏ పనికి ఉపయోగించేవారు కాదు.



అది ఎవరి పంటపొలంలోకి పోయి మేసినా దాన్ని ఎవరూ ఏమి అనరు. ఎవరైనా తెలిసోతెలియకో దాన్నికొడితే "దేవు నెద్దును కొట్టినాడు వీడు బాగుపడడు" అనేవారు. అది మరణిస్తే మనిషి శవాన్ని పూడ్చి పెట్టినట్లుగా దాని శవాన్ని పూడ్చేవారు.

పంటల విషయంలో కూడా ఈ మీది దీసి కట్టే విధానం ఉండేది. పంటలు రోగానికి గురైనపుడు, వర్షం రాక ఎండిపోతుందేమో అని భయం కలిగినపుడు, పంట దిగుబడి సరిగా రాదేమోనని భయం కలిగినపుడు "నాకు ఇన్ని మూటలు (బస్తాలు) వస్తే నీకు ఇంత ధనం హుండీలో వేస్తా"నని కొన్ని నాణేలను పసుపుగుడ్డలో మూటకట్టి పెట్టడం (అంటే ప్రమాణ చిహ్నం) ఉండేది.

బహుశా ముడుపు కట్టడం అంటే ఒక రకంగా ప్రమాణం లేక శపథం లేక ప్రతిజ్ఞ చేయడమని. మీది కట్టడం




అంటే "స్వామీ ఇది మీది" (నీది అనే భావనతో) అని నిర్ధారించి చెప్పడం కావచ్చు. కాలక్రమంలో రెండూ కలిసిపోయినట్లుంది. ముడుపు కట్టినామని కొందరు, మీది తీసి కట్టినామని కొందరు కలగలిపి వాడేస్తున్నారు. ఏది ఏమైనా ముడుపైనా, మీది అయిన అది స్వామివారిది అని భావన.

"తలనిల్లుగట్టు వ్రతంబుల రాయడు" అని కూడా స్వామివారిని అంటారు. అంటే, ఇంటియందు ముడుపులు కట్టేవిధానం ఒక వ్రతంగా కలిగిన భక్తులు గల రాయడు అని భావించవచ్చు. అంతేగాక తలనీలాలు గ్రహించటం వ్రతంగా (పనిగా) గల రాయడు అని భావించవచ్చు.

శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులందరూ ఏకకంఠంగా పిలిచే పిలుపుల్లో "అడుగడుగుదండాలవాడా! ఆపదమొక్కుల వాడా!! అనేదొక జంట పిలుపు.

"ఆపద మొక్కులవాడా" అనే పిలుపులో "తలనిల్లుగట్టు వ్రతంబుల రాయని" అనేమాట ప్రోద్బలకంగా ఉంది. కానుకలు లేక ముడుపులు పసుపుగుడ్డలలో కట్టి నెత్తిమీదపెట్టుకుని నడిచివెళ్లేవారు భక్తులు.

కుండలినీయోగపరంగా చూస్తే 'తల' అంటే శిరస్సులో ఉండే సహస్రారచక్రం. ఈ యోగంలో మూలాధారం నుండి సహస్రారం వరకు ఏడుకొండలని, చెబుతారు. షట్చక్రాలు, షట్పద్మాలు, ఆరడవులు అనడం సాంకేతికమైన మాటలు. ఉన్నవి ఆరుచక్రాలే!

ఏడవది సహస్రారం. ఇదే ఏడవకొండ. అందుచేత కొండలనడం పరిపాటి. ఊరు కొండవీడు, ఉనికి పశ్చిమవీధి. మూగచింతపల్లి మొదట యిల్లు.... అనే వేమన పద్యం సాంకేతిక, ప్రతీకార్థం గలది. ఇక్కడ 'కొండవీడు' అంటే సహస్రారచక్రం. కొండపై ఉన్న ఇల్లు నివాసస్థానమని అర్థం. అదే సహస్రారం.

అక్కడ పద్మం బోర్లించినట్లుగా ఉంటుందని శాస్త్రం చెబుతోంది. ఆరుచక్రాల తర్వాత ఏడవది సహస్రారం. వేయిరేకులు గల పద్మం. అదే తిరుమలపైగల ఏడవకొండ. శ్రీవైష్ణవయోగులు అనగా విష్ణుభక్తయోగులకు యోగసిద్ధి కల్గినప్పుడు సహస్రారంలో 'లక్ష్మీనారాయణులు' దర్శనమిస్తారు.

అద్వైతయోగులకు 'పార్వతీపరమేశ్వరులు' సాక్షాత్కరిస్తారు. శాక్తేయులకు శివశక్తులు ప్రత్యక్షమౌతారు. 'తలనిల్లుగట్టు వ్రతంబులు రాయని' యోగనిష్ఠాగరిష్ఠులైనవారికి సహస్రార మనే శిరఃస్థానంలో దర్శనమిచ్చే రాయడు లక్ష్మిని వక్షఃస్థలంలో గల శ్రీవేంకటేశ్వరస్వామియని గూడ సంభావించవచ్చు.

యోగవ్రతానుష్ఠానులకు తలలో సహస్రారంలో ఇల్లు కట్టుకుని స్థిరనివాసంగా ఉన్న లక్ష్మీనారాయణులే- తిరుమలపై గల శ్రీవేంకటేశ్వరస్వామి.

వక్షఃస్థల వ్యూహలక్ష్మితో స్థిరనివాసంగా ఉన్న శ్రీవేంక టేశ్వరస్వామి.

'తల' అంటే కొండపైభాగం. ఏడవకొండపై గల దేవాలయంలో అర్చామూర్తిగా వెలసినవాడని కుండలినీ యోగసంబంధంగా సమన్వయం.

ఇక్కడ తిరుమలకొండకు చుట్టుప్రక్కల ఉండే పల్లె టూళ్లలోని కొన్ని విషయాలు గమనింపదగి ఉన్నాయి. పల్లె టూర్లలో ఆనాటి గృహనిర్మాణాలలో ఉన్నతకుటుంబీకులే గాక మధ్యతరగతి కుటుంబీకులు కూడా దేవుడికని ప్రత్యేకంగా ఒక గదినిగాని, లేక ఒక పూరిల్లుగాని నిర్మాణం చేసేవారు. ఉన్నత కుటుంబీకులు తమ భవంతిలో నైఋతిభాగంలోని గదిని దేవుడి కోసం కేటాయించేవారు. మధ్యతరగతికుటుంబీకులు ఒక చిన్న పూరిల్లునుగాని లేదా తాము ఉంటున్న పూరికొటా లలో లేదా పాకలలో నైఋతిభాగంలో కొంత తడికలు లాంటివి అడ్డంగా కట్టిగాని దేవుడికి కేటాయించేవారు. కొందరు ప్రత్యేకంగా 'దేవుడిల్లు' అని నిర్మించేవారు. అది మేడలో భాగం కావచ్చు. లేదా ఒక పూరిల్లు కావచ్చు. సామాన్యంగా తాము నివసిస్తున్న స్థలంలో నైఋతిభాగంలో గుండ్రని ఆకారంలో ఈ దేవుడిల్లు నిర్మించేవారు.

ప్రతి శనివారం ఉపవాసం ఉండి, మధ్యాహ్నం దేవు డింట్లో పూజలు చేసి ఆ ఇంటిలోనే ప్రత్యేకమైన పాత్రలలో వండిన పదార్థాలను దేవుడికి నైవేద్యం పెట్టి ఆ ఇంటిలోనే భోజనం చేసేవారు. సాయంత్రం ఆ రోజు (శనివారం) అల్పా హారం మాత్రమే తీసుకునేవారు. ఆ ఇంటిలో వంటకు ఉప యోగించే పాత్రలు, ఆ ఇంటిలోనే ప్రత్యేకంగా ఉంచేవారు. ఇతరపాత్రలతో అది ఎట్టి పరిస్థితిలోను కలపరు. వండడానికి, వార్చడానికి (పాత్రలు, గరిటెలు, మూకుడులు) అన్నీ ప్రత్యేకంగా ఉండేవి. శనివారం ఆకులతో కుట్టిన విస్తరిలోనే అంటే విస్తరాకులలోనే భోంచేసేవారు. ఈ సంప్రదాయం మధ్య తరగతి కుటుంబాలలో ఎక్కువగా ఉండేది. వీరి కుటుంబాలలో తప్పనిసరిగా ప్రతిశనివారం మధ్యాహ్నం తలస్నానాలు చేసి మూడు నామాలు (రెండు తెల్లనామాల మధ్య ఒక ఎర్రనామం) పెట్టుకునేవారు. ఈ నామాలు వేసుకోవడానికిగాను అవసర మైన సామాను పెట్టుకోవడానికి ఒకరకమైన తీగతో అల్లిన చిన్నపెట్టె ఉండేది. దానిని 'తిరణం పెట్టె' అనేవారు. ఆ పెట్టెకు నాలుగువైపులదారాలు కట్టి ఎక్కడైన పైభాగాన వేలాడకట్టే వారు. దాన్ని క్రింద పెట్టడం అపవిత్రంగా భావించేవారు. శని వారం మధ్యాహ్నం నైవేద్యానికి విస్తరాకులలో వండిన వంట కాలను దేవుడి ముందుంచి పూజలు చేసేవారు. ఆ వంటకాల మీద తప్పక ఆవునెయ్యి వేసేవారు. ఇంటిలో బర్రెలు, గొఱ్ఱెలు పశువులు ఎన్ని ఉన్నా, శనివారం దేవుడికని పశువుల పాలను కొన్ని వేరుగా కాచి నెయ్యి చేసేవారు. మిగిలిన అన్ని పాలను కలిపిన నెయ్యిని, అమ్ముకోవడం గాని, మిగిలిన రోజులలో వాడడంగాని చేసేవారు. ఒక్కొక్కసారి కపిలవర్ణం గల పశువులు పాలు ఇచ్చేకాలంలో వాటి పాల నేతినే దేవుడికి ఉపయోగించే వారు. దేవుడిపటాలు, దేవుడి సామాను, ఆ ఇంటికి సంబం ధించిన పాత్రలు మాత్రమే ఆ ఇంట్లో ఉండేవి. ఇంటి వ్యక్తులు తప్ప వీలైనంతవరకు మరెవ్వరిని ఆ ఇంటిలోనికి అనుమతించే వారు కాదు. కొంతమంది కుటుంబీకులు ఇలాంటి పద్ధతిని కలిగి ఉండి శనివారం ఏ పరిస్థితిలోను మాంసాహారం తీసు కునేవారు కాదు.

మరికొన్ని కుటుంబాలవారు తిరుమల శనివారాలలో అంటే తిరుమలలో బ్రహ్మోత్సవం జరిగే మాసంలో వచ్చే నాలుగు లేదా ఐదు శనివారాలల్లో ఉపవాసాది కార్యక్రమాలు నిర్వహించేవారు. ఈ కుటుంబాల వారు పవిత్రంగా చూచుకునే ఆ 'దేవుడిల్లును', 'పెద్దిల్లు' అని కూడ పిలిచేవారు. అట్లే, 'తల్లిల్లు' అని కూడ అనేవారు. (అగ్నిహోత్రారాధన చేసే శ్రోత్రియుల ఇండ్లను 'నల్లిల్లు/ నల్లిండ్లు' (హోమధూమంచే నల్లగా ఉండే ఇళ్లు అన్నట్లుగా) శ్రీవేంకటేశ్వరునికి ముడుపుకట్టడం, మీది కట్టడం అనేవి ఈ ఇంటిలోనే జరిగేవి.



ఆయుర్వేదం

**అక్టోబరు 1న ప్రపంచ శాకాహార దినోత్సవం**

# ఎవరెన్ని చెప్పినా.. ఇదే ఉత్తమం...

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

జీవజాతి మనుగడకు ఆహారం అత్యంతావశ్యకం. ఈ ఆహారాన్ని శాకాహారం, మాంసాహారం అని స్థూలంగా రెండువిధాలుగా చెప్పుకోవచ్చు.

మానవశరీరం, అవయవాలు, దేహనిర్మాణం శాకాహార సేవనకు అనుగుణంగా ఉంటుంది. ఉదాహరణకు మనం తిన్న ఆహారంలోని పిండిపదార్థాలను జీర్ణం చేసే ప్రత్యేక ఎంజైమ్ నోట్లో స్రవించే లాలాజలంలో ఉంటుంది. ఈ లాలాజలం కూడా శాకాహారజీవుల్లో క్షారగుణాన్ని కల్గి తక్కువ గాఢత కలిగి ఉంటుంది. శాకాహార జీవుల ప్రేవులు పొడవు ఎక్కువగా ఉండి ఆహారం సులువుగా జరగడానికి అనుకూలంగా ఉంటుంది. అంతేగాకుండా పీచుపదార్థం(ఫైబర్) శాకాహారంలో ప్రత్యేకంగా ఉంటుంది. ఇందువల్ల తీసుకున్న ఆహారంలోని విటమిన్స్, మినరల్స్‌ని ప్రేవులు బాగా శోషించుకుంటాయి. మలబద్ధక సమస్య ఉండదు. కోలాన్ కేన్సర్ దరిచేరకుండా కాపాడటంతో పాటు, గుండెజబ్బులు రాకుండా రక్షణ కలిగిస్తుంది.

శాకాహారం వల్ల అగ్నిమాంద్యం, అజీర్ణం, పొట్ట ఉబ్బరం, అపానవాతం, మలబద్ధకంలాంటి సమస్యలు దరిచేరవు.

ఆధ్యాత్మికకోణంలో ఆలోచించినా శాకాహరమే ఉత్తమోత్తమమైంది. మనం తినే ఆహారం పైనే మన మనస్సు ఆధారపడి ఉంటుంది.

సత్వగుణప్రధానమైన శాకాహారాన్ని సేవించటం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. కోపం, ఈర్ష్య, ద్వేషం, ఉద్రేకంలాంటి చెడులక్షణాలు రాకుండా ఉంటాయి. ఆవేశ స్థాయికంటే ఆలోచనాస్థాయి పెరగటం, మేధాశక్తి, తెలివి తేటలు, మంచిచెడుల విచక్షణాశక్తి, నిర్ణయశక్తి, విశ్లేషణాశక్తి, జ్ఞాపకశక్తి ఇత్యాదులు ద్విగుణీకృతమౌతాయి. మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

*"తప్పుగా తింటే ఏ వైద్యుడు బాగు చేయలేడు.*
*సరిగ్గా తింటే ఏ వైద్యుడూ అవసరం లేదు."*

## శ్రీకృష్ణామృతం..



మూసి ఉంచకే నీవు మనోగవాక్షము నెపుడు
మదిని మాధవుండు కొలువుతీరేనే
అంధకారము అంత అజ్ఞానతిమిరంబు
జ్ఞానమను జ్యోతినీ వేలుగనీవే

పూజలయ్యవి ఏవే పూబోణి వినుకోవే
ప్రియమార మాధవుని పిలచి కొలచేవే
హెచ్చు ద్రవ్యములు కావు హిరణ్యభూషణములు కావు
హృదిని నైవేద్యముగ అర్పించుకోవే

మోక్షమనగ నది ఏమి? మరి కైవల్యమన నేమి?
మనవారి నెడబాసి మౌనధ్యానములేమి?

పగలు రేయనక నెపుడు పనిభారమున్నపుడు
పలుమార్లు గోవింద అని తలచుకోవే

ఆత్మ అనగనది ఏమి? ఆ పరమాత్మ యననేమి
ఆత్మపరమాత్మ నడుమ అంతరములవి ఏమి?
అంత యోచనలేల? ఆ కాలయాపనలేల?
అచ్యుతుని శరణనవే అంతయును వాడే

-'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు,
99103 45794




# సత్యమే జయిస్తుంది

-శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు,
94907 99203

ఒకసారి ఇంద్రసభలో విశ్వామిత్రుడు "హరిశ్చంద్రుడి చేత నేను అబద్ధం చెప్పిస్తాను" అని ప్రతిజ్ఞ చేశాడు.

కొంతకాలం తరువాత విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని దగ్గరకు వెళ్లి "యజ్ఞం చేయడానికి, ధనం అవసరం అవుతుందని, ఆ ధనాన్ని సమకూర్చమని" అడిగాడు. హరిశ్చంద్రుడు ఇస్తానని వాగ్దానం చేశాడు. విశ్వామిత్రుడు సంతోషించి "ఇప్పటికి ఆ ధనం నీ వద్దనే ఉండనివ్వు. నేను యజ్ఞం ఆరంభించే సమయంలో అడిగి తీసుకుంటాను" అని వెళ్లిపోయాడు.

కొన్ని రోజుల తర్వాత కొందరు రాజ్యపౌరులు కోటకు వచ్చి "క్రూరమృగాలు తమ పంటలను, గృహాలను నాశనం చేస్తున్నాయని, వాటిని అరికట్టి తమని కాపాడమని హరిశ్చంద్రుడితో మొర పెట్టుకున్నారు. ప్రజల క్షేమం కోరే రాజుగా ఆయన వెంటనే అరణ్యానికి వెళ్లి క్రూరమృగాలను వేటాడాడు. ఆ సమయంలో విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని దగ్గరికి మాతంగ కన్యల్ని ప్రవేశపెట్టారు. తమ ఆటపాటలతో హరిశ్చంద్రుడిని ఆకట్టుకోవాలని ప్రయత్నించారు. అతను వారిని మందలించి తగిన విధంగా బుద్ధి చెప్పి పంపించాడు.

తన కుమార్తెలవంటి మాతంగకన్యలను బాధపెట్టినందుకు హరిశ్చంద్రుని మీద విశ్వామిత్రుడు కోపగించి "ఇప్పటికైనా మించిపోయింది లేదు. వారి కోరిక తీర్చు" అని చెప్పాడు.

"తాను ఏకపత్నీవ్రతుడుని కనుక ఆ వ్రతానికి భంగం కలిగించే ఏ పనీ చేయలేనని, అవసరమైతే తన రాజ్యాన్నైనా ఇస్తానని" హరిశ్చంద్రుడు చెప్పాడు. అదే అదనుగా "అయితే నీ రాజ్యాన్ని ఇచ్చేసి వెళ్ళిపో" అన్నాడు విశ్వామిత్రుడు.

హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి రాజ్యాన్ని ధారపోసి భార్యాకుమారులతో నగరం విడిచిపెట్టడానికి సిద్ధమయ్యాడు.

అప్పుడు విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని దగ్గరకు వచ్చి "తనకు ఇస్తానని వాగ్దానం చేసిన ధనాన్ని వెంటనే ఇవ్వమని' అడిగాడు. ""రాజ్యం మొత్తం మీకు ధారపోశాను. నా వద్ద ప్రస్తుతం ధనం లేదు. మీకు వాగ్దానం చేసిన ధనాన్ని ఇవ్వడానికి కొంత గడువుకావాలి." అన్నాడు హరిశ్చంద్రుడు.

విశ్వామిత్రుడు సరేనని చెప్పి ధనాన్ని వసూలు చేసుకురమ్మని తన శిష్యుడు నక్షత్రకుడిని వారితో పంపించాడు.

వారంతా కాశీనగరానికి బయల్దేరారు. వారు ప్రయాణం మొదలు పెట్టిన దగ్గర నుండి దారి పొడుగునా హరిశ్చంద్రునికి కలిగిన బాధలు ఇంతా అంతా అని చెప్పలేనివి. రాజసభ తప్ప మరేమీ తెలియని హరిశ్చంద్రుడు, ఎండకన్నెరుగని అతని భార్య చంద్రమతి, అతిసుకుమారుడు అతని కుమారుడు లోహితాస్యుడు అనేకకష్టాలు అనుభవించారు. ఆ బాధలు చాలవన్నట్టుగా నక్షత్రకుడు మాటిమాటికీ అబద్ధం చెప్పమని ఒత్తిడి తెస్తున్నా హరిశ్చంద్రునిలో మార్పు రాలేదు.

కాశీనగరం చేరుకున్న తర్వాత హరిశ్చంద్రుడు తన భార్యను కాలకౌశికుడనే బ్రాహ్మణునికి దాసిగా అమ్మివేసి, వచ్చిన ఆ ధనాన్ని విశ్వామిత్రునికి ఇవ్వమని నక్షత్రకుడితో చెప్పాడు. "అది తన దారి ఖర్చులకే సరిపోదు. ఇంక విశ్వామిత్రునికి ఇవ్వడానికి ఏమి మిగులుతుంది?" అని అడిగాడు నక్షత్రకుడు.

తాను కూడా ఎవరికైనా అమ్ముడుబోయి ధనాన్ని ఇస్తానని దాన్ని విశ్వామిత్రుడికి అప్పు చెల్లించమని హరిశ్చంద్రుడు చెప్పాడు.

ఆ మాటలు విన్న నక్షత్రకుడు హరిశ్చంద్రుణ్ణి తీసుకువెళ్లి వీరబాహుడు అనే కాటికాపరికి అమ్మగా, వచ్చిన ధనాన్ని విశ్వామిత్రుని అప్పుగా చెల్లించాడు. అయినప్పటికీ హరిశ్చంద్రుని కష్టాలు తీరలేదు. సరికదా ఎక్కువయ్యాయి.

హరిశ్చంద్రుడి చేత అసత్యం పలికించడానికి విశ్వామిత్రుడు చేయని ప్రయత్నం లేదు. అతనికి ఏదో విధంగా బాధలు పెడుతుంటే అవి ఓర్చుకోలేక ఏదో ఒక బలహీన క్షణంలో అసత్యం పలుకుతాడని విశ్వామిత్రుని ఉద్దేశం.

హరిశ్చంద్రుడిని కొనుక్కున్న వీరబాహుడు స్మశానంలో పని చేయమని అతడిని పంపించాడు. స్మశానవాటికకు

శవాలను దహనం చేయడానికి తెచ్చే బంధువులనుండి సుంకం వసూలు చేసి శవాలను దహనం చేయడం హరిశ్చంద్రుడి పని.

ఒకరోజు లోహితాస్యుడు దర్భలకోసం అరణ్యానికి వెళితే అక్కడ అతడినొక పాము కాటు వేసింది. దాంతో అతడు మరణించాడు. దుఃఖాన్ని భరిస్తూనే తన యజమాని ఇంటిపనులన్నీ పూర్తి చేసుకుని, రాత్రి వేళ కుమారుడి శవాన్ని తీసుకుని స్మశానానికి వెళ్ళింది చంద్రమతి.

ఆమె దగ్గర స్మశానవాటికకు సుంకం చెల్లించడానికి అవసరమైన డబ్బు లేదు. సాధారణ పనిమనిషిలా ఉన్న ఆమెను రాత్రి చీకట్లో హరిశ్చంద్రుడు గుర్తు పట్టలేదు. అక్కడ స్మశానవాటిక దగ్గర విధినిర్వహణలో ఉన్నది హరిశ్చంద్రుడే అని చంద్రమతి కూడా గుర్తు పట్టలేదు.

సుంకం డబ్బు ఇవ్వకుండా శవదహనానికి అంగీకరించనని కచ్చితంగా హరిశ్చంద్రుడు ఆమెతో చెప్పాడు. తన వద్ద చిల్లిగవ్వ కూడా లేదని విలపిస్తూ చెప్పిందామె. దాంతో హరిశ్చంద్రుడికి ఆమె మీద జాలి కలిగినా “నా యజమాని మాట జవదాటి నేను ప్రవర్తించలేను. నీ మెడలో ఉన్న మంగళసూత్రం అమ్మి అయినా సుంకం డబ్బుతీసుకురా” అని చెప్పాడు.



అది విన్న చంద్రమతి ఆశ్చర్యపోయింది. తన మంగళసూత్రం కేవలం తన భర్తకు తప్ప మరెవరికీ కనిపించదని వశిష్ఠుడు వాక్కు ఉండగా ఈయనకు మంగళసూత్రం ఎలా కనబడింది? ఇతనే తన భర్త అని గుర్తించింది.

కుమారుడి మృతదేహాన్ని చూచి హరిశ్చంద్రుడు ఎంతో దుఃఖించాడు. కానీ, తన యజమాని ఆజ్ఞ దాటకూడదు. కాబట్టి ఆమెవద్ద నుండి సుంకం వసూలు చేయాలని భావించాడు. చంద్రమతి మెడలో ఉన్న మంగళసూత్రాన్ని అమ్మి ఆ ధనాన్ని సుంకంగా జమచేయమని చెప్పాడు. మంగళసూత్రాన్ని అమ్మి ధనం తీసుకురావాలని చంద్రమతి అంగడికి వెళ్లింది.

రాజకుమారుడుని చంపిన నేరానికి మరణశిక్ష విధించాడు రాజు. ఆమె తల నరకమని చెప్పి స్మశానానికి హరిశ్చంద్రుని దగ్గరకే తీసుకువెళ్లారు భటులు.

ఆమె నిరపరాధి అని తెలిసినప్పటికీ రాజాజ్ఞ పాటించాలన్న ఉద్దేశంతో ఆమె తలమీద కత్తితో వేటు వేశాడు హరిశ్చంద్రుడు. కానీ, ఆ కత్తి పుష్పమాలగా మారి ఆమె మెడని అలంకరించింది.

ఇంద్రాది దేవతలు హరిశ్చంద్రుని ముందు ప్రత్యక్షమై “అవన్నీ అతడి చేత అసత్యం పలికించడానికి కల్పించిన కష్టాలని” చెప్పారు.

విశ్వామిత్రుడు వచ్చి హరిశ్చందుని చేత అసత్యం పలికించ లేకపోయినట్లు ఒప్పుకున్నాడు. “నీ సత్యనిష్ఠ సామాన్యమైంది కాదు, ఎన్నివిధాల పరీక్షించినా గెలిచావు.. నీకు అపారమైన కీర్తి వస్తుంది” అంటూ దీవించాడు విశ్వామిత్రుడు. హరిశ్చంద్రుని సత్యశీలతకి మెచ్చి అతని కొడుకును సజీవుణ్ణి చేశారు. అతడి రాజ్యం తిరిగి అప్పగించారు. అతనికి శాశ్వతమైన కీర్తి లభించింది. ఎన్నికష్టాలు ఎదురైనా చలించక చివరివరకు సత్యనిష్ఠ అవలంబించిన హరిశ్చంద్రుడు నాటి నుండి సత్యహరిశ్చంద్రుడిగా పిలవబడుతున్నాడు.

# అక్టోబరు, 2023 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం-** సమాజంలో మీకు విలువ, ఆదరణ పెరుగుతుంది. స్నేహితులు, బంధువులు మిమ్మల్ని గౌరవిస్తారు. సంతానం పోటీ పరీక్షలలో రాణిస్తుంది. వాహనసౌఖ్యం ఉంటుంది. ప్రయత్నించిన పనులు నెరవేరుతాయి.



**వృషభం-** సర్వత్రా అనుకూలవాతావరణం ఉంటుంది. స్నేహితుల వల్ల ధనయోగం కల్గుతుంది. సామాజికజీవనం గౌరవప్రదంగా ఉంటుంది. పుణ్యక్షేత్రసందర్శన భాగ్యం వస్తుంది.



**మిథునం-** మీ ప్రయత్నాలు సానుకూలఫలితాలను అందిస్తాయి. బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మీ విలువను గుర్తిస్తారు. ఈకాలంలో చాలా మానసికప్రశాంతతను అనుభవిస్తారు. నూతనవ్యాపారాలలో కాలం కలసి వస్తుంది.



**కర్కాటకం-**గృహవాతావరణం బాగుంటుంది. నియామకపు పరీక్షలలో గెలుపొందుతారు. అవసరాలకు ధనంలభిస్తుంది. గతంలో చేసిన బాకీలు తీరే అవకాశం ఉంది.



**సింహం-** సంపద, ఆనందం, విద్యలో విజయం. కొత్తవ్యక్తులను కలవడానికి, వారి సహవాసాన్ని ఆస్వాదించడానికి ఇది మంచి కాలం.



**కన్య-** ఆర్థికలాభాలు కలుగుతాయి. చోరీకి గురికాకుండా సంపాదించిన డబ్బును సంరక్షించుకోవడం మంచిది.



**తుల-** తోబుట్టువులనుండి కూడా కొన్ని లాభాలను ఆశించవచ్చు. శుభవార్తలు వస్తాయి. పిల్లలు చదువుల్లో రాణిస్తారు. ఈ సమయంలో సమాజంలో మీ హోదా, గౌరవం పెరుగుతాయి. శస్త్ర చికిత్సలకు గురయ్యే అవకాశం ఉంటుంది.



**వృశ్చికం-** ధనధాన్యలాభాలు. భూగృహస్థిరాస్తుల వృద్ధి. సంతోషకరమైన వాతావరణం, నిత్యం గృహంలో మృష్టాన్నభోజనం, సంతృప్తి.



**ధనుస్సు-** ఈ కాలంలో ఉద్యోగంలో ఉన్నతి లేదా జీతం పెంపు జరుగవచ్చు. కొత్త అవకాశాలను పొందుతారు. పైఅధికారుల ప్రశంసలను, పొందుతారు. కుటుంబం, స్నేహితులు మిమ్మల్ని గౌరవిస్తారు.



**మకరం-** ఆర్థికపరంగా ఖర్చు తగ్గించుకోవడం మంచిది. మానసిక ప్రశాంతత లోపించడం, శత్రువుల నుండి సమస్యలు దూరమవడానికి చంద్రుణ్ణి ఆరాధించడం మంచిది.



**కుంభం-** ఆధ్యాత్మిక, దైవసంబంధకార్యాల్లో పాల్గొంటారు. కుటుంబవృద్ధి కల్గుతుంది. మీ ప్రయత్నాలలో అధికధనాన్ని నిల్వ చేస్తారు. విందువినోదాలలో పాల్గొంటారు. ధార్మికసంస్థలకు విరాళాలిస్తారు.



**మీనం-** ఆధ్యాత్మిక, దైవసంబంధకార్యాల్లో పాల్గొంటారు. కుటుంబవృద్ధి కల్గుతుంది. సంపదవృద్ధి చేస్తారు వృత్తివ్యాపారాలు చాలా అనుకూలంగా ఉంటాయి. ఉపకారభావం, మరింత చొరవ, ధైర్యంతో అందరినీ ఆకట్టుకుంటారు.



చిత్ర కథ

# ఆ.. నీళ్లే కదా అని అనుకోగూడదు

కథ- డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు- శ్రీ తుంబలి శివాజీ





మహర్షీ! ఎన్ని దానాలు చేసినా ఉత్తమగతులు కలుగలేదు. మూడుసార్లు చాతక రూపాన్ని, ఒక జన్మలో గ్రద్ద రూపాన్ని, ఏడు జన్మలలో కుక్క రూపాన్ని పొంది ఇప్పుడు ఈ రూపంలో ఉన్నాను. నన్ను కాపాడండి..
ఓ రాజా! నీవు వేంకటాచలంపై జలదానం చేయలేదు. నీళ్లకు విలువ లేదని భావించి భక్తులకు ఇవ్వలేదు. అందుకే నీకు ఈ దుర్గతి!
మహాత్మా! మరి దీనికి తరుణోపాయం లేదా...?
శ్రీవేంకటాచలంలో నేను చేసిన పుణ్యాన్ని నీకు పాపశాంతి కోసం ధారపోస్తాను. దాంతో నీ ప్రారబ్ధకర్మ నశిస్తుంది...
మహర్షి అనుగ్రహంతో రాజుకు సకలపాప నివారణం జరిగింది.
మహర్షీ! మీ వలన నా పాపాలన్నీ నశించాయి.. శ్రీవేంకటాచల క్షేత్రంలో జలదానం చేస్తే విష్ణులోకం ప్రాప్తిస్తుందని, నా జీవితం ద్వారా భావితరాలకు తెలియజేసేలా అనుగ్రహించండి..
తథాస్తు! ఒక్క నీవే కాదు. వేంకటపర్వతంపై తమ తమ శక్తి ననుసరించి జలదానం చేయడం అందరి కర్తవ్యం.
2

# బాలవినోదం

## కంఠస్థం చేయండి!!

దసరా పదిరోజుల్లోనూ 8వ రోజున అమ్మ 'దుర్గాదేవి' అలంకారంలో ఉంటుంది. 'దుర్గ' అంటే ఎవరి చేతనూ జయింపబడనిదీ, ఎవరికీ శక్యం కానిదీ అని అర్థం. దేవతలందరినుండీ వారివారి తపశ్శక్తులు దాగి ఉన్న ఒక్కో ఆయుధాన్ని తాను స్వీకరించి సర్వదేవతా శక్తుల్నీ కలిగి ఉంటుందీ రోజున అమ్మ.

ఏ వైపునుండీ ఎలాటి భయమూ ఉండకుండా ఉండేందుకు ఈ రోజున వీలైనన్ని ఎక్కువసార్లు ఈ క్రింది శ్లోకాన్ని మననం చేయడం మంచిది.

దుర్గే! స్మృతా హరసి భీతి మశేషజంతోః
స్వస్థైః స్మృతా మతిమతీవ శుభాం దదాసి।
దారిద్ర్య దుఃఖ భయహారిణి కాత్వదన్యా
సర్వోపకార కరణాయ సదార్ద్రచిత్తా॥

## ఏ వాహనం ఎవరిది?



జవాబులు-
1)దుర్గామాత 2)శివుడు 3)గజలక్ష్మి
4)వినాయకుడు 5)కుమారస్వామి
6)సరస్వతి

## సంఖ్యావినోదం



| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 3 | 3 | 6 | 7 |
| | | ↓ | 1 | 2 | 7 | 9 |
| 3 | 2 | 1 | 5 | 6 | 5 | 7 |
| 4 | 8 | 3 | 11 | 10 | 9 | 8 |
| 5 | 6 | 7 | 10 | 11 | 12 | 18 |
| 8 | 3 | 8 | 14 | 17 | 13 | 19 |
| 14 | 7 | 9 | 11 | 13 | 14 | 17 |
| 18 | 11 | 10 | 15 | 16 | | |
| 13 | 12 | 13 | 14 | ↳ | | |

1 నుండి 16 వరకు ఉన్న సంఖ్యలు వరుసగా కలుపుతూపోతే దుర్గామాత రాక్షసుణ్ణి సంహరించిన మార్గం వస్తుంది.

## అంకెలు కలపండి!!

పిల్లలూ! అంకెలు కలుపుతూ పోతే ఏమి వస్తుందో చూడండి!



# రంగుల ప్రపంచం

బాలచిత్రకారులూ!
రంగులు ఉన్న బొమ్మను చూసి, ఆ రంగులనే.. రంగులు లేని బొమ్మకు వేయండి!!







# పిల్లలూ! దారి కనుక్కోండి!!



ఏ దారిలో వెళితే బొమ్మలకొలువును చూడవచ్చు!



# పిల్లలూ.. ఈ బొమ్మల్లో 7 తేడాలు గుర్తించండి!





విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## గోచికంటె దరిద్రం లేదు

ఈతకంటె లోతు నెంచగ పనిలేదు;
చావుకంటె కీడు జగతి లేదు;
గోచిపాతకంటె కొంచెంబు మరి లేదు;
విశ్వదాభిరామ వినుర వేమ!

**అర్థాలు:** కీడు= చేటు; ఎంచగ= లెక్కించు; జగతి= లోకంలో; గోచిపాత= మొలతాడు ముందు వైపునుంచి వెనుకకు (మానం కనిపించకుండా) చుట్టుకొనే బట్ట.

**భావం:** ఈతకొట్టడానికి లోతును లెక్కించే పనిలేదు. లోకంలో చావును మించినచేటు లేదు. గోచి పాతకంటె మించిన లేమిడి లేదు.

**వివరణ:** ఈత చేత నైనవాడు నీళ్ల లోతును గురించి ఆలోచించడు. ఈతను మించిపోయేలోతు లేదు. అలాగే చావును మించినకష్టం లేనేలేదు. చచ్చినతరువాత ఇంక ఏమి కష్టాలు వస్తాయి. కష్టాలన్నిటికీ పరాకాష్ట చావు.

దరిద్రంవల్ల తిండి దొరకనివాడు తినక పోయినా, సిగ్గు దాచుకోవడానికి వస్త్రం చుట్టు కుంటాడు. దానికీ లేకపోతే అధమపక్షంగా పాతదైపోయినగోచి అయినా పెట్టుకుని మానం దాచుకుంటాడు. అందుచేత పాత గోచిని మించిన దరిద్రం లేదు అంటారు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

## చెరపకురా చెడేవు!

చ. ఆదర మింతలేక నరుఁ డాత్మబలోన్నతి మంచివారికిన్
భేదము చేయటం దనదు పేర్మికిc గీడగు మూలమెట్లమ
ర్యాదహిరణ్యపూర్వకశిపన్ దనుజుండు గుణాఢ్యుఁడైనప్ర
హ్లాదునకెగ్గుచేసి ప్రళయంబునుబొందcడె మున్నుభాస్కరా!

**తాత్పర్యం**

భాస్కరా! మానవుడు తనుకు బలముంది కదా అని మంచివాళ్లపట్ల ఆదరం మరచి వారిని కష్టపెట్టాలని చూస్తే, అది అతడి ఉన్నతికి కీడు కలగజేసే మూల కారణమౌతుంది. హిరణ్యకశిపుడు గొప్పగుణాలు గల తన కొడుకు ప్రహ్లాదుని పట్ల అనాదరంతో, అతడికి కీడు చేయదలచి తానే నాశనమయ్యాడు కదా!

ఆర్థికబలం, అధికారబలంతో కన్నుమిన్ను కానక మంచివారికి అపకారం చేయాలనుకోవడం ఆత్మనాశనానికే! బ్రహ్మచే వరాలు పొందిన హిరణ్యకశిపుడు గర్వంతో, తన తమ్ముణ్ణి చంపిన విష్ణువుపై పగతీర్చుకోవాలనుకున్నాడు. విష్ణువు అతగాడికి కన్పించలేదు. అయితే హిరణ్యకశిపుని కొడుకు ప్రహ్లాదుడు పరమ విష్ణుభక్తుడయ్యాడు. అది సహించలేక కొడుకనీ, పసివాడనీ కూడా చూడకుండా అనేకరకాలుగా హింసించాడు. విష్ణువు అనుగ్రహంతో ప్రహ్లాదుడు వాటన్నిటిని సునాయాసంగా భరించాడు. కోపం పేట్రేగిన హిరణ్యకశిపుడు కొడుకును "ఏడిరా! విష్ణువు? ఎక్కడున్నాడు?" అని ప్రశ్నించగా, అంతటా నిండి ఉన్నాడని సమాధానం చెప్పాడు ప్రహ్లాదుడు. ఈ స్తంభంలో ఉన్నాడా? అని అడిగి గదతో స్తంభాన్ని విరుగగొట్టాడు హిరణ్యకశపుడు. అందులో నుండి నరసింహరూపంతో వెలువడ్డ విష్ణువు తన గోళ్లతో హిరణ్యకశిపుణ్ణి చీల్చి చంపివేశాడు. కనుక, సజ్జనులకు అపకారం చేయ బూనడం, తమకు తాము అపకారం చేసుకోవడమేనని పద్య సారంశం.

– డా॥ వద్దేపల్లి శ్రీనివాసరావు

# క్విజ్ 15

01) ఆలయపాలన? జ)..........
02) జగత్తు నిర్మాణానికి మూలపురుషుడు? జ)..........
03) విష్ణు పాదోద్భవ? జ)..........
04) వైకుంఠం ఎన్ని భాగాలు....? జ)..........
05) ఋష్యశృంగమహర్షి కుటీరం ఉన్న పర్వతం? జ)..........
06) అద్వైతసిద్ధాంతానికి ప్రాముఖ్యత కల్పించినవారు? జ)..........
07) వేదాంతదేశికులకు ప్రశాంతతను ప్రసాదించిన క్షేత్రం? జ)..........
08) ఈ మాసంతో సమానమైన మాసం లేనే లేదు? జ)..........
09) అవయవదోషాలు పోగొట్టే దేవుడు? జ)..........
10) శ్రీనివాసుడి ప్రియసఖుడు? జ)..........
11) లోహితాస్యుడెవరు? జ)..........
12) వరదరాజపెరుమాళ్ ఆలయం ఎక్కడ ఉంది? జ)..........
13) తైలధార వలే నిశ్చలంగా ఉండే మనోవృత్తి? జ)..........
14) కడవాచౌత్ అంటే? జ)..........
15) శ్రీవైష్ణవుల ఐక్యతకు కృషి చేసినవారు? జ)..........
16) వేదాంతదేశికుల రచనలు ఎన్ని రకాలు? జ)..........
17) శృంగేరి పీఠానికి ఎన్ని శాఖలున్నాయి? జ)..........
18) తిరుమల స్వామివారికి జరిగే తొలిసేవ? జ)..........
19) గరుడోత్సవం రోజు నూతన గొడుగులు ఎక్కడి నుండి వస్తాయి? జ)..........
20) రత్నాల్లో గొప్పది? జ)..........

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-10-2023.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........
పాఠశాల: .......... తరగతి: ..........
పేరు: ..........
చిరునామా: ..........
..........
..........
.......... పిన్‌కోడ్: ..........
ఫోన్ సంఖ్య: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్,
కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________

______________________

______________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) ☐☐☐☐☐☐

సెల్ నెం. ☐☐☐☐☐☐☐☐☐☐☐

**2.** కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.................................................. తేది : ....................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 93

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | ■ | 4 | |
| | ■ | | ■ | | ■ | ■ | | ■ |
| 5 | | | ■ | 6 | | 7 | | ■ |
| | ■ | ■ | ■ | | ■ | | ■ | 8 |
| 9 | 10 | | 11 | | ■ | | ■ | |
| ■ | | ■ | | ■ | 12 | ■ | ■ | |
| 13 | | | ■ | 14 | | | ■ | |
| ■ | | ■ | 15 | ■ | ■ | ■ | 16 | |
| ■ | ■ | 17 | | | | | ■ | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)దసరాపండుగ ఈ రోజున జరుపుతారు(6); 4)విష్ణువు(2); 5)ప్రతిష్ఠాన పురాధీశ్వరుడు(3); 6)ఈ పర్వతంపై వృషభుడను రాక్షసుడు చంపబడ్డాడు. కనుక దీనిని ఇలా పిలుస్తారు(4); 9)శివుని చేతిలో ఉన్నది(5); 13)ఒక ఋతువు(3); 14)మహిషాసురుని తండ్రి(3); 16)కాంతి(2); 17)ఆశ్వయుజమాసారంభం నుండి దేవికి చేసే వ్రతం(5)

### నిలువు

1)ఈ నగరంలో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఉంది(5); 2)చంద్రవంశపు రాజు, నహుషుని కుమారుడు(3); 3)విజయదశమి రోజున ఈ వృక్షానికి పూజలు చేస్తారు(5); 4)శేషుడు వేంకటాద్రిని చుట్టుకొని ఉండగా వాయువు ఆ పర్వతాన్ని కదల్చి దూరంగా విసరాడు. కనుక, ఆ పర్వతాన్ని ఇలా పిలుస్తారు(3); 7)భరతుని కూతురు(3); 8)దుర్గ ఈ రాక్షసుణ్ణి సంహరించింది(6); 10)మహిషము పూర్వజన్మ(4); 11)ఆపస్తంభుని పుత్రుడు(2); 12)రాజు(2); 15)పరిచర్య, పూజ(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

## తిరుమల తిరుపతి దేవస్థానములు



25-08-2023న తిరుచానూరు
శ్రీపద్మావతీఅమ్మవారి ఆలయప్రాంగణంలో జరిగిన **శ్రీవరలక్ష్మీవ్రతం** దృశ్యాలు.
ఈ కార్యక్రమంలో తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.కరుణాకర రెడ్డి దంపతులు,
తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,
తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి (హెచ్.&ఈ) శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్.
తదితరులు పాల్గొన్నారు.







## తిరుమల తిరుపతి దేవస్థానములు



తి.తి.దే. పరిపాలనాభవనప్రాంగణంలో జరిగిన
భారతస్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు (15-08-2023)
ఈ సందర్భంలో తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు
శ్రీ బి.కరుణాకర రెడ్డి జాతీయజెండాను ఎగురవేశారు. వీరితో పాటు
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.,
భద్రతాసిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు.







SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-09-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

